24-05Pg1exHMNWJQE 1 VJA_24-05Pg1exHMNWJQE.qxd 23/May/26 11:58 PM Page 1




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM విజయవాడ fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-5-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 113 పేజీలు: 12 వెల: 8.00



ఇరాన్‌పై మళ్లీ అమెరికా దాడి! 9లో

నల్లకోటు న్యాయవాదుల్లో 40% నకిలీలే!


# గొడ్డలి పార్టీ డ్రామాలు చెల్లవు

## కోడికత్తి, గులకరాయితో ప్రజలను మోసం చేయలేరు..

## వివేకా హత్యలో లబ్దిదారు ఎవరో ప్రజలకు తెలుసు

## దళిత డ్రైవర్‌ను హత్య చేసిన నిందితునికి వైకాపా రక్షణ

## మాజీ సిఎం జగన్‌పై సిఎం చంద్రబాబు నిశిత వ్యాఖ్యలు



శనివారం 14 కండ్రిగ సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**చిత్తూరు, మే 23 ప్రభాతవార్త:** రాష్ట్రంను అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్తుండటంతో గొడ్డలి పార్టీ ఫ్రస్టేషన్‌తో తట్టుకోలేక పోతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. చిత్తూరు జిల్లా యాదమరి మండలం 14 కండ్రిగ గ్రామ సమీపంలో శనివారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీని గొడ్డలి పార్టీనే అని వాఖ్యలు చేశారు. రాష్ట్రంను ఐదేళ్ళ పాటు పరిపాలించిన వైకాపా పార్టీ అకృత్యాలను వివరిస్తూ అదే గొడ్డలి పార్టీ నైజం అని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నోరు తెరిస్తే అపద్దాలు చెప్తున్నాడని, రెండు రోజుల క్రితం మీడియా ముందు వచ్చిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాయ నాటకాలు వేసి వెళ్ళారని ఆరోపించారు. తాను 48 సంవత్సరాలుగా రాజకీయాల్లో వున్నానని, తనపై నక్సలైట్లు తిరుపతి వద్ద 23 క్లైమోర్ మైన్స్ పెట్టి దాడి చేశారని, వెంకటేశ్వరస్వామి తనకు పునర్జన్మ ఇచ్చారన్నారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీలకు చోటు లేదని, సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం అన్నారు. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అంటూ సిఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరిగిన వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు సంబంధించి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాటకాలు ఆడుతున్నారని, ఈ హత్యకు సంబంధించి అంతిమ లబ్దిదారులు ఎవరనే విషయం అందరికి తెలుసునన్నారు. వైఎస్ వివేకానందరెడ్డిని తాను హత్య చేసినట్లు ఇప్పుడు వచ్చి వైఎస్ జగన్ నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. అలాగే కోడికత్తి, గులకరాయి డ్రామాలు ఆడుతూ ప్రజలను మోసం చేసే ఎత్తుగడను వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అవలంభించారన్నారు. రాష్ట్రంలో వైకాపా అధికారంలో వున్న సమయంలో దళిత డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి డోర్ డెలవరీ చేశారని, డ్రైవర్‌ను హత్య చేసిన నిందిదుడికి వైకాపా అండగా నిలిచిందన్నారు. అలాగే కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి ఓ దళిత డాక్టర్‌పై దాడి చేసి ఆపై వైకాపా ప్రభుత్వం ఆ డాక్టర్‌ను వేధించి ప్రాణాలు తీసిందని ధ్వజమెత్తారు. మరోవైపు కుటుంబ బంధాలపై సైతం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గొడ్డలి వేటు వేశారని, తల్లికి, చెల్లికి ఆస్తి ఇవ్వకుండా వేధిస్తున్నారని, తల్లికి తిండి పెట్టని వాడు పిన్నమ్మకు బంగారు గాజులు ఇస్తాడంట! అని ఎద్దేవా చేశారు. తల్లి, చెల్లిని చూడని వారు ప్రజలను ఎలా చూస్తారో చెప్పాలని ఆయన ప్రజలను ప్రశ్నించారు. అలాగే హిందూ దేవాలయాలపై దాడులు, అపవిత్ర కార్యక్రమాలు చేపట్టి ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. మరోవైపు పోలవరం, అమరావతి, పెట్టుబడులు, అభివృద్ధిపై గొడ్డలి పార్టీ అసత్య ప్రచారాలు చేస్తోందని ధ్వజమెత్తారు. వైకాపా అధికారంలో వున్న సమయంలో రాష్ట్రంలో నడి రోడ్డుపై పలువురి పీకలు కోసి వైకాపా నాయకులు వారి రక్తదాహం తీర్చుకున్నారని ఆరోపించారు. మరోవైపు రాష్ట్రంలో గంజాయి బ్యాచ్‌ను ప్రోత్సహించి రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా లభ్యం అయ్యేలా చేశారని, జంతు రక్తంతో కటౌట్‌లకు అభిషేకాలు చేసి రప్పా.. రప్పా.. అంటూ రంకెలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. అలాగే వైకాపా నాయకులు కారు కింద సొంత పార్టీ కార్యకర్త సింగయ్యను తొక్కించారని, కడపలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య వ్యవహారంలో కీలకమైన పెద్ద దస్తగిరిని హత్య చేశారని ఆరోపించారు. మరోవైపు కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి వైకాపా >>2

## బిజెపికి రాజ్యసభ టిక్కెట్టు ఇవ్వలేం

### తేల్చిచెప్పిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో త్వరలో జరుగనున్న రాజ్యసభ స్థానాల ఎన్నికల్లో తమకు ఒక సీటు కేటాయించాలన్న బిజెపి అభ్యర్ధనకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు నో చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే బిజెపికి రాజ్యసభ సీటు కేటాయించిన క్రమంలో మళ్లీ సీటు ఆశించడం సరికాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారంటున్నారు. గత వైఎస్సార్సీపీ హయాంలో ఆ పార్టీ తరఫున రాజ్యసభకు ఎన్నికైన పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీతో పాటు, కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ తరఫున రాజ్యసభకు వెళ్లిన సానా సతీశ్ పదవీ కాలం వచ్చే నెలలో ముగుస్తోంది. దాంతో శాసన సభలో మెజారిటీ దృష్ట్యా ఈ నాలుగు స్థానాలూ కూటమికే దక్కేఅవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. సీఎం చంద్రబాబు రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై ఇంకా పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు. మహానాడు పూర్తయ్యాక, >>2




## మూడోసారి పెట్రో షాక్

### పెట్రోలు 87 పైసలు, డీజిల్ 91 పైసలు పెంపు

### పది రోజుల్లో దాదాపు రూ. 5 పెరిగిన ధర

**ముంబయి,మే 23:** సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మరోసారి ఇంధన ధరల భారం పడింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఇవాళ పెట్రోల్, డీజిల్ ధరలను మళ్లీ పెంచాయి. తాజా పెంపుతో పెట్రోల్‌పై లీటర్‌కు 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెరిగాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ. 99.51కి చేరగా, డీజిల్ ధర రూ. 92.49కి చేరుకుంది. గత 10 రోజుల వ్యవధిలో ఇంధన ధరలను పెంచడం ఇది మూడోసారి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ముడిచమురు ధరల భారాన్ని చమురు కంపెనీలు దశలవారీగా వినియోగదారులకు బదిలీ చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఈనెల 15న లీటరుకు ఏకంగా రూ. >>2



శనివారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో

## కీలక చర్చలు

### ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భేటీ

### ఇరాన్ సంక్షోభం ప్రత్యేక ప్రస్తావన

**న్యూఢిల్లీ, మే 23:** నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో శనివారం ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. వాణిజ్య, భద్రత సహా కీలక రంగాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ తరఫున మోడీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారత్‌అమెరికా మధ్య వాణిజ్యం విషయంలో విభేదాలు తలెత్తిన విషయం >>2

## గాలివాన బీభత్సం

**విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం సాయంత్రం తరువాత భారీ గాలివాన బీభత్సం సృష్టించింది. ఏపీలోని అనకాపల్లి, కాకినాడ, తెలంగాణలోని నాగర్‌కర్నూలు జిల్లాల్లో గాలితో కూడిన వర్షం అల్లకల్లోలం సృష్టించింది. గాలివాన బీభత్సం కారణంగా ఏపీలో ఇద్దరు, తెలంగాణలో ఒకరు మృత్యువాత పడ్డారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో దాదాపు అరగంట పాటు గాలి, వాన రావడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రమణయ్యపేట, ముకుందరాజుపేట, దోసల పాడు, చీడిక, జి.జగన్నాథపురం, గొడిచర్ల, డొంకాడ, చినదొడ్డిగల్లు, కాగిత జాతీయ, రహదారి వంటి >>2



వీచిన ఈదురు గాలులకు నారువ గ్రామంలో నేలకొరిగిన అరటి పంట

## ఈదురు గాలులకు భారీగా పంటనష్టం

### అరటి రైతులకు కోలుకోలేని దెబ్బ

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), మే 23 ప్రభాతవార్త:** అది నిన్నటి దాకా ఆ పచ్చని తోటలను చూసి మురిసిపోయిన కళ్లు.. చేతికందే పంటతో అప్పులు తీరిపోతాయని, ఇల్లు గడుస్తుందని ఆశపడ్డ గుండెలు. కానీ, ఆ ఆశలన్నీ ఒక్క రాత్రిలోనే గాల్లో కలిసిపోయాయి. ప్రకృతి కన్నెర్ర జేయడంతో రణస్థలం మండలం నారువ గ్రామంలోని అరటి రైతులు కోలుకోలేని ఆవేదనలో మునిగిపోయారు. శుక్రవారం రాత్రి ఒక్కసారిగా వీచిన ఈదురు గాలులు నారువ గ్రామ రైతుల పాలిట శాపంగా మారాయి. ఎంతో కష్టపడి, కంటికి రెప్పలా కాపాడుకుంటూ పెంచిన సుమారు 60 ఎకరాల అరటి తోటలు ఈ గాలుల ధాటికి పూర్తిగా నేలకొరిగాయి. పచ్చగా కళకళలాడాల్సిన తోటలన్నీ ఇప్పుడు విరిగిపడి స్మశానాన్ని తలపిస్తుంటే, ఆ దృశ్యాన్ని చూసి రైతులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. **ఒక్క రాత్రిలో అపార నష్టం:** ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా గ్రామానికి చెందిన నిద్రబంగి సూరిరెడ్డి, బోయి >>2



## ప్రభుత్వ విప్‌కు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్‌ఆర్ కడప జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన ప్రభుత్వ విప్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి అందజేశారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో శనివారం రైల్వే కోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తనపై వచ్చిన పలు ఆరోపణలు, నెలకొన్న వివాదాలపై వివరణ ఇచ్చారు. అనంతరం వ్యక్తిగత కారణాలతో విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పవన్‌కు తెలిపారు. అవన్ని పరిష్కరించుకున్న తరువాత బాధ్యతాయుతమైన పదవులను ఇస్తే నిర్వహిస్తానని శ్రీధర్ తమ పార్టీ >>2

## డబులింజన్ సర్కార్ వల్లే ఇబ్బడి ముబ్బడిగా ఉద్యోగాలు

### ఏపికి ఎక్కువ నిధులు తేవడంలో సిఎం చంద్రబాబు సక్సెస్


### రోజ్‌గార్ మేళాలో పాల్గొన్న కేంద్రమంత్రి బండి సంజయ్

### ఇప్పటి దాకా 12లక్షల మంది నియామకాలు పూర్తి



శనివారం గుంతకల్లులో నూతనంగా ఎంపికైన ఉద్యోగులకు నియామక పత్రాలు పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**అనంతపురం, మే 23, ప్రభాతవార్త బ్యూరో :** దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెంతుతోందని, డబుల్ ఇంజన్ సర్కార్‌లో కేంద్రం నుంచి నిధులు ఎక్కువ తీసుకురావడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సఫలీకృతులయ్యాడని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు మించి ఉద్యోగ కల్పనలో ముందుందని, వైరవిలకు, అవినీతికి ఆస్కారం కల్పించకుండా ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ దేశ సేవకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా 47 ప్రాంతాల్లో ఒకేసారి రోజ్ గార్ మేళా కార్యక్రమం నిర్వహణతో 51,000 మందికి పైగా యువతకు నియమక పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహణలో భాగంగా శనివారం గుంతకల్లు రైల్వే ప్రభాత్ క్లబ్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన యువతకు నియామక పత్రాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా, ఎడిఆర్‌ఎం బి.ఎస్.శివప్రసాద్, డివిజనల్ పర్సనల్ అధికారి హెచ్.ఎల్.ఎన్ ప్రసాద్, తదితర రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోజ్‌గార్ మేళాలో ఉద్యోగ నియామక పత్రాలు పొందుతున్న పలువురు అభ్యర్థులను ఉద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్, అధికారులు వర్చువల్‌గా వీక్షించారు..ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కల్పన మరియు రోజ్‌గార్ మేళా భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తూ చేపట్టిన అతిపెద్ద కార్యక్రమం 'రోజ్‌గార్ >>2



## మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో అగ్నిప్రమాదం

### కోట్లల్లో ఆస్తి నష్టం

**ముంచంగిపుట్టు మే 23 ప్రభాతవార్త:** మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో ప్రాజెక్టుకు కోట్లల్లో ఆస్తి నష్టం సంభవించింది. అందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆంధ్ర ఒడిస్సా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వ హిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగా >>2

## ఐక్య ఉద్యమాలతో ఫాసిస్ట్ శక్తుల కట్టడి

### అభ్యుదయ రచనలతో ప్రజల్లో చైతన్యం

### అరసం 23వ రాష్ట్ర మహాసభల్లో వక్తలు




**తిరుపతి,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** ప్రగతిశీల శక్తులు, వామపక్ష వాదులు తమ ఎజెండాలను పక్కనపెట్టి ఐక్య ఉద్యమాలు నిర్మిస్తేనే దేశంలో ఫాసిస్ట్ శక్తులను కట్టడి చేయవచ్చునని ప్రజాస్వామ్య రచయితల వేదిక జాతీయ సమన్వయకర్త ఆచార్య కాత్యాయని విద్మహే పేర్కొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర 23వ మహాసభలు తిరుపతిలో శనివారం ప్రారంభమయ్యాయి. గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్ లో ఉదయం అరసం జెండాను రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి సంజీవమ్మ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభలో డాక్టర్ కాత్యాయని విద్మహే మాట్లాడుతూ ఫాసిజానికి వ్యతిరేకంగా కమ్యూనిజం ను సుస్థిర పరచేందుకు అరసం ఏర్పడింది అన్నారు. నాటి నుండి రచయితలు చేసిన అనేక రచనలు సమాజం లో చైతన్యం తీసుకు వచ్చాయని అన్నారు. నేడు ప్రగతి శీల శక్తులు అనైక్యంగా ఉన్నాయని, ఫాసిస్టు శక్తులు మాత్రమే ఐక్యంగా ఉన్నాయని తెలిపారు. ఈ ధోరణి దేశానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రగతి శీల శక్తులకు ఎవరి ఎజెండాలు వారికి ఉన్నా, ఐక్య కార్యాచరణను బలంగా ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. అభ్యుదయ ఉద్యమాల్లో అస్తిత్వం ఉండడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని,

ఐక్య వామపక్ష ఉద్యమాలు బలపడితే దేశాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. ప్రశ్నించే వారిపై అర్బన్ నక్సలైట్లు అని ముద్రవేసి, కేసులు పెట్టడాన్ని తప్పుపట్టారు. ఈ నేపథ్యంలో లౌకిక, ప్రజాస్వామ్య, వామ పక్ష వాదులు ఏక తాటి పైకి వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయమైన భారతదేశం ఏర్పడుతుందని సంఘసంస్కరణ ఉద్యమం నిరూపించిందని అన్నారు. విచ్చలవిడి తనంతో అసమానతలు పెరిగి , దోపిడి దారులు ఎక్కువ అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రజాస్వామ్యం అని, అధికారం లోకి వచ్చాక తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. మతాల పరంగా రచనలు చేసి సోషల్ మీడియాలో రెచ్చ గొడుతున్నారని విమర్శించారు. నేడు అరసం మహాసభల్లో కూడా రచయితల ఐక్యత అనివార్యం అని తీర్మానాలుచేయడం శుభ పరిణామమన్నారు. సమాజం >>2



## ఎండ మంటలు

### కృష్ణా జిల్లా కానుమోలు: 45.8$^{0}$

### అనకాపల్లి జిల్లా మాకవరపాలెం: 45.5$^{0}$

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రోజు, రోజుకు ఎండలు ముదురుతున్నాయి. ఇంచుమించు రాష్ట్రమంతటా ఒకే వాతావరణం కన్పడుతుంది. ఎండకు ప్రజలు బయటకు రాలేని పరిస్దితి. నిత్యజీవనం భాగంగా చిరు వ్యాపారాలు నిర్వహించే వారు ఎండలో అల్లాడుతున్నారు. ముఖాలకు ముసుగులు వేసుకుని, ఎండ వేడిమి తట్టుకునే చలువ కళ్ళాద్దాలు పెట్టుకుని బయటకు వస్తున్నారు. వడదెబ్బకు అనారోగ్యంతో ఉన్న వృద్దులు మృత్యువాత పడుతున్నారు. ఒకటి రెండు చోట్ల భవన నిర్మాణ, కార్మికులు, వాహనచోదకులు వడదెబ్బతో మరణించారు. నుడు ఒక్క రోజూ వివిధ జిల్లాల్లో ఆరుగురువడదెబ్బతో మృత్యువాత పడ్డారు. వడదెబ్బ మరణాలను అధికారికంగా ఎటువంటి నిర్ధారణ జరుగలేదు, ఇప్పటి గత నెల రోజులుగా వడదెబ్బకు సుమారు 400ల మంది మరణించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఇక శనివారం కృష్ణా జిల్లా కానుమోలు 45.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 45.5 డిగ్రీలు నమోదైందనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 45.5, ఏలూరుజిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, పల్నాడుజిల్లా శ్రీనగర్ 45, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 44.6, తూర్పుగోదావరిజిల్లా చిట్యాలలో 44.3, విశాఖ జిల్లా రూరల్లో 42.8, అల్లూరిజిల్లా రామరాజుపాలెం, కాకినాడజిల్లా >>2

24-5Pg3exHMNWJQE 3_24-5Pg3exHMNWJQE.qxd 23/May/26 11:14 PM Page 1



# ప్రజలను నమ్మించడానికి వైసిపి అసత్యాల ప్రచారం:

## మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలను నమ్మించడానికి వైసిపి అసత్యాలను ప్రచారం చేస్తూంటుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు.ఆ పార్టీకి గత ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పినా వైసిపి నేత జగన్ విధానం మార్చుకోవడంలేదన్నారు. పయ్యావుల విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్ కుటుంబం సమాజంలో నిందితులే కానీ బాధితులు కాదని నేరమయ రాజకీయాలకు ఆద్యులే జగన్ కుటుంబమని ఆరోపించారు. ఫ్యాక్షన్‌ను రాజకీయాల్లోకి విస్తరించింది జగన్ తాత రాజారెడ్డి. రాజకీయాల్లో హింసను కొత్త పుంతలు తొక్కించిన కుటుంబం జగన్‌ది అన్నారు. వినేవారుంటే స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబమని జగన్ చెబుతారు. పులివెందుల పరిణామాలపై పుస్తకం విడుదల చేసే యోచనలో ఉన్నాం. గొడ్డలి పార్టీ వల్ల సమాజంలో తరాలు నష్టపోతున్నాయి. సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని గట్టిగా చెప్తున్నాం. అన్ని వ్యవస్థలపై గొడ్డలి వేటు వేసినందునే జగన్‌ది గొడ్డలి పార్టీ. జగన్ మంచివాడంటూ సెల్ఫ్ సర్టిఫికేట్ ఇచ్చుకోవటం విడ్డూరంగా ఉంది. రాష్ట్రంలో నేరమయ రాజకీయాలను మొదలుపెట్టిందీ, కొనసాగిస్తున్నదీ జగన్ కుటుంబమేనని మంత్రి పయ్యావుల కేశవ్ ఆరోపించారు. వైఎస్ కుటుంబం సమాజంలో నిందితుల స్థానంలో ఉందని, ఎంతమాత్రం బాధితులు కారని స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ వల్ల సమాజంలో తరాలు నష్టపోతున్నాయని అన్నారు. అందుకే పార్టీ సమాజానికి హానికరమని చెబుతున్నామన్నారు. శాంతిభద్రతలు, పరిశ్రమలు, రాజ్యాంగ వ్యవస్థలపై గొడ్డలి వేటు వేసిన పార్టీ కాబట్టే జగన్‌ది గొడ్డలి పార్టీ అని ధ్వజమెత్తారు. పొక్లెయిన్లు, బుల్‌డోజర్లను జగన్ కూల్చివేతలు, విధ్వంసానికి వాడితే.. చంద్రబాబు నిర్మాణం, అభివృద్ధికి వినియోగించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ముద్దాయిని చేసిందే జగన్, తండ్రిని ముద్దాయిగా చేర్చా లని జగన్ కోర్టుకెళ్లిన విషయాన్ని ఉండవల్లి అరుణ్‌కుమార్ బయట పెట్టారు. రాజశేఖర్‌రెడ్డిని ముద్దాయిగా చేర్చిన న్యాయవాదికి ఉన్నత పదవి ఇవ్వలేదా, ప్రజలు జగన్ క్షుద్ర రాజకీయాలను గ్రహించినందునే ప్రతిపక్ష స్థానం కూడా ఇవ్వలేదు.

# సెకండరీ ప్రభుత్వాసుపత్రుల్లో సంక్లిష్ట శస్త్రచికిత్సల పరంపర

**- రిఫరల్స్ తగ్గించి సదరు ఆసుపత్రుల్లోనే రోగుల ఆరోగ్యానికి వైద్యుల భరోసా - మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలు - 32 వైద్య బృందాలకు ప్రశంసా లేఖలు పంపిన డి.ఎస్.హెచ్ కెవిఎన్ చక్రధరబాబు**

**విజయవాడ,మే 23, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రాంతీయ, ప్రాథమిక వైద్య కేంద్రాలు(ప్రభుత్వ సెకండరీ) ఆసుపత్రుల్లో సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను వైద్యులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. సాధ్యమైనంత వరకు కేసులను రిఫర్ చేయకుండా కష్టతరమైన శస్త్రచికిత్సలను సైతం వైద్యులు సెకండరీ ఆసుపత్రుల్లో చేసేస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 31 నుంచి ఇటీవల వరకు జరిగిన వాటిలో 32 సంక్లిష్ట శస్త్ర చికిత్సలు ఉన్నట్లు నిశిత పరిశీలన అనంతరం డైరెక్టర్ ఆఫ్ సెకండ్ హెల్త్ ప్రధాన కార్యాలయం గుర్తించింది. అలాగే జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమల్లో 18 ఆసుపత్రులు ఉత్తమ పనితీరు కనబరిచినట్లు వెల్లడయింది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేవీఎన్ చక్రధరబాబు మొత్తం 50 వరకు అభినందన లేఖలు పంపారు. గిరిజన ప్రాంతంలో ఉన్న రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో టోటల్ నీ రీప్లెస్మెంటు జరిగింది. చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో రెక్టల్ ప్రొలాప్స్, భారీ ఫైబ్రాయిడ్ హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలను అక్కడ వైద్యులు విజయవంతంగా ముగించారు. ఇలా ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని, సహచరులు కూడా ఇదేవిధంగా స్పందిస్తే రోగుల ఆరోగ్యానికి భరోసా మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. టీచింగ్ ఆసుపత్రుల్లో మాదిరిగా దీబీబీ ఆసుపత్రులో ఆధునిక సౌకర్యాలు, ఆపరేషన్ థియేటర్లు, సూపర్ స్పెషాల్టీ వైద్యులు పూర్తి స్థాయిలో ఉండరు. అయినప్పటికీ దీబీబీ వైద్యుల్లో కొందరు వృత్తిపట్ల నిబద్ధతను పాటిస్తూ పెద్దాసుపత్రులకు కేసులు రిఫర్ చేయకుండా స్థానికంగానే పరిమిత సౌకర్యాల మధ్య శస్త్రచికిత్సలు చేసేందుకు మొగ్గుచూపుతున్నారని డీఎస్ హెచ్ కేవీఎన్ చక్రధరబాబు నేడొక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల రోగులకు వ్యయప్రయసాలు తగ్గుతున్నాయని, వారిపై ఆర్థిక భారం తగ్గుతుందని, విలువైన సమయం ఆదా అవుతుందని తెలిపారు. అలాగే అనారోగ్యం నుంచి త్వరగా కోరుకుంటున్నారని తెలిపారు. వృత్తిపట్ల నిబద్ధతను పాటించే వారిని తగిన ప్రమాణాలతో గుర్తించి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు అనుసరించి ఎప్పటికప్పుడు అభినందన లేఖలు పంపుతున్నామని వివరించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట ఏరియా ఆసుపత్రి వైద్యులు కూడా సిజేరియన్ ద్వారా జరగాల్సిన ప్రసవాన్ని సహజ విధానంలో జరిగేలా చేశారు. ఓ మహిళకు తొలి కాన్పు సిజేరియన్ విధానంలో జరిగింది. రెండో కాన్పు కోసం ఇక్కడికి రాగా.. సహజ విధానంలో జరిగేలా వైద్యులు, నర్సులు కృషిచేశారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ఓ రోగికి అరుదైన శస్త్రచికిత్స జరిగింది.

ఆసుపత్రిలో చేరిన సదరు రోగి శరీరం పై ఉన్న చర్మంలో 26 ఒకచోట తొలగించి, మరోచోట ట్రాన్స్ ప్లాంట్ చేశారు. ఇదే ఆసుపత్రిలో అరుదైన హెర్నియా రిపేర్స్ (స్పైజిలియన్, ఆభూరేటర్, సయాటిక్), సర్జరీ జరిగింది.

ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రిలో కంటి వైద్యులు 16 నెలల్లో 511 క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేశారు.

# జూన్ 21న వినూత్నంగా 'యోగాంధ్ర - 26'

## 14 రోజులపాటు విస్తృతంగా యోగాపై ప్రచారం

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ ఏడాదిజూన్ 21న వినూత్నంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరిలో యోగా పట్ల అవగాహన కల్పించే దిశ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.చిన్నారుల నుంచి వృద్ధుల వరకు,మానసిక, శారీరక ఒత్తిడి గురయ్యే ప్రతి ఒక్కరిని యోగా లో భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వం దశలవారి ప్రణాళికను సిద్ధం చేసింది. యోగా ప్రాధాన్యం గురించి తెలిపేలా ఆసనాలు, ప్రయోజనాలు, సందేశాలు, ఆరోగ్యకరమైన జీవనంపై అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రతి ఒక్కరూ పాల్గొనేందుకు భారీ అవకాశాలు కల్పిస్తుంది. అదేవిధంగా ఈ ఏడాది కూడా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం "యోగాంధ్ర2026" పేరుతో ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. జూన్ 7 నుంచి జూన్ 20 వరకు మొత్తం 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలతో పాటు ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహించనుంది. జూన్ 21న అమరావతిలో 25,000 మంది భాగస్వామ్యంతో రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమం జరపనుంది. గ్రామాల నుంచి జిల్లా కేంద్రాల వరకు కోటి (10 మిలియన్ల) మంది ప్రజలను యోగా కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ సారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కొత్తగా కార్యక్రమాన్ని నిర్వహించాలని పూనుకుంది. అందుకోసం ప్రతి జిల్లాకూ ఒక నిర్దిష్ట సామాజిక వర్గాన్ని లేదా సమూహాన్ని వారికి నచ్చిన థీమ్ఎంచుకుంటూ "యోగాంధ్ర" కార్యక్రమాన్ని వినూత్న రీతిలో నిర్వహించడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఉదాహరణకు విగిలి జిల్లాలో పోలీసు సిబ్బందితోనూ, తూర్పుగోదావరి జిల్లాలో ఖైదీలతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. అయితే రాష్ట్రంలో 28 జిల్లాలు ఉన్నాయి. ఈ కార్యక్రమం ప్రతి ఒక జిల్లా నిర్వహిస్తుంది కాబట్టి, ప్రతి జిల్లా నుంచి 28 వినూత్న థీమ్‌లను చూసే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందనే చెప్పవచ్చు. అంతేకాకుండా తప్పనిసరిగా ప్రతి జిల్లా కేంద్రంలోనూ కనీసం 1,000 మంది పాల్గొనేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లావారిగా ఎన్టీఆర్ పోలీసులు,తూర్పుగోదావరి ఖైదీలు, అంబేద్కర్ కోనసీమ రైతులు, విశాఖపట్నం సైనికులు, మాజీ సైనికులు, అన్నమయ్య అంగన్వాడీ ఆరోగ్య కార్యకర్తలు. చిత్తూరు వైద్యులు, వైద్యాధికారులు, కృష్ణా ఆటో, లారీ డ్రైవర్లు,వైఎస్సార్ కడప కుటుంబాల్లో అన్ని తరాలతో, శీకాకుళం మత్స్య కారులు, అల్లూరి సీతారామరాజు గిరిజనులు, పల్నాడు ఆశా, ఏఎన్ఎంలు, కాకినాడ ఉపాధ్యాయులు, నెల్లూరు రెసిడెన్షియల్ అసోసియేషన్, ఎన్జీవోలు, పోలవరం అటవీ ఉద్యోగులు,అటవీ కమిటీ సభ్యులు,. బాపట్ల యువత, సాంస్కృతిక కళాకారులు, విజయనగరం ఉపాధి హామీ శ్రామికులు శ్రీ సత్యసాయివ్యాపారులు అనకాపల్లిపారిశ్రామిక కార్మికులు.ఏలూరువిద్యార్థులు, అనంతపురం దివ్యాంగులు కర్నూలుపారిశుద్ధ్య కార్మికులు తిరుపతిసెలబ్రిటీలు నంద్యాలయోగా అసోసియేషన్ గుంటూరు ఇంజినీరింగ్ విద్యార్థులు పశ్చిమ గోదావరిఅథ్లెటిక్స్, క్రీడా బృందాలు ప్రకాశం డ్వాక్రా మహిళలు, మార్కాపురంపాడి రైతులు, పార్వతీపురం మన్యం వృద్ధులు అంశాలుగా యోగ కార్యక్రమాలు జరుగుతాయి. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో యోగా పోటీలు ప్రభుత్వం నిర్వహిస్తుంది. విద్యార్థులు, క్రీడాకారులు, మహిళా స్వయం సహాయక బృందాలు, ఆరోగ్య కార్యకర్తలు, పారిశ్రామిక కార్మికులు, సమాజంలోని ఇతర వర్గాల ప్రజలు ఇందులో చురుకుగా పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.

# రాహుకేతుదోష నివారణ పూజలు నిర్వహించిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప

**శ్రీకాళహస్తి,మే 23 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణపూజల్ని కర్నాటక మాజీ ముఖ్యమంత్రి యాడ్యూరప్ప కుటుంబసభ్యులతో కలసి జరుపుకున్నారు. ఆయనతో పాటు షిమోగా ఎంపి రాఘవేంద్ర ఉన్నారు. వారికి రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ సారధ్యంలో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. కాగా దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్ సారధ్యంలో ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని యాడ్యూరప్ప కోరగా కోలా ఆనంద్ సారధ్యంలో ప్రత్యేక రాహుకేతుదోష నివారణ టిక్కెట్లు కొనుగోలు చేసి సహస్రలింగేశ్వరాలయం వద్ద పూజలు జరిపించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.పూజల అనంతరం వారికి ఆలయ మర్యాదలతో మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. వారికి కోలా ఆనంద్ సారధ్యంలో ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి,మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కండ్రిగ ఉమ,గరికపాటి రమేష్‌బాబు, వెంకటరమణానాయుడు,చాగణం శైలజలు స్వాగతం పలికారు. దేవస్థానం తరఫున ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు స్వాగతం పలికారు. మాజీ ముఖ్యమంత్రి యాడ్యూరప్ప అతిథి గృహంలో కొంత సేపు రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌తో చర్చించారు. అంధ్ర ప్రదేశ్‌లో బిజెపి పార్టీ అభ్యున్నతిని అలాగే కర్నాటకలో రాబోవు ఎన్నికల్లో బిజెపి జెండా ఎగురవేస్తుందని అధికారం చేపడుతుందని యాడ్యూరప్ప కోలా ఆనంద్‌కు వివరించారు. నేడు భారత దేశంలోనూ, ప్రపంచ దేశాల్లో మన ప్రధాని నరేంద్రమోదీ విధానాలు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో పార్టీని బలోపేతం చేసుకోవటానికి ఎంతో దోహద పడుతుందని మాజీ ముఖ్యమంత్రి కోలా ఆనంద్‌కు వివరించారు.



శ్రీకాళహస్తీశ్వరుని ప్రసాదాలను అందిస్తున్న ఎఇఓ మోహన్

# అది రాజకీయ పార్టీ కాదు.. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఫోరం మాత్రమే

## కొత్త పార్టీ ప్రచారంపై క్లారిటీ ఇచ్చిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

**విజయవాడ, మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** టీడీపీ నేత, ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు తన కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారాన్ని పూర్తిగా ఖండించారు. గత రెండు మూడు రోజులుగా సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారంపై స్పందిస్తూ ఆయన స్పష్టత ఇచ్చారు. తాను రాజకీయ పార్టీ పెట్టబోతున్నానంటూ కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని రఘురామకృష్ణంరాజు మండిపడ్డారు. ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు మాత్రమే "తెలుగువీర లేవర్రా" పేరుతో ఒక ఫోరం ఏర్పాటు చేశామని తెలిపారు. కొంతమంది న్యాయవాదులతో కలిసి ఈ ఫోరమ్‌ను ప్రారంభించామని చెప్పారు. ప్రత్యేకంగా తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి న్యాయ సలహాలు, మార్గదర్శకత్వం అందించడమే ఈ ఫోరమ్ ముఖ్య ఉద్దేశమన్నారు. తాను ఎదుర్కొన్న అనుభవాల దృష్ట్యా ఇతరులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అల్లూరి సీతా రామ రాజు స్ఫూర్తితోనే "తెలుగువీర లేవర్రా అనే పేరును ఎంపిక చేశామని చెప్పారు.

## మండే ఎండల్లో పెరుగుతున్న

# బీర్ అమ్మకాలు

**విజయవాడ, మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో బీర్ అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. మండుతున్న ఎండల కారణంగా ప్రజలు చల్లని పానీయాలతో పాటు బీర్ వైపు మొగ్గు చూపుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏప్రిల్ 2025తో పోలిస్తే ఏప్రిల్ 2026లో బీర్ అమ్మకాలు 31.44 శాతం పెరిగాయి. గత ఏడాది ఏప్రిల్‌లో 22.73 లక్షల కేసులు అమ్ముడవగా, ఈ ఏడాది అదే నెలలో 29.88 లక్షల కేసులు విక్రయమయ్యాయి. అలాగే మే నెలలో కూడా అమ్మకాలు భారీగా పెరిగాయి. మే 2025లో తొలి 22 రోజుల్లో 16.42 లక్షల కేసులు అమ్ముడవగా, మే 2026లో అదే కాలానికి 22.21 లక్షల కేసుల అమ్మకాలు నమోదయ్యాయి. ఇది 35.27 శాతం వృద్ధిని సూచిస్తోంది. తీవ్రమైన ఎండలు, అధిక ఉష్ణోగ్రతలు, వేసవి సీజన్ ప్రభావంతో బీర్‌కు డిమాండ్ పెరిగిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. సాయంత్రం వేళల్లో వైన్ షాపులు, బార్ల వద్ద వినియోగదారుల రద్దీ కూడా పెరిగినట్లు సమాచారం.



డి.సిఎం పవన్ కల్యాణ్‌తో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

# నాలుగు వారాల్లో పనితీరు చక్కదిద్దుకోండి

**పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం**

**విజయవాడ, మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీకి అప్రతిష్టను తీసుకుని వచ్చే అంశాలను సహించేది లేదనిఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు.వ్యక్తిగత విషయాలతో బజారున పడటం బాధ్యత యుతమైన ఎంఎల్ఏ స్థాయిలో ఉన్న వారికి తగదన్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. పోలవరం ఎమ్మెల్యేగా ఆయన పని తీరుపై డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. పోలవరం నియోజకవర్గం పరిధికి సంబంధించి పార్టీ దృష్టికి వచ్చిన విషయాలు, ఆరోపణలపై ఎమ్మెల్యేను పవన్ వివరణ అడిగినట్లు తెలుస్తోంది. తన వ్యక్తిగత విషయాలను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని చక్కదిద్దుకొనేందుకు కొంత గడువు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా,నాలుగు వారాల్లోగా చక్కదిద్దుకోవాలని పవన్ సూచించినట్లు సమాచారం. పోలవరం నియోజకవర్గంలోని పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ.147 కోట్లు కేటాయించారు. ఆ పనుల పురోగతిపైనా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. పనుల సకాలంలో వేగంగా పూర్తి చేయకపోవడంపై పవన్ ప్రశ్నించారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తానని, వ్యక్తిగత వ్యవహారాలు చక్కదిద్దుకుంటానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు బాలరాజు చెప్పారు.

## తిరుపతిలో

# రోడ్డు ప్రమాదం

**- ఇద్దరు విద్యార్థులు దుర్మరణం**

**తిరుపతి(నారాయణవనం), మే 23 ప్రభాత వార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండలం వెత్తలతడుకు పంచాయతీ రాళ్లకాలువ బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం మోటారుసైకిల్‌ను కారు ఢీకొంది.ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. మృతి చెందిన వారిలో నారాయణవనం మండలం అరణ్యంకండ్రిగ పంచాయతీ గోవిందప్ప నాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన ఎస్ యువరాజు(1'8), మరో విద్యార్థి ఎ యువరాజులుగా గుర్తించారు. అదే మోటారుసైకిల్‌పై ప్రయాణిస్తున్న మరో విద్యార్థికి తీవ్రగాయాలవడంతో పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. ఈ ప్రమాద సంఘటనకు సంబందించి నారాయణవనం ఎస్ఐ గిరిబాబు కథనం మేరకు వివరాలు..జిఎన్‌కండ్రిగ గ్రామానికి చెందిన హరిబాబు కుమారుడు ఎస్ యువరాజు(18) డిగ్రీ మొదటి సంవత్సరం తిరుపతి ఎస్‌జి ఆర్ట్ కళాశాలలో చదువుతున్నాడు. వెంకటేష్ కుమారుడు ఎ యువరాజు ఇంటర్ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన ఉదయ్ డిగ్రీ చదువుతున్నారు. వీరు ముగ్గురు శనివారం సాయంత్రం స్థానకంగా వున్న శింగిరికోన లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి మోటారుసైకిల్‌లో వెళ్లారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో రాళ్ల కాలువ బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు మోటారు సైకిల్‌ను కొన్నది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడక్కడే దుర్మరణం చెందగా, మరోకరికి తీవ్రగాయాలు ఏర్పడినది. మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి శవ పంచనామా కోసం తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఐ గిరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుమల సమాచారం

## ముక్కోటి దేవతలకు ఆహ్వానంగా

# ధ్వజారోహణ మహోత్సవం



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** వేద ఘోషలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ తిరుపతి గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం మిథున లగ్నంలో ధ్వజారోహణ మహోత్సవంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గరుడ చిత్రం తో అలంకరించిన ధ్వజపటాన్ని ధ్వజ స్తంభంపై ప్రతిష్ఠించి బ్రహ్మోత్సవాలకు శుభారంభం పలికారు. అనంతరం స్వామి వారి ఆస్థానం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు వెండి తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ దివ్య ఊరేగింపుతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారే స్వయంగా పర్యవేక్షి స్తారనే ఆధ్యాత్మిక విశ్వాసం భక్తులను అలరించింది. అనంతరం అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షాబంధనం తదితర వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించి 18 గణాలు, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఆ తరువాత ఉదయం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు.

## వెంకన్నసేవలో విద్యాసాగరతీర్థస్వామి



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని శనివారం ఉదయం ఉడిపి కృష్ణాపురమఠం పీఠాధిపతి విద్యాసాగర తీర్థ స్వామి శిష్యులతో కలసి దర్శనం చేసుకున్నారు. ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న స్వామికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్‌రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి అర్చకులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన విద్యాసాగరతీర్థస్వామి శిష్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రజలంతో భక్తితో ఉండాలని, స్వామినామస్మరణతోనే ముక్తికలుగుతుందని తెలిపారు.

## మే 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుపతి,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న తిరుపతి జిల్లా నారాయణవనంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ శుద్ధి మహోత్సవం ఈనెల 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 8.15 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పవిత్ర కార్యక్రమం జరుగనుంది. 28 నుండి జూన్ 5వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ పవిత్రత, శోభను మరింత పెంపొందించే ఉద్దేశంతో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆలయ సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితరాలను శుద్ధి జలాలతో పరిశుభ్రం చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలను కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల నుండి భక్తులను సర్వదర్శనానికి అనుమతించనున్నారు.

## తిరుమల చరిత్రలో రికార్డు స్థాయి దర్శనాలు

**- 87,689 మంది భక్తులు పరవశం**



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం అత్యంత ప్రాధాన్యమైన విశిష్టమైన అభిషేకసేవలో రికార్డుస్థాయిలో భక్తులు దర్శనం చేసుకున్నారు. తిరుమల చరిత్రలోనే శుక్రవారం రోజు 80వేలమందికి మించి దర్శనాలు కల్పించలేదు. అలాంటిది ఓ వైపు వేసవిసెలవులు కొనసాగుతుండటం...సాధారణ సర్వదర్శనాలకు 30గంటలు సమయం నిరీక్షిస్తున్నా శుక్రవారం వేకువజామున గోవిందుని అభిషేకసేవలోనూ సామాన్యభక్తులను సర్వదర్శనంలో అనుమతించి దేవుని దర్శనం చేయించడంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,ఆలయవర్గాలు సఫలీకృతులయ్యారు. శుక్రవారం వేకువజామున నుండి అర్ధరాత్రి వరకు 87,689 మంది భక్తులు ఇష్టదైవాన్ని సంతృప్తికరంగా దర్శించుకోవడం విశేషం.మేనెలలోనే 1వతేదీ శుక్రవారం రోజు 71,008మంది భక్తులు, 8వతేదీ శుక్రవారం 67,222మంది భక్తులు, 15వతేదీ 75,688మంది భక్తులు మాత్రమే మహాలఘులో శ్రీవారిని దర్శించుకున్నారు. అలాంటిది 22వతేదీ శుక్రవారం ఏకంగా 87,689 మంది భక్తులు దర్శనం చేసుకోవడం రికార్డుగా నమోదైంది. కానుకల రూపంలో హుండీ ఆదాయం కూడా 4.29కోట్లు రూపాయలు చేకూరింది. వేసవిసెలవుల్లోనూ అనూహ్యంగా తిరుమలకు చేరుకుంటున్న భక్తులకు సాఫీగా, సంతోష దర్శనం చేయించడంలో అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు.

## వైభవంగా గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆలయ పరిసరాలను దివ్య విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శ్రీహరి దశావతార మహిమను ప్రతిబింబించే ఈ ప్రత్యేక అలంకరణలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతూ బ్రహ్మోత్సవాల వైభవాన్ని మరింత రెట్టింపు చేస్తున్నాయి. అనంతపద్మనాభ స్వామి, మహావిష్ణువు దశావతార రూపాలను కళాత్మక విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు. మత్స్యావతారం, కూర్మావతారం, వరాహస్వామి, నరసింహావతారం, వామనావతారం, పరశురామావతారం, బలరామావతారం, హనుమాన్ రూపాలు దర్శనమిచ్చేలా రూపొందించిన విద్యుత్ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రైల్వే స్టేషన్ సమీపంలో వామనావతారం, రాయలచెరువు గేట్ జంక్షన్ వద్ద బలరామావతారం, బేరివీధిలో పరశురాముడు, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద హనుమంతుని దివ్య రూపాలు ఆధ్యాత్మిక కాంతులను వెదజల్లుతున్నాయి. రామావతారం, కృష్ణావతారం, కల్కి అవతారం రూపాలు భక్తులకు భగవద్భక్తిని మరింతగా చాటుతున్నాయి. నాలుగు మాడవీధుల్లో విద్యుత్ ఆర్చ్‌లు, ఫ్లడ్‌లైట్లు, శోభాయమాన తోరణాలు, బాంబ్ స్టిక్స్, నడకదారుల వెంట ప్రత్యేక విద్యుత్ పందిళ్లు ఏర్పాటు చేశారు.

## పద్మావతి అమ్మవారి ఆశీస్సులందరిపై ఉండాలి

**- టిడిపి నేత దేవినేని ఉమా మహేశ్వరరావు**



**తిరుపతి,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** సిరుల తల్లి తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, అమ్మవారి కరుణాకటాక్షాలతో రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని మాజీమంత్రి, టిడిపి నేత దేవినేని ఉమా మహేశ్వరరావు ఆకాంక్షించారు. ఆయన కుటుంబంతో కలసి శనివారం ఉదయం తిరుచానూరుకు చేరుకున్నారు.ఆలయం వద్ద తుడ చైర్మన్ ,టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్ సి. దివాకర్ రెడ్డి దంపతులు ఉమా మహేశ్వరరావు దంపతులకు స్వాగతం పలికారు. ఆలయంలోపలకు చేరుకున్న వీరికి ఆలయ అర్చకులు అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఎల్‌నినో సూపర్ ఎల్‌నినోగా మారనుందా?

**రాచమల్ల భోగేశ్వర్ రెడ్డి**

వాతావరణ ఉష్ణోగ్రతల్లో ఏర్పడుతున్న పరిస్థితులు ఆధారంగా ఎల్‌నినో ప్రభావం ఎక్కువ వర్షాభావ ప్రాంతంగా గుర్తింపు ఉన్న రాయలసీమ జిల్లాలపై తీవ్రంగా పడుతుందా అన్నది రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎల్‌నినో రాబోయే రోజుల్లో సూపర్ ఎలిమినోగా మారే అవకాశం లేకపోలేదని కొందరు శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో రాయలసీమ జిల్లాలపై ఆ ప్రభావం ఏ మేరకుఉంటుంది. నిజంగానే ఎల్‌నినో ప్రభావం ఉంటుందని అనుకుంటే ఎలాంటి పంటలు సాగు వేసుకోవాలి? అందుకు ముందస్తుగా చర్యలేం తీసుకోవాలన్నది సీమరైతుల్లో బలంగా చర్చ సాగుతోంది. ఎల్‌నినో ప్రభావం దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలపై ఏదో విధంగా ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ వర్షాభావ ప్రాంతమైన రాయలసీమ జిల్లాలపై ఇంకా ఎక్కువ చూపే అవకాశం ఉందని రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. రాయలసీమ జిల్లాల్లో దాదాపు 34 లక్షల హెక్టార్ల సాగు భూమి 85 లక్షల ఎకరాల భూమి ఉంది. ఇందులో అనంతపురం శ్రీసత్యసాయి జిల్లాల్లో దాదాపు పది లక్షల హెక్టార్ల సాగు భూమి, కర్నూలు నంద్యాల జిల్లాల్లో ఆరు నుంచి ఏడు లక్షలు ఎట్లాల సాగు భూమి, వైయస్సార్ కడప జిల్లాలో నాలుగు లక్షల హెక్టార్ల సాగు భూమి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో దాదాపు 3.9 లక్షలు హెక్టార్ల సాగు భూమి ఉంది. రాయలసీమ జిల్లాల్లో 15 నుంచి 20 శాతం భూములకు మాత్రమే చెరువులు, కాలువల ద్వారా శాశ్వత సాగునీరు అందుతుంది. దీంతో 80 శాతం సాగు భూములకు వర్షాధారంగా మెట్ట పంటలపైనే రైతులు ఆధారపడతారు. ఈ పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల వచ్చే ఖరీఫ్‌సీజన్లో వర్షపాత పరిస్థితులు ఎలా ఉంటాయో అన్నది సీమ రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే అనంతపురం శ్రీ సత్యసాయి లాంటి జిల్లాల్లో పలు మండలాల్లో భూగర్భ జలాలు పలు మండలాల్లో ఆందోళనకర పరిస్థితిలో ఉన్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల గతంలో ఎన్నో కరవు కాటకాలను సీమ ప్రజలు ఎదుర్కొన్నారు. గత రెండు దశాబ్దాల కాలాన్ని పరిశీలిస్తే రాయలసీమ జిల్లాలో 2002–2003, 2004–2005, 2009–2010, 2011–2012, 2014–2015, 2018–2019 సంవత్సరాల్లో కరవులు వచ్చినట్లు గత పాలక ప్రభుత్వాలు కూడా గుర్తించాయి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు వల్ల ఎల్‌నినో సూపర్ ఎల్‌నినోగా మారుతూ వస్తే సీమ ప్రజల ముఖ్యంగా రైతుల పరిస్థితి ఏంటి అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న చర్చ వల్ల



రానున్న వర్షకాలంలో మన ప్రాంతంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందా? ఆమె రైతులు ఎక్కడ చూసినా చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ఫసిఫిక్ మహా సముద్రంలో నెలకొంటున్న వాతావరణ మార్పులను బట్టి ప్రపంచ వ్యాప్తంగా ఎల్‌నినో విస్తరించే ప్రభావం ఉంటుందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు హెచ్చరించాయి. మన భారత వాతావరణ సంస్థ ఐఎండి ప్రకటించిన వర్షపాత వివరాలు ప్రకారం దేశంలో తక్కువ వర్షాలు లేదా సాధారణం కన్నా తక్కువగా పడే అవకాశం ఉందని ఇటీవల ప్రకటించింది. ఐఎండి తన అంచనాలను శాస్త్రీయంగా ప్రకటిస్తుంది. ఉపగ్రహ అధ్యాయనం ద్వారా వాతావరణ మార్పులను రాడార్ గుర్తిస్తుంది. దాని ఆధారంగా అధ్యయనాలు వెల్లడిస్తారు. గతం కన్నా ఇప్పుడు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా అందుబాటులోకి రావడం, వాతావరణ పరిస్థితులను ముందుగానే పసిగడుతున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో ఏప్రిల్, మే నెలలో జరిగే మార్పులు ప్రపంచవాతావరణాన్ని ఏవిధంగా ఉండాలనేది నిర్దేశిస్తాయి. ఈసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రత తక్కుగా ఉంటే లానినో అంటారు. దీనివల్ల అధిక వర్షాలు, వరదలు సంభవిస్తాయి. దాదాపు గత కొన్నేళ్లుగా మనం లానినోనే ఎదుర్కొంటున్నాము. అక్కడి సముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రత పెరిగితే ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో ఎల్‌నినో ఏర్పడుతుంది. దీనివల్ల రుతుపవనాలు దిశ, దశ మార్చుకొని గందరగోళంగా మారిపోయి సకాలంలో వర్షాలు పడకపోవడం, లేదాతక్కువగా కురవడం లాంటిది సంభవిస్తుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1999, 2003 సంవత్సరాల మధ్య ఎల్‌నినో ప్రభావం తీవ్రమై భయంకరమైన కరవులను రైతులు, ప్రజలు చవిచూశారు అని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈఏడాది కూడా ఎల్‌నినో సంభవిస్తుందని అంచనా వేయగా తాజాగా ప్రముఖ మెట్రాలజీస్ట్ క్రిష్ డోల్చే తన అధ్యాయనం ప్రకారం ఎల్‌నినో వేగంగా బలపడుతూ విస్తరిస్తోందని అంచనాలకన్నా తీవ్ర స్థాయిలో ఉందని నివేదించారు. ఇంతవరకు ఎప్పుడు లేని విధంగా సూపర్ ఎల్‌నినో కావొచ్చని డోల్చే అంచనా వేశారు. ఆయన కథనాన్ని అంతర్జాతీయ సీఎన్ఎన్ వెధర్ చానెల్ ఈ నెల 15వ తేదీన ప్రముఖంగా టెలికాస్ట్ వేసింది అని తెలియ వచ్చింది. ఎల్‌నినోలో రెండు మూడు మార్పులను గమనించడమే కాకుండా పసిఫిక్ సముద్రంపై బాగా బలంగా విస్తరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు, దీనివల్ల గాలులు దిశ, దశ పూర్తిగా మారిపోయి వాతావరణం పొడిగా అవుతోంది. తద్వారా రుతుపవనాలు బలపడే అవకాశాలు తగ్గిపోయాయి. మనకు పసిఫిక్ సముద్రం నుంచి ఇండియన్ ఓషియన్ మీదుగాశ్రీలంక, మాల్దీవుల నుంచి అరేబియా సముద్రానికి రుతుపవానాలు విస్తరిస్తాయి. అక్కడి నుంచి కేరళ తీరానికి తాకి తద్వారా దేశం అంతా విస్తరిస్తాయి. కాస్తా అటు ఇటుగా మేనెలాఖరుకు కేరళ తీరానికి రెండు తెలుగురాష్ట్రాలకు ముఖ్యంగా రాయలసీమ జిల్లాలకు చేరడానికి వారం, పదిరోజులు పడుతుంది. ఈ ఏడాది మే 29నాటికి కేరళ తీరానికి తాక వచ్చని ఐఎండి ప్రకటించింది. ఎల్‌నినో బలపడి విస్తరిస్తే రుతుపవనాలు తీరాన్ని సకాలంలో తాకినప్పటికీ వర్షాలు పడే అవకాశాలు తగ్గిపోతాయి. వర్షాలు పడినప్పటికీ తక్కువగా కురవడం లేదా తక్కువ రోజులు పడడం సహజంగా మారిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగి, గాలిలో తేమశాతం తగ్గిపోవడం లాంటి కారణాలవల్ల పొడివాతావరణం విస్తరించి కరవు పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇదే జరిగితే మన దేశంలో వర్షాధారంగా పంటలు పండించే ప్రాంతాలు ఎడారులుగా మారిపోతాయి. నదుల్లో నీటి లభ్యత తగ్గి జలాశయాలు వెలవెలపోతాయి. తద్వారా ఆయకట్టుకునీరు లభించదు. పంటలు పండవు. ఆఖరికి తాగు నీటి సమస్య సైతం ఎదురవుతుంది. దీని ప్రభావం వ్యవసాయ ఉత్పత్తిపైనే ఎక్కువ పడుతుందని మేధావులు అభిప్రాయపడు తున్నారు. ఈపరిస్థితుల్లో ఎల్‌నినోఎదురైతే రైతులు ఇబ్బందిపడతారు. ●

క్లైమేట్ ప్రిడెక్షన్ సెంటర్ తెలిపిన వివరాల ప్రకారం పసిఫిక్ మహాసముద్రంలో 0.5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. ఈ నెలఖరునాటికి ఇదిఒకటి నుంచి రెండు డిగ్రీలు వరకు పెరిగే అవకా శాలు 96శాతం వరకు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఎల్‌నినో సూపర్ ఎల్‌నినోగామారి నవంబర్, జనవరిల మధ్యపరిస్థితులు ఘోరంగా తయారవుతాయని భయపడుతున్నారు. దీని ప్రకారం ఏయే ప్రాంతాలు తడిబారిన పడతాయి, ఏయే ప్రాంతాలు పొడిగా మారి కరవుతో ఎడారిల పరిస్థితులను తలపిస్తాయనేదిఅంచనా కూడా వేసినట్లు తెలుస్తోంది. ఆ అంచనాలను ఉదహరిస్తూ ప్రముఖ మెట్రలజీస్ట్ జాన్ బరానిక్ ప్రపంచవ్యాప్తంగా ఖండాలు, ప్రాంతాల వారీగా నివేదికను వెల్లడించారు. ఆయన నివేదిక ప్రకారం ఆసియాఖండంలో పొడివాతావరణం తీవ్ర మవుతుంది. సూపర్ ఎలినినో పసిఫిక్ సముద్రంలో బలపడుతుందని ఆయన ధ్రువీకరించారు. సాధారణంగా పశ్చిమాసియా, తూర్పు ఆసియాలతోపాటు భారతదేశంలోనూ సాధారణ పరిస్థితుల్లో జూన్ నుంచిజనవరిల మధ్య మంచివర్షాలు కురవాల్సి ఉంది. కానీ ఇప్పుడు ఉష్ణోగ్రతలు పెరుగుతూ, రుతుపవానాలు దాదాపు అంతరించిపోయేవాతావరణం నెలకొంటోంది. దీని వలన భారీ వర్షాలు పడే ప్రాంతాలు సైతం వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని జాన్ తననివేదికలో పేర్కొన్నారు. ఫలితంగా రాయలసీమ జిల్లాల్లో వాతావరణం అనుకూలించక కరవు పరిస్థితులతో నీటిప్రభావం ఫలితంగా కరవులుఏర్పడి వ్యవసాయం దెబ్బతింటుందన్నారు. ఈ ప్రభావం వర్షాకాలం అనంతరం వచ్చే శీతాకాలం పైన కూడా ప్రభావం చూపుతుందని అంచనా వేశారు. అంటే శీతాకాలంలో చలి తక్కువగా ఉంటుందని మనం అనుకోవచ్చు. మొత్తానికి ఈ అంచనాలే వాస్తవం అయితే తీవ్ర కరవు పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలు, ప్రభుత్వం ముఖ్యంగా రాయలసీమ రైతులు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది.

# కొత్త ‘గేమ్’ మొదలు!

తమిళనాడు

**ఎ.వి.వి ప్రసాద్**

మెరిసేదంతా బంగారం కానట్లే.. ముఖ్యమంత్రిపదవి కూడా అందరికీ పూల కిరీటం కాదు. కొందరికి ఆ పూల మధ్య ముళ్లు కూడా తగులుతూంటాయి, గుచ్చుకొని బాధ పెడుతూంటాయి. రెండు వారాల క్రితం తమిళ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన జోసెఫ్ విజయ్‌కి ఈ విషయం కొంచెం కొంచెం అర్థమవుతున్నట్లే కనిపిస్తోంది. ఇటీవల ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో మిగిలిన నాలుగు చోట్ల సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడగా, ఒక్క తమిళనాట మాత్రమే ‘అతుకుల బొంత’ తయారయింది. ఎన్టీఆర్, ఎమ్జీఆర్ తర్వాత నిజంగానే విజయ్‌కి ప్రజలు అద్భుతమైన అవకాశం ఇచ్చారు. పెట్టిన పార్టీని రెండేళ్ల లోపునే అధికారంలోకి తెచ్చారు. గతంలో శివాజీ గణేశన్, విజయ్ కాంత్, రజనీకాంత్, కమల్ హాసన్ వంటి అగ్ర సినీ నటులు కూడా ఇలాంటి ప్రయత్నమే చేసినా, వారికి ఇవ్వని సువర్ణావకాశం ప్రజలు విజయ్‌కి పువ్వుల్లో పెట్టి అందించారు. కానీ ఆ పూల మధ్య మిగిలిన కొన్ని ముళ్లే ఇప్పుడు విజయ్‌ని ఎక్కువగా బాధిస్తున్నట్లనిపిస్తుంది. కొన్ని నిర్ణయాలు తీసుకోవడం, అంతలోనే వాటిని ఉపసంహరించుకోవడం అనుభవ రాహిత్యం వల్లనే. ముఖ్యమంత్రి హోదాలో తీసుకునే నిర్ణయాలకు తగిన మద్దతు లభించనప్పుడు ఆ సీటులో కూర్చున్నవారెవరికైనా ఎంత కష్టంగా ఉంటుందో విజయ్‌కి ఇప్పుడిప్పుడే అనుభవంలోకి వస్తోంది. ముఖ్యమంత్రి సింహాసనంపై కూర్చున్న వారికి ఎప్పుడైతే తగిన ‘సొంత బలం’ లేదో, అప్పుడు చుట్టూ ఉండే ‘మిత్రులు’ ఆడే ఆట కూడా భిన్నంగానే ఉంటుంది. ఇప్పుడదే కనిపిస్తోంది. ‘మిత్రుల’ పేరుతో విజయ్ చుట్టూ చాలామందే చేరారు. వారంతా ప్రత్యర్థి పార్టీ మిత్రులు. ఎవరి వద్దకు వెళ్లకూడదనుకున్నారో చివరికి వారి మద్దతునే విజయ్ కోరారు. 35 శాతం ఓట్లిచ్చిన ప్రజలు మరో పది సీట్లు ఇవ్వకపోవడంతో వాటి కోసం విజయ్ పడరాని పాట్లు పడ్డారు. పది రోజుల పాటు కంటిపై కునుకు లేకుండా ప్రయత్నించారు. ఆ ‘పది’ కనిపిస్తే గాని తాను ఆహ్వానించబోనని గవర్నర్ భీష్మించడంతో విజయ్ తొక్కని గడప లేదనే చెప్పాలి. కరుణానిధి పార్టీతో కొన్ని దశాబ్దాల పాటు కలిసి నడిచిన కాంగ్రెస్ ఆ ‘గొడుగు’ బయటకు వచ్చి టివికె గూటికి చేరడంతో విజయ్‌కి నిజంగానే తొలుత పెద్ద బలం చేకూరినట్లయింది. ఆ పార్టీకి ఉన్నవి ఐదు సీట్లే అయినా, ఓ జాతీయ పార్టీ తమ వెంట ఉందనే అభిప్రాయం విజయ్‌కి బలం పెంచింది. అయినా ‘నంబర్’ చాలక డిఎంకె లోని మరికొన్ని మిత్రపక్షాల మద్దతు కోసం విజయ్ ఎడతెగని ప్రయత్నాలు చేశారు. చివరికి



ముఖ్యమంత్రి విజయ్

ఐయుఎంఎల్, సిపిఎం మద్దతు ఇచ్చినా ఇంకా రెండు సీట్ల దూరంలో విజయ్ నిలబడ్డారు. ముప్పుతిప్పలు పెట్టి చివరికి ఆ రెండు సీట్లను విసికె ఇచ్చాక విజయ్ పీఠం అధిష్ఠించి బల పరీక్షకు సిద్ధమయ్యారు. ఆ దశలో ఆయనకు అనూహ్యంగా 144 మంది సభ్యుల మద్దతు లభించడంతో తన ‘బలం’ పై ఆయన భారీగానే ఆశలు పెంచుకున్నారు. అయితే అసలు ‘ఆట’ కూడా అప్పుడే మొదలయింది. అన్నాడిఎంకె లోని రెబెల్ వర్గం 26 మంది విజయ్‌కి మద్దతు ఇవ్వడంతో గేమ్ మారింది. అదొక పెద్ద ఆట అని తర్వాత పరిణామాలను బట్టి తెలుస్తోంది. డిఎంకె అధినేత స్టాలిన్ గతవారం ఒక ప్రకటన చేస్తూ విజయ్ ప్రభుత్వం ఏ క్షణంలోనైనా కూలిపోతుందనీ, మధ్యంతర ఎన్నికలకు సిద్ధంగా ఉండాలనీ పార్టీ కార్యకర్తలకు పిలుపునివ్వడం కూడా పెద్ద సంచలనమే సృష్టించింది. ఆట మరో మలుపు తిరుగుతోందని అప్పుడే అనిపించింది. ఎందుకంటే, విజయ్ చుట్టూ ఉన్న మిత్రులందరూ డిఎంకె వర్గమే. విజయ్ ప్రభుత్వం డిఎంకె మిత్రులపై ఆధారపడి నడుస్తోందనీ, అందువల్ల అతడు జాగ్రత్తగా వ్యవహరించాలనీ స్టాలిన్ చేసిన హెచ్చరిక ప్రకంపనలు సృష్టించింది. ఆ వెంటనే విజయ్ గత బుధవారం మంత్రి వర్గాన్ని విస్తరించి కొత్తగా 23 మందిని చేర్చుకున్నారు. వారిలో ఇద్దరు కాంగ్రెస్ వారు కావడం విశేషం. అక్కడితో ఆగకుండా, 48 గంటలు తిరగకుండానే శుక్రవారం మరో ఇద్దరిని కేబినెట్‌లోకి తీసుకున్నారు. దానితో మొత్తం మంత్రులసంఖ్య35కు పెరిగింది. ఐయుఎంఎల్, విసికె పార్టీల నుంచి కూడా కేబినెట్‌లోకి రావడంతో అన్నాడిఎంకె రెబెల్స్ కూడా మంత్రి పదవుల కోసం ఆశపడ్డారు. విజయ్ అందుకు కూడా సిద్ధమైనా, సిపిఎం, విసికె వ్యతిరేకించడంతో మళ్లీ వెనక్కి తగ్గారు. ఇప్పుడిది కొత్త సమస్యగా మారింది. ఇక తమకు మంత్రి పదవులు రావని భావించిన అన్నా డిఎంకె రెబెల్స్ మళ్లీ ప్లేటు మార్చి తాము తమ పార్టీ లోనే ఉన్నామనీ, జయలలిత ప్రభుత్వాన్ని మళ్లీ చూస్తామనీ ప్రకటించడం ఆట ఎటు తిరుగుతోందో తెలుపుతోంది. ఈ కథ నడవడానికి ముందు, రజనీకాంత్ స్టాలిన్‌తో సమావేశం కావడం ఒకసారి గుర్తుచేసుకోవలసి ఉంది. బిజెపి ఆలోచన మేరకు అన్నాడిఎంకె, డిఎంకె మధ్య సయోధ్య కోసం ఆ భేటీ జరిగినట్లు అనుకొన్నారు. దానిలో వాస్తవం లేకపోలేదు. స్టాలిన్ తాజాగా చేసిన హెచ్చరిక, అంతకు ముందు జరిగిన ఆ భేటీ, అన్నాడిఎంకె రెబెల్స్ ప్లేటు మార్చడం తేలికగా తీసివేసే విషయాలు కావు. డిఎంకె సిగ్నల్ ఇస్తే ‘మిత్రుల’ అభిప్రాయాలు మారిపోవచ్చు. వైరి వర్గాలైన డిఎంకె, అన్నా డిఎంకె మధ్య సయోధ్య కుదురుతుందా, లేదా అన్నది ఇప్పుడే చెప్పలేం. అది విజయ్‌పాలన తీరుపై ఆధారపడి ఉంటుంది. అప్పుడు ‘గేమ్’ మళ్లీ మొదటికి రావచ్చు. చెప్పలేం. రాజకీయాల్లో ఎవరూ ఎవరికీ ‘నిత్య మిత్రులు’కారు. అదే విధంగా శత్రువులూ కారు. ఎవరి ఆట వారిది. ఎన్నికల్లో కంటే ఈ ఆటలో గెలవడమే విజయ్ వ్యూహ నిపుణతకు అసలైన పరీక్ష. అభిమాన సంఘాలు ఎన్నికల్లో ఓట్లు తెచ్చాయి కానీ పాలనలో పదవి చేజారకుండా నిలబెట్టగలవా! ఆట ఎలా మారుతుందో చూడాలి. ●

# సంస్కరణల దిశగా కొత్తపాలన!

హంగేరీ

**గన్ని మోహన్**

మధ్యయూరోప్‌లో ఏడుదేశాల సరిహద్దులు కలిగి ఉన్న అతి చిన్నదేశం హంగెరీలో కమ్యూనిస్టుల పాలన తర్వాత మొదటిసారి స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాయి. పీటర్ మాగ్యార్ దేశ నూతనప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీనితో అప్పటి వరకూ ఉన్న నియతృత్వ పాలన శకానికి తెర పడింది. 16 ఏళ్లపాటు తన నిరంకుశ పాలనతో దేశాన్ని శాసించిన విక్టర్ ఓర్బాన్ గత నెలలో జరిగిన ఎన్నికలలో, మాగ్యార్‌కు చెందిన టిస్జా పార్టీ, ఓర్బాన్ జాతీయవాద పార్టీ అయిన ఫిడెజ్‌ను అనూహ్యంగా ఓడించింది. హంగేరీ కమ్యూనిజం అనంతర చరిత్రలో పార్లమెంటులో మరే ఇతర పార్టీ కంటే కూడా ఎక్కువ ఓట్లు సాధించింది. టిస్జా పార్టీకి పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ లభించడంతో ఓర్బాన్‌కు ఓటమిని అంగీకరించక తప్పలేదు దీనికితోడు ప్రపంచ దేశాలు కూడా ఎన్నికలను స్వాగతించాయి. అలాగే మాగ్యార్ ప్రధాని ఎన్నికపైనా శుభాకాంక్షలు తెలియజేస్తుండటంతో ఇప్పుడు ఓర్బాన్ భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతోంది. ప్రపంచంలోని ప్రతి స్వేచ్ఛాభిమాని హంగేరియన్‌గా ఉండాలని కోరుకుంటున్నారు. అత్యంత క్రూరమైన నిరంకుశత్వాన్ని కూడా అత్యంత సామాన్య, రక్తమాంసాలు గల ప్రజలే ఓడించగలరని మీరు దేశానికి, ప్రపంచానికి స్పష్టం చేసారని మాగ్యార్ తొలి ప్రసంగంలో పేర్కొనడం చూస్తుంటే ఇకదేశంలో నియంతృత్వ పాలనకు కాలం చెల్లిందన్న హెచ్చరికలు చేసినట్లనిపించింది. హంగేరీ నూతన నాయకుడిగా, ఓర్బాన్ పాలనలో తీవ్రంగా దెబ్బతిన్న ప్రజాస్వామ్య సంస్థలను,ప్రభుత్వ అధికారాల సమతుల్యతను పునరుద్ధరిస్తానని, అవినీతిపై ఉక్కుపాదం మోపాల్సిందేనని మాగ్యార్ ప్రతిజ్ఞ చేశారు. ఆయన పరిపాలన యూరోపియన్ యూనియన్‌లోని రాజకీయ గతిని మార్చివేస్తుందని భావిస్తున్నారు. అక్కడ మాజీప్రధానమంత్రి కీలక నిర్ణయాలను,పొరుగు దేశమైన ఉక్రెయిన్‌కు మద్దతుకు సంబంధించిన నిర్ణయాన్ని, తరచు వీటో చేస్తూ రష్యాకు చేరువ అయిన ఓర్బాన్ విధానాలు పునఃసమీక్షిస్తానని ప్రకటించిన మాగ్యార్ ఆ దిశగా దూసుకుపోతున్నారు. కేవలం రెండేళ్లక్రితమే టిస్జా పార్టీని స్థాపించి అధికారంలోకి తెచ్చిన మాగ్యార్ టిస్జాకు అపూర్వ విజయం తెచ్చారు. హంగేరీలోని 199 స్థానాలు గల పార్లమెంట్‌లో, టిస్జా ఇప్పుడు 141 స్థానాలను సాధించింది. ఓర్బాన్ ఫిడెజ్‌కేడీఎన్‌పీ కూటమి 135 నుండి 52 స్థానాలకు పడిపోయి అధికారం కోల్పోయింది. తన ప్రమాణస్వీకారాన్ని, ఓర్బాన్ శకం ముగింపును పురస్కరించుకుని, కొస్సూత్ స్క్వేర్‌లో జరిగే ‘పాలన మార్పు’




పీటర్ మాగ్యార్

వేడుకకు హాజరు కావాలని మాగ్యార్ హంగేరియన్లకు పిలుపునిచ్చారు. సామాజిక సమీకరణల ప్రకారం విభజించి పాలించే తీరును తాను అనుసరించబోనన్న వాగ్దానం చేయడంతో ప్రజలు మాగ్యార్‌కు ఓట్లవర్షం కురిపించారు. ఇప్పటివరకూ మహిళలకు ప్రాతినిధ్యం అంతంతమాత్రంగానే ఉండేది. కానీ మాగ్యార్ హయాంలో హంగేరి పార్లమెంటులో 54మంది మహిళా చట్టసభ్యులున్నారు. వీరిలో ఎక్కువ మంది టిస్జా పార్టీకి చెందినవారే కావడం గమనార్హం. ఈప్రాతినిధ్యం హంగేరి చరిత్రలోనే అత్యధికమని నిపుణులు సైతం అంగీకరించారు. ప్రత్యేకించి ఉక్రెయిన్‌పై అనుసరించే వైఖరుల్లో గతంలోని ఓర్బాన్‌రష్యావైపునకు వెళ్లడం హంగెరీ ప్రజలకు ఎంతమాత్రం రుచించలేదు. ఉక్రెయిన్‌లో గడచిన మూడున్నరేళ్లుగా సాగుతున్న యుద్ధకాండపై హంగెరీ వాసుల్లోను ఉక్రోషం పెరుగుతోంది. అందువల్లనే నియంతృత్వ వాదిగా ముద్రపడిన ఓర్బాన్‌ను ఈసారి ఖచ్చితంగా ఓడించి తీరాలన్న పట్టుదలతోనే మాగ్యార్‌కు పట్టం కట్టారు. ఓర్బాన్ పాలనలో, యూరోపియన్ యూనియన్‌లోని దాదాపు అన్ని ఇతర 26దేశాలతో పోలిస్తే ప్రభుత్వంలో మహిళల సంఖ్య తక్కువగాఉండేది. మహిళలు ఈ కొత్త, అందమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అందుకేవారి ప్రాతినిధ్యం పెంచినట్లు మాగ్యార్ స్వయంగా ప్రకటించారు. యూరోపియన్ యూనియన్‌తో సంబంధాలను పునరుద్ధరించడం ఓర్బాన్ తెగిపోయేంత వరకు నెట్టిన యూరోపియన్ యూనియన్‌తో తన దేశ సంబంధాలను పునరుద్ధరిస్తానని, ఓర్బాన్ రష్యాకు మరింత దగ్గరవ్వడంతో పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాల సరసన హంగేరి స్థానం ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో దానికి పూర్వ వైభవాన్ని తెస్తానని మాగ్యార్ హామీ ఇచ్చారు. అంతేకాదు పార్లమెంటు భవనంపై తొలిసారి ఈయు జెండాను ఎగురవేసారు. హంగెరీకి స్వేచ్ఛా ప్రజాస్వామ్య వాతావరణం కల్పిస్తానని హామీలు కుమ్మరించిన మాగ్యార్‌కు ముందున్న ముళ్లబాటలో సవాళ్లు కూడాఅధికమే. శాంతిభద్రతలు, అవినీతి ఆందోళనల కారణంగా ఓర్బాన్ హయాంలో స్తంభింపజేసిన హంగేరీకి చెందిన సుమారు 20 బిలియన్ డాలర్ల ఈయూ నిధులను ముందు విడుదలచేయించాలి. గత నాలుగేళ్లుగా సంక్షోభంలో చిక్కుకున్న హంగేరి ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి నిధులు చాలా అవసరం. అంతేకాకుండా వీలైనంత త్వరగా రష్యాప్రభావాన్ని దేశంపై పడకుండా చూసుకోవాలని కూడా ఆయనకు ప్రజలనుంచి వత్తిడి వస్తోంది. టిస్జాకు ఓటు వేసిన దాదాపు 34 లక్షల మంది హంగేరియన్లలో చాలామంది, పదవీ విరమణ చేస్తున్న ప్రభుత్వం దుష్ప్రవర్తనగా భావిస్తున్న దానికి ఫిడెజ్ అధికారులు వారి వ్యాపార మిత్రులను జవాబుదారీగా చేయాలని మాగ్యార్‌ను డిమాండ్‌చేస్తున్నారు. ఓర్బాన్ పదవీ కాలంలో దుర్వినియోగం చేయబడిన ప్రజా నిధులను దర్యాప్తుచేసి, తిరిగి రాబట్టే బాధ్యతతో కూడిన జాతీయ ఆస్తుల రికవరీ,పరిరక్షణ సంస్థ ఏర్పాటుచేసి దేశ ఆర్థికపరిస్థితిని గాడిలోకి తెస్తానని చెపుతున్న ప్రధానికి దేశ ప్రజల నుంచి ఆయనకు సంపూర్ణ మద్దతు లభిస్తున్నా ఈయూ నుంచి ఎదురయ్యే సహకారమే ఇప్పుడు ఆయనకు అత్యంత కీలకం అవుతోంది. ●

# నీట్ రద్దుతో విద్యార్థుల కలలకు విఘాతం!

**తండ సదానందం**

సమాజంలో అత్యంత గౌరవం,హోదా, ప్రతిష్ఠలు కలిగిన వృత్తి అంటే వైద్యవృత్తి. ప్రాణాలను రక్షించే వారు వైద్యులు. అటువంటి వృత్తిని చేపట్టడానికి విద్యార్థులు బాల్యం నుండే కలలు కంటారు. కలలు కనడమే కాదు వానిని సహకారం చేసుకోవడానికి ఎంతో కష్టపడతారు. విద్యార్థులు మాత్రమే కాదు, వారి తల్లిదండ్రులు కూడా ఎంతో త్యాగం చేయవలసి ఉంటుంది. వైద్య వృత్తిలోకి ప్రవేశించడానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షను రాయవలసి ఉంటుంది. అందుకుగాను లక్షలాది రూపాయలు కుమ్మరించి కార్పొరేట్ కళాశాలలో ఇంటర్‌తో పాటు నీట్ కోచింగ్ తీసుకుంటేనే సీటుసాధించడం సాధ్యమవుతుంది. కాలచక్రంతో పరిగెత్తుతూ లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి నిరంతరం శ్రమించి నీట్‌పరీక్ష బాగానే రాశాము,డాక్టర్ అవుతామని కలలు కంటుంటే ,వారి నెత్తిన పిడుగు పడ్డట్టు నీట్ రద్దు వార్తవచ్చింది. నీట్ ప్రశ్నపత్రం లీక్ అయిందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అక్రమార్కులకు లాభం జరగకూడదని సదుద్దేశంతో నీట్ రద్దు చేస్తున్నామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీనిర్వాహకులు, సంబంధిత విద్యా మంత్రి చావు కబురు చల్లగా అది కూడా విద్యార్థుల ప్రయోజనం కొరకు పాటుపడుతున్నట్లు ప్రకటించడం మొసలి కన్నీరు కార్చడమే. పరీక్ష రద్దు చేయడం వల్ల విద్యార్థులకు మేలు కలుగుతుందా? అహోరాత్రులు కార్పొరేట్ కళాశాలలో తిని తినక చిక్కిశల్యమై, అమ్మానాన్నలు నగలు, ఆస్తులు అమ్మి ఫీజుకడితే ఆ గుండె భారాన్ని తమలోనే దిగమింగుకొని, వారి కష్టాన్ని గుర్తుచేసుకొని, వారి కలలను నెరవేర్చడానికి పరీక్ష బాగా రాసి సీటు వస్తుందని ఆశిస్తున్న విద్యార్థులకు ఆశనిపాతం. ఈ నెల మూడున దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షకు 23 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 96.92 హాజరైనారు. తాజాగా నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయిందని రద్దు చేస్తే అది తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. విద్యార్థుల బలిదానం కొత్తేమీకాదు, ప్రతి ఏటా ఎంతోమంది విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతూనే ఉన్నారు. నీట్ పరీక్ష లీక్ అనేది ప్రతి ఏటా ఉత్తరాది రాష్ట్రాలలో జరుగుతుందని నిపుణుల అభిప్రాయం. ఈసారి చేత్తో రాసిన ప్రాక్టీస్ క్యాస్షన్ బ్యాంకులో 281 ప్రశ్నలుంటే 138 ప్రశ్నలు పరీక్షలు వచ్చాయి ఈ పేపరు పరీక్షకు ముందే రాజస్థాన్లో బాగా సర్క్యులేట్ అయింది. నీట్‌పరీక్ష దేశవ్యాప్తంగా 2017 నుండి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. కానీ ఆది నుండి అక్రమాలు జరుగుతున్నాయి. 2024లో భారీ కుంభకోణం, 2025లోను లీక్ అయిందనే వార్త ఇప్పుడు వెలుగులోకి వస్తుంది. 2026 లో మళ్లీ పూనే కేంద్రంగా లీకై రాజస్థాన్ గుండా దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన బడా బాబులకు, కార్పొరేట్ కోచింగ్ సెంటర్లకు అందినట్లు తెలుస్తుంది. నీట్ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపూర్తిగా వైఫల్యం చెందింది. ప్రతి ఏటా లీక్ అవ్వడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడడమే. ప్రతిష్టాత్మకంగా పకడ్బందీగా పారదర్శకంగా దేశవ్యాప్తంగా నిర్వహించాల్సిన పరీక్ష, పేలవంగా ప్రతిసారి లీక్ అవ్వడం అంటే విద్యార్థుల భవిష్యత్తు పట్ల,విద్యా వ్యవస్థ పట్ల నిర్వాహకులకు ఎంత శ్రద్ధ ఉందో అర్థం అవుతుంది. ఎన్ టి ఏ నుండి పేపర్ లీక్ అయితే పరీక్షను పారదర్శకంగా నిర్వహించేది ఎవరు? పేపర్ తయారీ కమిటీ మెంబర్లు పేపర్‌అమ్ముకుంటే పరీక్ష గోప్యతను కాపాడేదెవరు? దీని వెనుక పెద్ద ఎత్తున కోట్లాది రూపాయలు చేతులు మారడం, పెద్ద తలకాయల జోక్యం కూడా ఉండి ఉంటుంది. నీట్ పరీక్ష జరిగిన వెంటనే ప్రతి ఏటా ఆరోపణలు వెలువెత్తుతున్న దొరికితే దొంగ లేకపోతే దొర అన్న రీతిలో పరీక్ష కొనసాగుతూ వచ్చింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విద్యార్థులు వారితల్లిదండ్రులు మొత్తంవ్యవస్థ ప్రభావితమైందని,పరీక్ష వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉండేందుకు మళ్లీ పరీక్ష నిర్వహించాలని నిర్ణ




యించడం జరిగిందని, తప్పు జరిగిందని దానికి తాము బాధ్యత వహిస్తామని ఎన్‌టిఏ డైరెక్టర్ చెప్పడం విడ్డూరంగా ఉంది. విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుంటే తప్పు జరిగింది అంటే సరిపోతుందా? బాధ్యత వహించడం అంటే వారి ప్రాణాలను వెనక్కి తేగలరా? ఉజ్వల భవిష్యత్తు కలిగిన మానవ వనరులుగా దేశానికి సేవ చేద్దామనుకున్నా వారి ప్రాణాలను హరించడం బాధ్యత వహిస్తామని వట్టి మాటలతో చెప్పడం, ప్రతి సంవత్సరం ఇలాగే పునరావృతం అవుతున్నను,మళ్లీ పునరావృతం కాకుండా చూస్తామనడం హాస్యాస్పదం. ఎన్టిఏ ఏర్పడిన నాటి నుండి ఏనాడు ఈ నీట్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రతిసారి ఏవో కొన్నిఆరోపణలు అక్రమాలతో నెట్టుకొస్తుంది. సాక్షాత్తు ఎన్ టి ఏ ఆధ్వర్యంలోని నీట్ కమిటీ మెంబర్ల ద్వారా లీక్ అవ్వడం, ఆ తయారీదారులు సొంతంగా కోచింగ్ సెంటర్లు నిర్వహించడాన్ని బట్టి పరీక్షా పారదర్శకతను అర్థం చేసుకోవచ్చు. ఒక హాస్టల్ నిర్వాహకుడు ఎన్ టి ఏ కు సమాచారమిచ్చేదాకా ఈ లీక్ వ్యవహారం వెలుగులోకి రాలేదంటే మన నిఘా వ్యవస్థలు ఎంత నిద్ర పోతున్నాయో, లేదా తెలిసి కూడా కావాలని ఉపేక్షించినాయో వారికే తెలియాలి. పరీక్ష పేపర్ లీక్ వార్త రాగానే మొదట్లో ఎన్టిఏ తేలికగా తీసుకొని కొట్టిపారేయడం,తర్వాత ఒత్తిళ్లకు తలొగ్గి దర్యాప్తు మొదలుపెట్టడం, గతంలో జరిగిన ఘటనల నుండి నేటి వరకు అదే కథ. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించలేకపోయాం అన్నది చెప్పకుండా ప్రతిసారి రద్దు అవసరాన్ని చెప్పుకురావడం శోచనీయం. పరీక్ష ఫీజు వాపస్‌తో విద్యార్థులకు జరిగిన అన్యాయం తీరుతుందా? ఈ అన్యాయానికి ఎవరు బాధ్యత వహిస్తారు?ఎలాన్యాయం చేస్తారు? మళ్లీ పరీక్ష నిర్వహించడం న్యాయం ఎట్లా అవుతుంది? కొద్దిమంది అక్రమార్కులు ఉంటే లక్షలాదిమంది విద్యార్థులకు శిక్ష వేయడం ఏన్యాయ సూత్రం? వందమంది దోషులు తప్పించుకున్న ఒక నిర్దోషికి శిక్ష పడవద్దు అనేది సామాజిక న్యాయ సూత్రం. దానికి విరుద్ధంగా రాజ్యం చేసిన తప్పుకుచిన్నారుల భవిష్యత్తు తలకిందులు కావడం అన్యాయమా? న్యాయమా? ఏలికలకే తెలియాలి. మళ్లీ చదవడం, పరీక్ష రాయడం, ఉత్తమ ఫలితం రావడం అనేది విద్యార్థుల మానసిక స్థాయి పై ఆధారపడి ఉంటుంది. విద్యార్థులు అధైర్యపడి డిప్రెషన్స్‌లోనై అసలు పరీక్ష రాయకుండా ఉండే అవకాశం కూడా ఉంటుంది. గతంలో చాలామంది డిప్రెషన్‌కి లోనై వదిలేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ పసి మనసులకు ఏర్పడినగాయం వారి భవిష్యత్తుకు విఘాతం. ఒకవేళ ధైర్యంగా రాసినా గతంలో కనబరిచిన ప్రతిభ కనబరచకపోవచ్చు. దీంతో డాక్టర్ కావలసిన విద్యార్థులు, ఆ విద్యార్థుల తల్లిదండ్రులు భరించరాని మానసిక వేదనను అనుభవిస్తూమానసిక రోగులుగా మారే ప్రమాదం ఉందని, అలా గత అనుభవాలు చెబుతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైద్యవృత్తిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల పరిధిలో జరిగేవి. ఆయా రాష్ట్రాలు తమ పరిధిలో పకడ్బందీగా పారదర్శకంగా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించి ప్రవేశాలు జరిపాయి. 2017తర్వాత కేంద్రీకృతం చేసి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేసి నీట్ పరీక్షను నిర్వహిస్తుండడంతో ఈ అనర్థాలు వెలుగులోకి వస్తున్నాయి. దీనిలో స్థానిక భాషలలో ప్రశ్నాపత్రం లేకపోవడం వల్ల వెనుకబడిన రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. నీట్ పరీక్షను పాస్ కాలేక, వైద్యవృత్తిని అందుకోలేక ఎంతోమంది విద్యార్థులు ప్రాణాలను తీసుకుంటున్నారు. దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు, ఆది నుండి తమిళనాడు రాష్ట్రం ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నది. అయినను దీనిపై సమీక్ష చేయకుండా, ఈ అనర్థాలను తొలగించకుండా ప్రజాస్వామ్య విరుద్ధంగా, సమాఖ్య విధానానికి తూట్లు పొడిచి కేంద్రీకృత విధానంతో కొనసాగించడం, ఈ అక్రమాలకు తావు ఏర్పడేలా చేయడం అప్రజస్వామికమే. ప్రతి ఏటా విద్యార్థులు పిట్టల రాలిపోతున్న కనికరం లేకుండా ఈ విధానంలో మార్పులు చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇకనైనా చిన్నారుల భవిష్యత్తును త్రుంచి వేయకుండా విశ్వాసనీయంగా పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించి తద్వారా వ్యవస్థ పై ఉన్న నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ●

## చట్టాలపై అవగాహన అవసరం

**రేపల్లె, మే 23, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రేపల్లె మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది.ఎదుటి వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవడం,ఫోక్సో చట్టం,బాలికలపై పురుషుల గుడ్ టచ్,బ్యాడ్ టచ్,హక్కులు,సంక్షేమ పథకాలు,చట్టపరమైన రక్షణ వంటి అంశాలపై విద్యార్థులు, మహిళలు అవగాహన కలిగి ఉండాలని పారా లీగల్ వాలంటీర్లు వాగోలు బాబూరావు,కనపర్తి వెంకయ్య,తాహేర్ అహ్మద్‌లు సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు,సమాజ సేవకులు చెరుకూరి లక్ష్మణరావు,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## అర్హులకు అందని మత్స్యకార భరోసా భృతి

**రేపల్లె, మే 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మత్స్యకార భరోసా భృతి చెల్లింపు జాబితాలో అర్హులకు చోటులేకుండా పోయిందని ఆంధ్రప్రదేశ్ బిసి అగ్నికులక్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు ఆందోళన వెలుబుచ్చారు.శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న రూ.20 వేల మత్స్యకార భరోసా భృతి మత్స్యకారులకు ఉపయోగకరంగా ఉన్నప్పటికీ కొన్ని జిల్లాల్లో అర్హులైన కొందరికి మత్స్యకార భరోసా భృతి అందలేదని చెప్పారు.ఇప్పటికైనా అర్హులకు న్యాయం చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని వెంకటేశ్వరరావు



## మహిళల రక్షణకు ఉమ్మడిగా కృషి చేయాలి

### కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల,మే23,ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళలపై గృహ హింస నిరోధానికి సమాజంలో అందరూ భాగస్వాములు కావాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో గృహహింస




నిరోధక చట్టం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా ఎస్‌ఎఫ్‌ఐఆర్డీ సంస్థ రూపొందించిన "బడి పిలుస్తోంది" గోడపత్రాలను (పోస్టర్లను) కలెక్టర్ ఆవిష్కరించారు.ఈసమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు గృహ హింస నుంచి విముక్తి పొందాలంటే సామాజిక చైతన్యం ఒక్కటే మార్గమన్నారు. వేధింపుల నుంచి బయటపడేందుకు చట్టాలు మహిళలకు పూర్తి స్వేచ్ఛను, రక్షణను ఇస్తాయని భరోసా ఇచ్చారు. బాపట్ల జిల్లాలో మహిళలపై వేధింపులు, దాడులు, అరాచకాలు క్రమంగా తగ్గుముఖం పట్టడం శుభపరిణామమన్నారు.జిల్లాలో మహిళలపై వేధింపుల కేసులు గత ఏడాదితో పోలిస్తే ఈసారి భారీగా తగ్గాయని గణాంకాలను వెల్లడించారు.వేధింపుల కేసులు: గత ఏడాది 485 కేసులు నమోదు కాగా, ఈ సంవత్సరం ఆ సంఖ్య కేవలం 139 కి పరిమితమైం దన్నారు.గడిచిన నాలుగేళ్లలో జిల్లాలో మొత్తం 668 కేసులు నమోదయ్యాయి. ఇందులో 155 కేసులు కోర్టు ద్వారా, 5 కేసులు పోలీసు అధికారుల ద్వారా పరిష్కారమయ్యాయి. ప్రస్తుతం 408 కేసులు కోర్టు పరిశీలనలో ఉండగా, మిగిలిన 101 కేసులు విచారణ దశలో ఉన్నాయి.గత ఏడాది వర్సెస్ ఈ ఏడాది: గృహహింస చట్టం కింద గత ఏడాది 194 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 82 కేసులు మాత్రమే నమోదయ్యాయి.ఆసరాగా ఖి181ఖి కాల్ సెంటర్, ఖిసఖిఖి కేంద్రం వరకట్న వేధింపులను అరికట్టేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మహిళల రక్షణకు ప్రభుత్వం అందిస్తున్న 181 కాల్ సెంటర్, సఖి కేంద్రాల సేవలను బాధితులు సద్వినియోగం చేసుకునేలా ప్రచారం కల్పించాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఈ చైతన్య ప్రక్రియను ప్రారంభించాలని, స్వచ్ఛంద సంస్థలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి మహిళల్లో ధైర్యాన్ని నింపాలని సూచించారు.ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ రాధామాధవి, డీఎస్పీ పి.జగదీష్ నాయక్, సఖి కేంద్రం ప్రతినిధి ఉషారాణి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పుష్ప, బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లా కలెక్టర్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం

### -పాలనా నైపుణ్యానికి దక్కిన గుర్తింపు -హైదరాబాద్‌లో అవార్డు ప్రదానం చేసిన అజయ్ సేత్

**బాపట్ల,మే23,ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా పరిపాలనలో విశిష్ట సేవలు అందిస్తూ, సమర్థ పాలనతో ముందుకు సాగుతున్న బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ఛైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ సేత్ చేతుల మీదుగా కలెక్టర్ ఈ అవార్డును అందుకున్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారం, పారదర్శకమైన పరిపాలన అందించడంలో కలెక్టర్ చూపిన ప్రత్యేక చొరవ, అంకితభావానికి గుర్తింపుగా నిర్వాహకులు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించడంలో ఆయన చేసిన కృషి అభినందనీయమని ఈ సందర్భంగా నిర్వాహకులు కొనియాడారు. కలెక్టర్‌కు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కడం పట్ల జిల్లా అధికార యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ప్రత్యేక



అభినందనలు తెలిపారు.

## రైతులకు భారంగా మారిన రొయ్యల మేత ధరలు : సింగరకొండ

**రేపల్లె, మే 23, ప్రభాతవార్త:** డెల్టా తీరప్రాంతంలో ఆక్వా రైతులపై రొయ్యల మేత ధరల పెరుగుదల భారం ఏర్పడిందని బాపట్ల జిల్లా సిపిఐ కార్యదర్శి తన్నీరు సింగరకొండ ఆందోళన వ్యక్తం చేశారు.శనివారం రేపల్లె



సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రొయ్యల మేత బస్తా ధర రూ.200 పెరిగిందన్నారు.ఇలాగే పెంచుకుంటూపోతే రైతుల ప్రతిఘటన ఎదుర్కోవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నిశితంగా పరిశీలిస్తే నిత్యావసర వస్తువుల ధరలు,గ్యాస్,పెట్రోలు,డీజిల్ ధరలు పెరిగి ప్రజలపై ఆర్థిక భారం ఏర్పడిందన్నారు.రాష్ట్రంలో 12 ఆర్టీసీ డిపోలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే చర్యలకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఉపాధికోల్పోయే కార్మిక కుటుంబాలపై ప్రభుత్వానికి ధ్యాసలేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఆక్వారంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు లభించడంలేదని చెప్పారు.రొయ్యలకు గిట్టుబాటు ధర ప్రకటించాలని ఆయన కోరారు.దళారుల ముసుగులో రొయ్యల ఫీడ్,ఉత్పత్తి,కొనుగోలు,విక్రయ వ్యవస్థ కొనసాగుతున్నందున రైతులకు తీరని నష్టం ఏర్పడుతున్నదని ఆయన ఆరోపించారు.ప్రభుత్వ పర్యవేక్షణ లేనందున విదేశీ మార్కెట్ వ్యవహారాలలో దళారుల ఆధిపత్యం పెరిగిందని సింగరకొండ వివరించారు.పెట్టుబడి పెరిగినందున రొయ్యల సాగు భారంగా మారిందని చెప్పారు.సిపిఐ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కన్నెగంటి రమేష్‌బాబు మాట్లాడుతూ తీరప్రాంతంలో క్వింటా మొక్కజొన్న ధర రూ.1500 నుండి రూ.1600కే విక్రయించుకోవాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడిందని చెప్పారు.క్వింటా మొక్కజొన్నకు రూ.2400 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.అర్హులైన మత్స్యకార కుటుంబాలకు మత్స్యకార భరోసా కింద రూ.20 వేలు అందకపోవడం శోచనీయమన్నారు.ఈ సమావేశంలో సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సూర్యలంక బీచ్‌లో పర్యాటకులకు ఉచిత వైద్యం

### త్వరలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు

### అత్యవసర మందులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలి

### తుఫాను రక్షిత భవనంలో పనులను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

**బాపట్ల,మే.23, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన సూర్యలంక బీచ్‌కు వచ్చే పర్యాటకులు, స్థానికులకు అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా ఉచిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన సూర్యలంక బీచ్‌లోని తుఫాను రక్షిత భవనంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వైద్య కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యలంక బీచ్‌కు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివస్తుంటారని, వారికి ఏ క్షణంలోనైనా అత్యవసర వైద్య సేవలు అవసరమైతే తక్షణమే స్పందించేలా ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. పీహెచ్‌సీలో అవసరమైన వైద్య సిబ్బందిని నియమించడంతో పాటు, ప్రాథమిక చికిత్స పరికరాలు, అత్యవసర మందులను నిరంతరం అందుబాటులో



ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని (డీఎంహెచ్‌వో) ఆదేశించారు. ఈ కేంద్రం ద్వారా కేవలం పర్యాటకులే కాకుండా స్థానిక ప్రజలు కూడా మెరుగైన ఉచిత వైద్య సేవలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ, ఇన్చార్జ్ జిల్లా పర్యాటక శాఖ అధికారి ఆనంద సత్యపాల్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్. విజయమ్మ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు తాడి చెట్టుపై నుండి పడి గాయపడ్డ తెదేపా కార్యకర్తకు రూ.లక్ష ఆర్థిక సాయం

**బాపట్ల.,మే 23,ప్రభాతవార్త ప్రతినిధి:** బాపట్ల మండలం అడవి పంచాయతీ పాండురంగాపురం కొత్త వాడరేవు గ్రామానికి చెందిన ప్రముఖ తెలుగుదేశం పార్టీ నాయకులు, 108 బూత్ ఇంచార్జీ వారి సుబ్రమణ్యం రెడ్డి ప్రమాదవశాత్తు తాడి చెట్టు మీద నుండి పడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న బాపట్ల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కావూరి శ్రీనివాస రెడ్డి శనివారం సుబ్రమణ్యం రెడ్డిని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, బాధితుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని కావూరి శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కావూరి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, సుబ్రమణ్యం రెడ్డి త్వరగా



కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల మండల టీడీపీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, ప్రముఖ నాయకులు చెన్నుపాటి కిషోర్, పాండురంగపురం టీడీపీ నాయకులు కుక్కల శ్రీనివాస రెడ్డి, బాల కోటేశ్వరరావు, లక్ష్మారెడ్డి, సమ్మెట మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

**రేపల్లె, మే 23, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని ప్రముఖ వ్యాపారవేత్త,



రేపల్లె నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోపిదేవి శ్రీనివాసరావు అన్నారు.శనివారం మండలంలోని చోడాయపాలెంలో ప్రపంచ మేధావి,భారత రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ 11 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ,మొదటి వార్షికోత్సవ వేడుక,అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.ఈ సందర్భంగా మోపిదేవి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శవంతంగా తీసుకోవాలని సూచించారు.బిఆర్ అంబేడ్కర్ పట్ల ప్రజలలో ఆదరణ పెరిగిందని చెప్పారు.ప్రజల సంక్షేమానికి తగిన విధంగా రాజ్యాంగాన్ని రూపొందించడమే ప్రధాన కారణమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ నాయకులు,వైకాపా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఉరుసు నిర్వహణ అభినందనీయం

**రేపల్లె, మే 23, ప్రభాతవార్త:** రేపల్లె పురపాలక సంఘంలోని 26వ వార్డు వైకాపా ఇన్‌ఛార్జి అబ్దుల్ కుద్దూస్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కాఫీ విత్ కేడర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ముస్లింలు పవిత్రంగా జరుపుకునే ఉరుసు కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు జరి గాయి.ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గం సమన్వయకర్త పీటా నాగ మోహన్‌కృష్ణ మాట్లాడు తూ ఉరుసు ఉత్సవాలలో మొక్కుబడులు తీర్చుకోవడం అభినందనీయమన్నారు. ఆధ్యాత్మిక



వాతావరణంలో భాగంగా గురువులు దేవునిలో లీనమైన పవిత్రమైన రోజుగా భావించి ఉరుసు కార్యక్రమం నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో వైకాపా పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు,వైకాపా కార్యకర్తలు,ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వేగేశన నరేంద్ర వర్మ జన్మదిన వేడుకలు

**బాపట్ల,మే23,ప్రభాతవార్తప్రతినిధి:** బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తెలుగుదేశం పార్టీ (తెదేపా)



కార్యాలయంలో శనివారం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పార్టీ శ్రేణులు, యువత ఈ శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా రక్తదాతలను అభినందిస్తూ బాపట్ల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కావూరి శ్రీనివాస రెడ్డి, తెదేపా మండల అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు చేతుల మీదుగా పండ్లు, జ్యూస్ మరియు బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్లను అందజేశారు.రక్తదానం ప్రాణదానంతో సమానం:ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కావూరి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెదేపా ముఖ్య నాయకులు మందపాటి ఆంధ్రేయ, చెన్నుపాటి కిషోర్, పల్లం సరోజిని, ఇతర అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

## టిఎన్టియుసి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఆలపాటి సతీమణి మాధవి జన్మదిన వేడుకలు

**తెనాలి మే23(ప్రభాతవార్త):** తెనాలి నియోజకవర్గ తెలుగు నాడు ట్రేడ్ యూనియన్(టిఎన్టియుసి)అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ సతీమణి ఆలపాటి మాధవి జన్మదిన వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. టిఎన్టియుసి సభ్యులు, కార్మికులు,తెదేపా కార్యకర్తల సమక్షంలో కేక్ కటింగ్ నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం ఆలపాటి మాధవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెనాలి నియోజకవర్గ టిఎన్టియుసి అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్ మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ కార్యకర్తలకు అండగా నిలుస్తూ క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీ నాయకునిగా



శాసన మండల సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ సాధించిన విజయాలుకు వెనకుండి నడిపించిన,ఆయన సతీమణి ఆలపాటి మాధవి సహకారం ఎంతగానో ఉందన్నారు. జిల్లాలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకునిగా ఆలపాటి రాజా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోగలిగారంటే ఆయనకు నిరంతరం వెన్నంటే ఉండి ఆదర్శ సతీమణిగా మీరు తీసుకునే జాగ్రత్తలు, ఆరోగ్యం పట్ల శ్రద్ధను ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమన్నారు.డెల్టా టైగర్, మా ప్రియతమ నాయకులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ వెన్నంటి ఉండే మీరు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నామన్నారు.

## దివ్యాంగునికి ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ అందజేత

**బాపట్ల,మే 23, ప్రభాతవార్త ప్రతినిధి:** బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా బాపట్ల మండలం వెస్ట్ బాపట్ల పంచాయతీకి చెందిన దివ్యాంగుడు భోగి రెడ్డి వెంకటేశ్వర రెడ్డికి కూటమి నాయకులు ప్రత్యేకంగా ఎలక్ట్రికల్ ట్రై సైకిల్‌ను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో బాపట్ల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కావూరి శ్రీనివాస్ రెడ్డి, బాపట్ల మండల టీడీపి అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు ముఖ్య అతిథులుగా పాల్గొని దివ్యాంగుడికి వాహనాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కావూరి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ జన్మదినాన్ని ఇలాంటి సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. నిరుపేదలు, దివ్యాంగుల ముఖాల్లో నవ్వులు పూయించడమే నిజమైన పుట్టినరోజు వేడుకని పేర్కొన్నారు.నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. బాధితుడు వెంకటేశ్వర రెడ్డికి



ఈ ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ ఎంతో జీవనోపాధికి ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ సేవా కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముఖాముల శివ.కూటమి ముఖ్య నాయకులు మందపాటి ఆంధ్రేయ, ఆచంట ఆమరేష్, చెన్నుపాటి కిషోర్, పల్లం సరోజినితో పాటు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగుదలకు అధికారుల శ్రమదానం

**రేవల్లె, మే23, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం,మున్సిపల్ పరిపాలన,పట్టణాభివృద్ధి శాఖ అత్యంత



ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ మార్గదర్శకాల ప్రకారం శనివారం రేపల్లె పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి,మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావులు శ్రమదానం చేశారు.ఇరిగేషన్ కార్యాలయం ఆవరణలో శుభ్రం చేశారు.పారిశుధ్య సమస్యను పరిష్కరించారు.ఆర్డీవో శ్రీదేవి మాట్లాడుతూ పర్యావరణాన్ని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ కార్యదర్శులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారాక్వాడ్ డైక్లోరైడ్ అమ్మితే లైసెన్స్ రద్దు

### -ఏడిఏ విజయబాబు

**కొల్లిపర,మే 23 ప్రభాతవార్త:** నిషేదించిన పారాక్వాడ్ డైక్లోరైడ్ మందును ఎరువుల షాపులో అమ్మినట్లు తెలిస్తే కఠినమైన చర్యలు తీసుకోవటంతో పాటు లైసెన్స్ ను కూడా రద్దు చేస్తామని ఏడిఏ విజయబాబు హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు గ్రామాల్లో ఏడిఏ విజయబాబు,మండల వ్యవ సాయాధికారి శ్రీనివాసరెడ్డితో కలసి పురుగు మందుల షాపులను ఆకస్మిక తనిఖీ చేసారు.ఈ సందర్భంగా



విజయబాబు మాట్లాడుతూ పారాక్వాడ్ డైక్లోరైడ్ వినియోగం వలన మనుషుల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు.ఈ మందుకు ప్రస్తుతం ఎటువంటి యాంటిడోస్ అందుబాటులో లేదన్నారు.

## పారాక్వాట్ డైక్లోరైడ్ 24శాతం ఎస్ఎల్ పై నిషేదం


**నిజాంపట్నం, మే 23, ప్రభాతవార్త:** రాష్ట్ర ంలో పారాక్వాట్ డైక్లోరైడ్ 24శాతం ఎస్ఎల్ మందుపై 60 రోజులు నిషేదం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మండల వ్యవసాయశాఖ అధికారి చుక్కా విజయరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పారాక్వాట్ డైక్లోరైడ్ 24 శాతం ఎస్ఎల్ దాని అన్ని ఫార్ములేషన్‌ల మందులపై నిషేదం ఉందన్నారు. కీటకనాశనిచట్టం 1968 సెంట్రల్ యాక్ట్ 46 ఆఫ్ 1968లోని సెక్షన్ 27(1), సెక్షన్ 3లోని క్లాజ్ (ఇ) ప్రకారం నిషేదం



తక్షణమే అమలులోకి వచ్చిందన్నారు. అమ్మకం, నిల్వ, పంపిణీ, తయారీ, వినియోగం పూర్తిగా నిషేదించారన్నారు.

## అభ్యంతరాల స్వీకరణ గడువు పెంచాలి : సి.వి.మోహనరావు

**రేపల్లె, మే 23, ప్రభాతవార్త:** రేపల్లె పురపాలక సంఘంలో 36 వార్డుల హద్దులకు సంబంధించి 23వ వార్డు హద్దులను మున్సిపల్ అధికారులు ప్రకటించలేదని రేపల్లె పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సి.వి.మోహనరావు చెప్పారు.శనివారం ఆయన మాట్లాడుతూ ఇలా చేయడం వలన ఏ విధంగా అభ్యంతరాలు తెలియజేయగలమని ప్రశ్నించారు.ఇప్పటికైనా జరిగిన లోపాలను గమనించి 23వ వార్డు హద్దులు ప్రకటించి



అభ్యంతరాలు తెలియజేసేందుకు గడువు తేదీని పెంచాలని మోహనరావు కోరారు.సవరణ నోటిఫికేషన్ జారీ చేయాలని మున్సిపల్ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## అణగారిన వర్గాల సంక్షేమానికి అంబేడ్కర్ కృషి

**రేపల్లె, మే 23, ప్రభాతవార్త:** జీవితాంతం అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన డాక్టర్ బిఆర్ అంబేడ్కర్‌కు భారతరత్న పురస్కారం లభించిందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ అన్నారు.శనివారం మండలంలోని చోడాయపాలెంలో బిఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వలన ప్రజలకు ప్రయోజనం చేకూరుతున్నదని చెప్పారు.ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్,వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# చెవిటికల్లు గ్రామంలో గ్రామసభ ,డ్రగ్స్ పై దండయాత్ర 2.0



**కంచికచర్ల మే 23 ప్రభాతవార్త:** కంచికచర్ల మండలం లోని చెవిటికల్లు గ్రామంలో ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ రూరల్ డీసీపీ బి.లక్ష్మి నారాయణ ఐపిఎస్, నందిగామ పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ సిహెచ్.శ్రీనివాస్ రావు మరియు నందిగామ రూరల్ సిఐ వై.వి.ఎల్ . నాయుడు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రూరల్ డీసీపీ గంజాయి మరియు ఇతర మత్తు పదార్ధాములకు గ్రామస్తులు మరియు యువత అందరు దూరంగా ఉండాలి అని, వాటికి సంబంధించి సమాచారం ఉంటే పోలీస్లకు తెలియపరచాలి అని తెలియజేశారు. గత కొన్ని రోజులుగా డ్రగ్స్ దండయాత్ర 2.0 కార్యక్రమంలో భాగంగా గంజాయి సేవిస్తున్న వారిని డ్రగ్ టెస్ట్ గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాము అని తెలియజేశారు. ప్రజల ఉఅందరు రోడ్ భద్రత ప్రమాణాలు పాటించాలి అని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి అని తెలియజేశారు. అదే విధంగా పోస్కో యాక్ట్, సైబర్ నేరముల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ రూరల్ డీసీప చెవిటికల్లు గ్రామంను డ్రగ్స్ రహిత గ్రామంగా గుర్తించడం జరిగింది అని తెలియజేశారు. ఈకార్యక్రమంలో కంచికచర్ల ఎస్సై విశ్వనాథ్, పోలీస్ సిబ్బంది మరియు చెవిటికల్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేదరోగుల ప్రాణం నిలబెట్టే దేవాలయం మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్

## కేంద్ర ప్రభుత్వానికి రోగుల అభినందనలు

**ఎ కొండూరు, మే 23, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ విజయవాడ గుంటూరు మధ్య 183 ఎకరాల పచ్చని సువిశాల ప్రాంగణంలో రూ1610 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎయిమ్స్ ఆసుపత్రి పేద ప్రజల ప్రాణం నిలబెట్టే దేవాలయంలా మంగళగిరిలో ఉండటం పట్ల పేద మధ్యతరగతి రోగులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్పురించారు. ఆపరేషన్కు 5లక్షలు కావలనే మాట ఇక మంగళగిరి ఎయిమ్స్ వల్ల మటుమాయం కావడంతో ఒక పేద తండి తన కూతురి పెళ్లి కోసం దాచిన డబ్బు ఒక తల్లికొడుకు చదువుకోసం కూడబెట్టిన సొమ్ము ఒక జబ్బుపేరు చెప్పి కార్పోరేట్ ఆసుపత్రుల్లో జేబులకు చిల్లులు పడకుండా ఇకబాదలు ఇబ్బందులు లేకుండా ఎయిమ్స్ విజయవాడ గుంటూరు మధ్య మంగళగిరిలో ఏర్పాటు చేయడం ట్రీట్మెంట్ చేస్తారు. ఇది ప్రభుత్వ ఆసుపత్రి అని చులకన చేయకండి. ఇది మన ఆస్తి మనకోసం కట్టిన ప్రపంచస్థాయి హాస్పిటల్ దీన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని కార్పోరేట్ ఆసుపత్రుల మాయలో పడవద్దు త్వరలో న్యూరాలజీ పూర్తిస్థాయిలో ప్రారంబం. ఓపి టైం ఉదయం 9 గంటల నుండి టికెట్ రూ.10కి మన ఎయిమ్స్ హాస్పిటల్ కాదు ఫైవ్స్టార్ హోటల్ను మరిపిస్తారు. ఒకసారి మంగళగిరి ఎయిమ్స్కు వెళ్లిరావడానికి విజయవాడ నుండి మంగళగిరి బస్టాండ్ నుండి డైరెక్ట్ బసుసలు బస్ టికెట్ రూ.10మాత్రమే ఆటో అయితే రూ.30-50 ఉదయం 9గంటలకు ఎయిమ్స్కు చేరుకుంటే అన్ని పరీక్షలు చేయించుకొని మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి వచ్చే అవకాశం ఉంది. ఆఫీసుకు సెలవు పెట్టాల్సిన పనిలేదు. 960బెడ్లు 600మంది డాక్టర్లు సామాన్య రైతులకు రోగులకు 24గంటలు అంకితభావంతో సేవ చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి వచ్చిన ప్రేమగా తెలుగులో మాట్లాడుతూ వైద్యానందిస్తారు. ఆధార్ కార్డు ఉంటే సరిపోతుంది.

# పాఠ్య పుస్తకాలు సరే బ్యాగ్స్,షూస్ తదితరాలు ఏవి ప్రభుత్వ తీరు ఆక్షేపనీయం

**ఎ కొండూరు, మే 23, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా ఎకొండూరు మండలానికి ఈ విద్యా సంవత్సరం (2026-27) 1 నుండి 10 తరగతి వరకు విద్యార్థినీ విద్యార్థులకు 13వేల 141 పాఠ్యపుస్తకాలు సరఫరా చేసింది. ఒకపాఠ్య పుస్తకాలు తప్ప విద్యార్థినీ విద్యార్థులకు బ్యాగ్స్ షూస్ తదితర వాటిని సరఫరా చేయలేదు. మండలంలోని 51 పాఠశాలల్లో 9జడ్పీహెచ్ఎస్ 42 ప్రాథమిక ప్రాథమికోన్నత 6 జడ్పి, 1కెజిబివి అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలకు వీటిని పంపిణీ చేశారు.

# మున్సిపాలిటీ పరిధిలో మన ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఆపరేషన్ క్లీన్ స్వీప్



**తిరువూరు, మే 23, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మున్సిపాలిటీ పరిధిలో మన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ (ఒక రాష్ట్రం ఒక పరిశుభ్రత లక్ష్యం) కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారులను చీపిరి పట్టి శుభ్రం చేసిన మున్సిపల్ ప్రత్యేక అధికారి మరియు ఆర్డీవో ఏ.కుమార్ ఏపీ ఆర్గానిక్ సర్టిఫికెట్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్ మున్సిపల్ కమిషనర్ కె.మనోజ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లెల శ్రీనివాస్ తెదేపా నేత మోదుగు వెంకటేశ్వరరావు దుక్కిపాటి కాళీ వర ప్రసాద్. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సచివాలయం సిబ్బంది మరియు పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా ఐటీసీ ప్రత్యేక కార్యక్రమాలు

విజయవాడ, మే 23, ప్రభాతవార్త : అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా ఐటీసీ లిమిటెడ్ తీరప్రాంత పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన మడ అడవుల సంరక్షణ ప్రాధాన్యంగా రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక కమ్యూనిటీల భాగస్వామ్యంతో దేశంలోని 10రాష్ట్రాల్లో ఇప్పటివరకు 7.8 లక్షల ఎకరాల్లో జీవవైవిధ్య పరిరక్షణ చర్యలు చేపట్టి 2030 నాటికి ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్లో మడ అడవుల పునరుద్ధరణతో పాటు ఆలివ్ రిడ్లే సముద్ర తాబేళ్ల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటివరకు సుమారు 1,500 ఎకరాల మడ అడవులను పునరుద్ధరించి 2025-26 నాటికి 250కి పైగా తాబేలు గూళ్లను రక్షి ంచి 23,700కు పైగా తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టినట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమాలు తీరప్రాంత జీవవైవిధ్య రక్షణతో పాటు స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి కూడా తోడ్పడుతున్నాయని సంస్థ పేర్కొంది.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు



**పెదనందిపాడు మే 23 (ప్రభాతవార్త) :** రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించనున్న పాఠ్యపుస్తకాలు మండల కేంద్రానికి చేరాయి. ఈ పాఠ్యపుస్తకాలను పెదనందిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాశాఖ అధికారులు భద్రపరిచారు. పాఠశాలలు తెరిచిన తొలిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మండల విద్యాశాఖ అధికారులు1.2. లు సిహెచ్ రమేష్ బాబు, పోపూరి జాకబ్ లు తెలియజేశారు. మండలంలోని 17 గ్రామపంచాయతీలో 9 జిల్లా పరిషత్,26 ప్రాథమిక పాఠశాలలో ఉన్నాయని తెలిపారు. వీటిలో 1 నుండి 10 తరగతులు చదివే విద్యార్థులు 1,610 మంది ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర పేరుతో అవసరమైన పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. మొదట విడతగా 7,000 వరకు పుస్తకాలు మండలానికి వచ్చాయని తెలిపారు. రెండవ విడతలో పుస్తకాలతో పాటు బూట్లు, యూనిఫాం మొదలగు కిట్స్ పూర్తిస్థాయిలో రానున్నట్లు వారు పేర్కొన్నారు . విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముందు చూపుతో ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు ఎలాంటి లోటు, అసౌకర్యాలు లేకుండా, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని . పాఠశాలలు ప్రారంభించిన తొలిరోజే మండలంలో పాఠ్యపుస్తకాలతో పాటు, కిట్స్ ను పంపిణీ చేస్తామని తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలను గుర్తించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విద్యాశాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# నవులూరులో బాటసారులకు మజ్జిగ పంపిణీ



**మంగళగిరి, మే 23, ప్రభాతవార్త :** నవులూరు ట్యాంక్ సెంటర్లో రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి వెంకటరావు ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రంను ప్రారంభించారు. చలివేంద్రాన్ని టీడీపీ నాయకులు ప్రారంభించారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. వెంకట్రావు తన వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడంతోపాటు, తాను సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలనే దృక్పథంతో వేసవిలో బాటసారులకు దప్పిక తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తొలిరోజు బాటసారులకు మజ్జిగ పంపిణీ చేసి, వేసవి కాలం వరకు ప్రతి రోజు చల్లటి మంచినీరు పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మర్రి ఏసుబాబు, కొత్త శ్రీను, దేశబోయిన వెంకట్రావు, రుద్రు శ్రీను, ఎస్ కె నజీర్, పొన్నం శ్రీనివాసరావు, తెల్లమేకల నాగేశ్వరరావు, తోట శ్రీను బాబు, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రత్నాల చెరువులో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

**మంగళగిరి, మే 23, ప్రభాతవార్త:** మంగళగిరి రత్నాల చెరువు లో మంత్రి నారా లోకేష్ చొరవతో మంజూరైనా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును పట్టణ



పార్టీ నాయకులు పంపిణీ చేశారు,ఉడతా మంగారత్నం కి రూ.55,000 ల విలువైన చెక్కును అందజేశారు,ఈ కార్యక్రమం లో రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి రియాజ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ఆకురాతి నాగేంద్రం, వార్డ్ అధ్యక్షులు వంగర రమేష్, వడిశా నరేష్, తోకల బాలాజీ, గంటా దుర్గా ప్రసాద్, గుంటి ప్రతాప్, అందె వీరాస్వామి, గోలి మధు, భూదాటి శ్రీను తదితరులు ఉన్నారు

# దేశ ప్రధాని పై అనుచిత వ్యాఖ్యలు తగదు



**గుంటూరు విద్య మే 23 ప్రభాతవార్త :** మన భారతదేశ ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసినటువంటి సినీ నటుడు ప్రకాష్ రాజ్ మీద కఠిన చర్యలు తీసుకోవాలని 140 కోట్ల మంది భారతదేశ ప్రజలకు ప్రతినిధిగా ఉన్నటువంటి భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారిని ఉద్దేశించి చులకన భావంతో మాట్లాడినటువంటి వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని ప్రకాష్ రాజ్ పై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు కట్టాలని భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుందనీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తే కనీస డిపాజిట్లు కూడా తెచ్చుకోలేనటువంటి వ్యక్తులు ఈ విధంగా మాట్లాడటం ఎంతవరకు కరెక్ట్ అని ఇటువంటి వ్యక్తులను కఠినంగా శిక్షిస్తే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు కాకుండా ఉంటాయని తెలియజేస్తున్నాం ఈరోజు దేశ ప్రధానమంత్రి ని విమర్శించే స్థాయికి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నందుకు ఇటువంటి వ్యక్తులను కఠినంగా శిక్షి ంచాలని మరొకసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని గుంటూరు జిల్లా కమిటీ హెచ్చరిస్తుందనీ చెరుకూరి తిరుపతిరావు పేర్కొన్నారు.

# గ్రంథాలయాలలో ఆటపాటలతో కూడిన విజ్ఞాన తరగతులు

**అమరావతి,మే23,ప్రభాతవార్త :** శాఖ గ్రంథాలయంలో ఆటపాటలతో కూడిన విజ్ఞాన తరగతులు జరుగుతున్నాయని గ్రంథాలయ శాఖ అధికారి వెంకాయమ్మ తెలిపారు. విద్యార్థులు సెలవు రోజుల్లో ఆటలాడుతూ బయట తిరుగుతూ తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని, వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శాఖ గ్రంథాలయంలో నిర్వహించే యోగ మెడిటేషన్, సూర్య నమస్కారాలు, కథలో రాయడం కథలు వినడం డ్రాయింగ్ క్లాసులలో పాల్గొని తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు.

# ప్రజల సమస్యలకు ప్రాధాన్యం : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి, మే23,(ప్రభాతవార్త):** ప్రజల సమస్యలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి,శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పట్టణం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ లో (గ్రీవెన్స్) పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి అర్జీ దారులకు తగు న్యాయం చేస్తామని భరోసా కల్పించారు.సమస్యలతో వచ్చేవారికి, సమస్య పరిష్కరిస్తామనే నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

**అనారోగ్యబాధితులకి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ:**

మానవత్వమే ధ్యేయంగా, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత కల్పిస్తున్న శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్.తెనాలి నియోజకవర్గంలోని 11 మంది వైద్య చికిత్స కోసం, తెనాలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్,మాజీ మంత్రి,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ మరియు ప్రత్యేక సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.4,63,060/ (నాలుగు లక్షల అరవై మూడు వేల అరవై రూపాయలు) మంజూరైంది.ఈ ఆర్థిక సహాయానికి సంబంధించి శనివారం బాధిత కుటుంబ సభ్యులకు రూ 4,63,060/ అందజేశారు.ఆపద సమయంలో ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,అలాగే ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎండి.ఖుద్దుస్,రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# తెనాలిలో ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న ఆకతాయిలకు పోలీసుల కౌన్సిలింగ్

**తెనాలి మే23(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని నందులపేట ప్రాంతంలో ఆడపిల్లలను వేధిస్తున్న ఆకతాయిలను పోలీసులు అదుపులోకి



తీసుకున్నారు. తెనాలి మండల తహసీల్దార్ కేవీ.గోపాలకృష్ణ కథనం ప్రకారం,శనివారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో నందులపేట ప్రాంతానికి చెందిన ఒక మహిళ తనను సంప్రదించి, కొంతమంది ఆకతాయిలు ఆడపిల్లలను వేధిస్తూ ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారని తాహసిల్దార్ తెలిపారు. తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, రోజూ బయటకు వెళ్లే సమయంలో పిల్లలు భయాందోళనలకు గురవుతున్నారని ఆ మహిళ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.ఫిర్యాదు అందిన వెంటనే తక్షణమే స్పందించి, 2 టౌన్ సీఐ రాముల నాయక్ తో కలిసి నందులపేట ప్రాంతంలో ప్రత్యేక పహారా నిర్వహించినట్లు తెలిపారు. ఈ పహారాలో ఆడపిల్లలను వేధిస్తున్న ఆకతాయిలను గుర్తించి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారని వెల్లడించారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు చెప్పారు...భద్రతకు ప్రాధాన్యత..: మహిళలు, చిన్నారుల భద్రతకు పరిపాలన మరియు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, భద్రతా రీత్యా ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తాహసిల్దార్ గోపాలకృష్ణ స్పష్టం చేశారు. మహిళలను వేధించే ఆకతాయిలపై కఠినంగా వ్యవహరిస్తామని, ఎల్లవేళలా ప్రజల రక్షణ తమ బాధ్యత అని పేర్కొన్నారు.తక్షణ స్పందనతో సమర్థవంతంగా చర్యలు తీసుకున్న 2 టౌన్ సీఐ రాముల నాయక్ కి తాహసిల్దార్ గోపాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధిహామీ పనులను పేదప్రజలు సద్వినియోగించుకోవాలి : ఏపివో వెంకయ్య



**కొల్లిపర,మే 23 ప్రభాతవార్త:** పేద ప్రజలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగించుకోవాలని డిఆర్డిఏ ఏపివో వెంకయ్య అన్నారు.శనివారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి,తూములూరు,చివలూరు,కొల్లిపర గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు.కూలీలకు వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు.ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా పేద ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు.పేద ప్రజల కోసమే ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.ఉపాధిపనుల్లో పాల్గొనే కూలీలకు చేసిన పనులను బట్టి వేతనం ఇవ్వటం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు వల్లభాపురం బుజ్జిబాబు,కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేలా రాజ్యాంగ సవరణ చేయాలి

## సుప్రీంకోర్టు న్యాయవాది.గుమ్మా శ్రీనివాస్ యాదవ్ డిమాండ్



**గుంటూరు విద్య మే 23 ప్రభాతవార్త :** పార్లమెంటులోని ఎగువ సభ అయిన రాజ్యసభకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడానికి రాజ్యాంగ సవరణ చేయాలని సుప్రీం కోర్టు న్యాయవాది గుమ్మా శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. స్థానికంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యసభ అనే పేరును 1954 ఆగస్టు 23 వ తేదీన సభలోనే ప్రకటించారని, రాజ్యసభ సభ్యుల సంఖ్యను గూర్చి భారత రాజ్యాంగంలో నాల్గవ షెడ్యూల్ తెలుపుతుందని మరియు 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని అనుసరించి గరిష్ఠ సభ్యుల సంఖ్య 250 గా నిర్ణయించారని చెప్పారు. భారత దేశం ప్రజాస్వామ్య దేశం, ప్రజా ప్రతినిధులను ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకోవాలి.కానీ రాజ్యసభకు పరోక్ష విధానంలోనే ఎన్నిక జరుగుతుందని చెప్పారు..ప్రస్తుతం రాజ్యసభ సభ్యులను ఎన్నుకునే పద్ధతిని భారతదేశం దక్షిణాఫ్రికా నుండి గ్రహించిందని, నియోజకవర్గాల ప్రాతిపదికన ప్రత్యక్ష ఎన్నికలు జరగడం లేదని చెప్పారు. భారత రాజ్యాంగంలో 83 వ అధికరణ ప్రకారం రాజ్యసభ పదవీ కాలంపై ఎలాంటి ప్రస్తావన పేర్కొనలేదని, ప్రజాప్రాతినిధ్య చట్టము1951 అనుసరించి రాజ్యసభ సభ్యుల పదవీకాలం 6 సంవత్సరాలుగా నిర్ణయించారని చెప్పారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యులను నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో రాష్ట్ర విధాన సభలో ఎన్నికైన సభ్యుల చేత ఎన్నుకోబడుతున్నారని చెప్పారు. ఒక ప్రజాప్రతినిధి మరొక ప్రజాప్రతినిధిని ఎన్నుకోవడం పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిలో సరికాదని సూచించారు..లోక్ సభ మాదిరిగా రాజ్యసభకు కూడా నియోజకవర్గాల వారీగా ఎన్నికలు జరిగేలా రాజ్యాంగ సవరణ చేసి, సాధారణ ప్రజలకు కూడా భాగస్వామ్యం కల్పించాలని సూచించారు..

# పోలీసులా..తెదేపా కార్యకర్తలా..!

-రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆగదుస
-త్వరలో ఆమరణ నిరాహారదీక్ష చేపడతాం
-పోలీసులపై చర్యల కోసం మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తాం
-సమన్వయకర్తలు అంబటి, వరికూటి, పీట

**పొన్నూరు, మే 23, ప్రభాతవార్త:** పోలీసులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించడం చూస్తుంటే రాష్ట్రంలో రాక్షసపాలన నడుస్తుందనే అనుమానం ప్రజలకు కలుగుతుందని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. మామిళపల్లి గ్రామంలోని రైతులను పరామర్శించేందుకు వెళ్ళిన రేపల్లె సమన్వయకర్త పీటా నాగ మోహన్‌కృష్ణను అరెస్టు చేయడం ధారుణమన్నారు. పీట నాగ



మోహన్‌కృష్ణను చేబ్రోలు స్టేషన్‌లో కొంతసేపు, ఆ తర్వాత పొన్నూరు స్టేషన్‌కు తరలించి ఇబ్బందులకు గురిచేశారన్నారు. అదేమని అడగడానికి తాము వస్తే తమపై కూడా పోలీసులు ప్రవర్తించిన తీరు తీవ్ర ఆక్షేపణీయమన్నారు. కొల్లూరులో టిడిపికి చెందినవారు స్టేషన్‌పై దాడికి పాల్పడితే ఇంతవరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. పోలీసులపై తెలుగుదేశం గుండాలు దాడులు చేశారని, అందుకు సీఎం చంద్రబాబునాయుడు సిగ్గుపడాల్సిన విషయమన్నారు. మామిళ్ళపల్లి రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్నారు. కొంత మంది పోలీసుల చేష్టల వల్లే పోలీసు వ్యవస్థ దిగజారిపోతుందన్నారు. పోలీసు అధికారుల తీరుపై మానవ హక్కుల సంఘంలో ఫిర్యాదు చేస్తామన్నారు. రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ మొక్కజొన్న రైతులకు సంఘీభావం తెలిపేందుకు వస్తే పోలీసులు అక్రమంగా అడ్డుకోవడం




ధారుణమన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన ఉందో, కిమ్ పాలన ఉందో అర్థం కావడం లేదన్నారు. రైతులకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన తమ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ రకరకాల పోలీస్ స్టేషన్లు తిప్పుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అంబటి మురళీకృష్ణకు మద్దతుగా, మొక్కజొన్న రైతులకు సంఘీభావం తెలిపేందుకు రేపటి నుండి నిరసన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ స్థానిక సిఐ, ఎస్సైలు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. వరికూటి అశోక్‌బాబును స్టేషన్ వద్ద కిందపడేసి లాగడం, అసభ్యంగా ప్రవర్శించడం, చొక్కా చించడం వంటివి సరైన విధానం కాదన్నారు. మామిళ్ళపల్లిలో జరిగిన అన్యాయాన్ని, అక్రమాన్ని ప్రశ్నించడం, వారికి సంఘీభావం తెలియజేయడం నేరమా అని ప్రశ్నించారు. రైతులకు న్యాయం చేయడానికి త్వరలో ఆమరణ నిరాహారదీక్ష చేపడతామన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం అన్యాయమని, అక్రమమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమం ఎట్టిపరిస్థితుల్లోనూ ఆగదని, రైతులకు న్యాయం జరిగేదాక సాగుతుందని హెచ్చరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిశుభ్రత అందరి బాధ్యత

## -మునిసిపల్ కమిషనర్ పిన్నిబోయిన పోతురాజు

**పొన్నూరు, మే 23, ప్రభాతవార్త:** పరిశుభ్రత అనేది కేవలం పారిశుధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని మునిసిపల్ కమిషనర్ పిన్నిబోయిన పోతురాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని శనివారం పట్టణంలో ప్రారంభించారు. స్థానిక అబ్దుల్ కలామ్ మార్గ్ నుండి గాంధీబొమ్మ సెంటర్ వరకు, ఎస్పీపీరోడ్డులో గల దుకాణాల వద్ద ఈ కార్యక్రమాన్ని



నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పోతురాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి ఈ నాలుగు వారాల ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా పొన్నూరును క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చడమే మనందరి లక్ష్యమన్నారు. మొదటి వారంలో గార్బేజిబ్లాక్ స్పాట్స్(చెత్త పేరుకుపోయే ప్రాంతాలు) పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. కార్యక్రమంలో పఠాన్ పిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, షేక్ యాసిన్‌బాబా, ఆకుల సాంబశివరావు, నన్నపనేని బాలకృష్ణ, గురుబాలు తదితరులున్నారు. నన్నపనేని రఘునాథ్ తదితరులున్నారు.

# సేవా కార్యక్రమాల్లో ముందుంటాం.!

## -ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్

**పొన్నూరు, మే 23, ప్రభాతవార్త:** సమాజానికి సేవ చేయడంలో ఆర్యవైశ్య సంఘం ఎప్పుడూ ముందుంటుందని ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్ అన్నారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో వేసవిని దృష్టిలో ఉంచుకొని గత 20 రోజుల నుంచి మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా శనివారం విపరీతమైన ఎండ



తీవ్రత ఉన్నప్పటికీ అసోసియేషన్ అధ్యక్షుడు కారుమూరితోపాటు పలువురు సభ్యులు మజ్జి పంపిణీ చేశారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో మంచినీరు కంటే చల్లని మజ్జిగ అందించడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతోనే అధిక సంఖ్యలో ప్రజలకు మజ్జిగను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

24-5Pg6exHMNWJQE 10_24-5Pg6exHMNWJQE.qxd 23/May/26 11:10 PM Page 1



# విజయవాడలో అర్ధరాత్రి కార్లతో బీభత్సం సృష్టించిన ఇద్దరు యువకులు అరెస్టు

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో అర్ధరాత్రి రాత్రి కార్ల(థార్ వెహికిల్స్)తో బీభత్సం సృష్టించిన ఇద్దరు యువకులను అరెస్టు అరెస్ట్‌చేసినట్లు పోలీసులు ప్రకటించారు.. అరెస్టయిన వారిలో యువకుడు బొల్లా ఓంకు డ్రగ్ టెస్ట్ లో పాజిటివ్ ఉన్నట్లుగా గుర్తించినట్లు వెల్లడించారు.పాజిటివ్ రావడంతో బొల్లా ఓంపై మరో కేసు నమోదుచేసినట్లు వివరించారు.విజయవాడ పటమటలో గతరాత్రి వాహనాలతో యువకులు హల్ చల్. చేసారు. థార్ వాహనాలతో పరస్పరం ఢీకొంటూ.. స్థానికులను భయభ్రాంతులకు గురిచేసారు. యువతి విషయంలో ఈ ఇద్దరు యువకులు నడిరోడ్డుపై థార్ వెహికిల్స్‌తో ఢీకొట్టుకుని బీభత్సం సృష్టించారు. వేకువజాము నుంచి వాట్సాప్, ఫోన్‌లో రెచ్చగొట్టుకున్న వీరి గొడవ ఆర్ఆర్ గార్డెన్ వద్ద తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెండేళ్ల కిందట పరిచయమైన వీరిద్దరూ సన్నిహితంగా ఉండేవారు. బీబీఏ పూర్తి చేసిన ఓమ్ తండ్రి బోల్లా జితేంద్రకు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ చూస్తున్నాడు. రోహిత్ తాడేపల్లిలో బీబీఏ మొదటి ఏడాది చదువుతున్నాడు. అతని తండ్రికి ట్రాన్స్‌పోర్టు సంస్థ ఉంది. ఘటన సమయంలో రోహిత్ కారులో మరో స్నేహితుడు ఉన్నాడు అతను వారిస్తున్నా వినకుండా రోహిత్ ఆవేశంతో దాడికి దిగాడు.ఈ నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్న క్రమంలో డ్రగ్స్ పరీక్షల్లో ఒకరికి పాజిటివ్ రాగా, మరో జీపులో సిరంజ్, ఈ సిగరెట్ కిట్ లభించాయి.

శుక్రవారం రాత్రి పటమట పోలీసులు ఇద్దరి ఇళ్లల్లో సోదాలు చేశారు. గంజాయి, డ్రగ్స్ లభించలేదు.

కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బీఎన్ఎస్ 285, 281, 292, 351(2) రెడ్ విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఏ1గా బోల్లా ఓమ్, ఏ2గా లింగమనేని రోహిత్‌లను చేర్చారు.



లింగాలలో నూతనంగా నిర్మించిన రహదారిని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇతర ప్రజాప్రతినిధులు

# గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి కృషి :కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, మే 23, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో అధ్వాన్నంగా ఉన్న రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేసు_ందని కెడిసిసి చైర్మన్ నెట్టెం రఘురామ్, మాజీ ఎమ్మెల్సీ టిడి.జనార్ధన్‌లు పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయి మండలం లింగాల గ్రామంలో రూ.1.19కోట్లతో నూతనంగా నిర్మించిన మెటల్‌రోడ్‌ను శనివారం జిల్లాకలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యలతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి హాయాంలో రహదారులు అన్ని చిధ్రం అయిపోయినా అప్పటి పాలకులు వాటికి కనీసం మరమత్తులు కూడా నిర్వహించలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారు అభివృద్ధిపై దృష్టిసారించామని, ముందుగా రహదారులకు మరమత్తులు చేపట్టామన్నారు. గ్రామాల అభివృద్ధిలో రహదారులు ఎంతో కీలక భూమిక పోషిస్తాయని అభిప్రాయం వ్యక్తం చేసారు. ఈకార్యక్రమంలో డ్వామా పిడి ఏ.రాము, నందిగామ ఆర్డీఓ అనీల్‌కుమార్, స్థానిక నాయకులు, అదికారులు పాల్గొన్నారు.వత్సవాయి మండలం బీమవరం, మక్కపేట గ్రామాల్లో శనివారం ఉదయం ఎన్‌టిఆర్ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా బడిపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా భీమవరం గ్రామంలో ఇంటింటి అవగాహన కార్యక్రమంలో పాల్గొని తల్లిదండ్రులతో మాట్లాడారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్చి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు, వసతులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్ధులకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం ఇస్తుందని ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రయివేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన 26మంది విద్యార్ధులను వారి తల్లిదండ్రులను కలెక్టర్ అభినందించారు.

## జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఘన సన్మానం




ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను సన్మానిస్తున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**అనంతపురం, మే 23, (ప్రభాతవార్త బ్యూరో)** జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి, తమ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి, మన రాష్ట్రానికి, మన దేశానికే గౌరవం తీసుకొచ్చిన జూనియర్ క్రీడాకారులను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ శనివారం సన్మానించారు. అంతే కాకుండా ముగ్గురు క్రీడాకారులకు ఒక్కొక్కరికి ఎమ్మెల్యే గారు తన స్వంత నిధులతో 50వేల రూపాయలు విలువ చేసే కిట్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్ సి సభ్యులు కదిరి డియస్పీ శివ నారాయణస్వామి, కదిరి ఆర్డివో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు అనేవి కేవలం గెలుపోటములకే పరిమితం కావు. అవి మనిషిలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, క్రమశిక్షణను, జట్టు భావనను పెంపొందిస్తాయి. ప్రతి విజయానికి వెనుక ఎన్నో గంటల సాధన, ఎన్నో త్యాగాలు, ఎన్నో కష్టాలు దాగి ఉంటాయి. ఆ కష్టాన్ని జయించి జాతీయ స్థాయిలో నిలవడం చిన్న విషయం కాదన్నారు.మన క్రీడాకారులు సాధించిన విజయాలు మరెందరో పిల్లలకు , యువతకు స్ఫూర్తిదాయకం. మీ పట్టుదల, మీ కృషి చూసి ఇంకా ఎంతో మంది పిల్లలు క్రీడల వైపు అడుగులు వేస్తారని తాను నమ్ముతున్నానని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆశాభావం వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా క్రీడాకారులకు కిట్ బ్యాగులను బహుకరించడం కేవలం ఒక బహుమతి మాత్రమే కాదు ,ఇది మీ ప్రతిభకు గుర్తింపు, మీ భవిష్యత్ ప్రయాణానికి ప్రోత్సాహం, ఇంకా మరిన్ని విజయాలను సాధించాలనే ఆశీస్సుల ప్రతీక. జాతీయ స్థాయిని దాటి అంతర్జాతీయ స్థాయిలో కూడా భారతదేశ జెండాను ఎగురవేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని కందికుంట వెంకట ప్రసాద్ పిల్లలకు ఆశీర్వాదాలు అందించారు. మీ విజయ ప్రయాణంలో మీ కుటుంబ సభ్యులు, సి ఆర్ సి సభ్యులు అందించిన సహకారం కూడా ఎంతో గొప్పదని వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# వివాహేతర సంబంధం నేపథ్యంలో దారుణ హత్య

## - ముగ్గురు నిందితులు అరెస్టు

**వింజమూరు (నెల్లూరు), మే 23, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలోని వింజెటమ్మ కొండ ఆలయ సమీపంలో పాలవాగు వద్ద మే 16న జరిగిన మేదరమెట్ల శ్రీకాంత్ (32) హత్య కేసును పోలీసులు ఛేధించారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని కలిగిరి సీఐ పి.సుబ్బారావు వెల్లడించారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ మాట్లాడుతూ హత్యకు కారకులైన వాకాటి హరిబాబు, మూలి వెంగమ్మ ప్రదీప్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం నాగిరెడ్డిపాలెంకు చెందిన వెంగమ్మ వీర్నకల్లు గ్రామానికి చెందిన మేదరమెట్ల శ్రీకాంత్‌ను వింజెటమ్మ కొండ సమీపానికి రమ్మని ఫోన్ చేసి పిలిచింది. అక్కడ ముందుగానే వేచి ఉన్న వీర్నకల్లు గ్రామానికి చెందిన హరిబాబు, ఏఎస్‌పేట మండలం కాకర్లపాడుకు చెందిన ప్రదీప్‌లు శ్రీకాంత్‌పై దాడి చేసి కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం అనుమానం రాకుండా మృతదేహాన్ని ముళ్ళపొదల్లో పడేసి అక్కడి నుంచి పరారయ్యారు. నాగిరెడ్డిపాలెంకు చెందిన వెంగమ్మతో మృతుడు శ్రీకాంత్‌కు గత మూడేళ్లుగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అదే సమయంలో వెంగమ్మకు వీర్నకల్లు గ్రామానికి చెందిన వాకాటి హరిబాబు, ఏఎస్‌పేట మండలం కాకర్లపాడుకు చెందిన ప్రదీప్‌తోనూ సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నాయి. ఈ వివాహేతర సంబంధాల నేపథ్యంలో తలెత్తిన విభేధాలతోనే పథకం ప్రకారం హత్య చేసినట్లు విచారణలో తేలిందన్నారు. జిల్లా ఎస్పీ అజితా వేజెండ్ల ఆదేశాల మేరకు, కావలి డీఎస్పీ సూచనల మేరకు వింజమూరు ఎస్సై మాదాల ఉమామహేశ్వరరావు, కలిగిరి ఎస్సై ఉమాశంకర్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, క్లూసన టీం సహాయంతో సమగ్రంగా దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అరెస్టు చేశామని సీఐ వెల్లడించారు. ఈ కేసును ఛేధించడంలో వింజమూరు ఎస్సై మాదాల ఉమా మహేశ్వరరావు, కలిగిరి ఎస్సై ఉమాశంకర్, సిబ్బంది కీలకంగా వ్యవహరించారని సీఐ అభినందించారు. వింజమూరు ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉమా మహేశ్వరరావు ఎంతో బాధ్యతాయుతంగా పని చేసి నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు.




# నేరంచేస్తే పోలీస్ చట్టం పవర్ చూపిస్తా

## - నేరస్థుల్లో భయం సృష్టించేలా కఠిన చర్యలు

### రౌడీషీటర్లకు కౌన్సిలింగ్‌లో ఎస్పీ సుబ్బరాయుడు

**తిరుపతి,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లా ప్రశాంతతకు,పవిత్రతకు నిలయమని, ఇక్కడ ప్రజలకు యాత్రికులకు పూర్తిభద్రత కల్పించడమే పోలీసు ధ్యేయమని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు స్పష్టం చేశారు. పోలీస్ చట్టం పవర్, దాన్ని కఠినంగా అమలు చేస్తే ఎలా ఉంటుందో వివరిస్తూ అవగాహన కల్పించారు. సమాజంలో శాంతిభద్రత లను పరిరక్షి ంచడం, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడం, నేరస్థుల్లో మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారు 450 మంది హాజరయ్యారు. వారిలో రౌడీ షీటర్లు, గంజాయి విక్రేతలు, వినియోగదారులు, దొంగతనాలకు పాల్పడే వ్యక్తులు, ముఖ్యంగా మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడిన పోక్సో నిందితులు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌పల్లి పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్లు, గంజాయి కేసుల్లో నిందితులు, దొంగతనాలకు పాల్పడే వ్యక్తులు, పోక్సో కేసుల ముద్దాయిలకు ప్రత్యేక మెగా కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు స్వయంగా పాల్గొని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 257 ఎన్.డీపీఎస్ షీట్లు, 184 పోక్సో షీట్లు ఓపెన్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. అలాగే 13 మంది రౌడీ షీటర్ల పై పీడీ యాక్ట్ , గంజాయి..డ్రగ్స్ సరఫరా చేస్తున్న 17 మందిపై పీఐటీ ఎన్.డీపీఎస్ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. "తిరుపతి వంటి పవిత్ర ప్రాంతంలో రౌడీయిజం, గంజాయి, మహిళలపై నేరాలు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. ఒకసారి రౌడీ షీట్ ఓపెన్ అయితే ప్రతి కదలికపై పోలీసుల నిఘా ఉంటుంది. మళ్లీ నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్, ఎక్స్‌టర్నమెంట్ వంటి కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. అలాగే "మార్పు చెందితే పోలీస్ శాఖ మీకు అండగా ఉంటుంది. కానీ ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షి ంచేందుకు వెనుకాడం" అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గంజాయి వినియోగాన్ని గుర్తించే ఆధునిక యూరిన్ టెస్ట్ విధానంపై అవగాహన కల్పించారు. ఆధునిక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా కేవలం ఐదు నిమిషాల్లో యూరిన్ టెస్ట్ ద్వారా గంజాయి వినియోగాన్ని గుర్తించవచ్చని, గత 30 రోజుల వరకు వినియోగ చరిత్ర బయటపడుతుందని చెప్పారు. పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారి ద్వారా గంజాయి సరఫరా గొలుసును గుర్తించి మూలాలను పూర్తిగా అణచివేస్తామని హెచ్చరించారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రజల భద్రత, మహిళలు... చిన్నారుల రక్షణ, నేర నియంత్రణ విషయంలో అత్యంత కట్టుదిట్టంగా వ్యవహరిస్తోందని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రశాంత వాతావరణం కల్పించడం తమ బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు,అదనపు ఎస్పీ రవిమనోహరచారి, శ్రీనివాస్ (క్రైమ్స్), డియస్పీలు భక్త వత్సలం, గీతా కూమారి, శ్రీలత, సిఐలు, ఎస్సైలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పిఎం ఇబస్ సేవా పథకం - గ్రీన్ మొబిలిటీ వేగవంతం

## - ఎలక్ట్రిసిటీ ప్రజా రవాణాలో దేశానికి ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్: ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్

**విజయవాడ, మే23, ప్రభాతవార్తప్రతినిధి:** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం ఈబస్ సేవ పథకం కింద విద్యుత్ మొబిలిటీ మౌలిక సదుపాయాల ఏర్పాటులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) వేగంగా ముందుకు సాగుతున్నదని గౌరవ ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ తెలిపారు. ప్రధాన మంత్రి ఈ బస్ సేవా పథకం లో భాగంగా రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన విద్యుత్ సౌకర్యాలకు మౌలిక వసతుల కల్పనకు సంబందించిన పనుల పురోగతిపై శనివారం స్థానిక విద్యుత్ సౌధలో ఏపీఎస్ఆర్టీసీఇంచార్జి ఎండి యం.టి. కృష్ణ బాబు తో కలిసి డిస్కంల సీఎండీలు శివశంకర్ లోతేటి, పృథ్వి తేజ్ ఇమ్మడి, పి. పుల్లా రెడ్డి, ఏపీట్రాన్స్‌కో, డిస్కంల సి ఈ లు , ఎస్ ఈ లు ఏపీఎస్ఆర్టీసీజోనల్ స్థాయి అధికారులతో వర్చువల్ గా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమం రాష్ట్రంలో సుస్థిర పట్టణ రవాణా వ్యవస్థల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక ప్రజా రవాణా సేవల విస్తరణకు కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయిడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హరిత రవాణా కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాలుష్య నియంత్రణ, స్వచ్ఛ ఇంధన వినియోగం, ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడం లక్ష్యంగా విద్యుత్ ఆధారిత ప్రజా రవాణా వ్యవస్థలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నామని ఆయన వివరించారు. పీఎం ఈబస్ సేవా పథకం టెండర్11 కింద కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆంధ్రప్రదేశ్‌కు 11 నగరాలు, 12 డిపోలను కలుపుకుని మొత్తం 750 విద్యుత్ బస్సులను మంజూరు చేసిందన్నారు. అదనంగా సి ఈ ఎస్ ఎల్ టెండర్III కింద ప్రత్యేక కేటాయింపుగా తిరుపతికి మరో 300 విద్యుత్ బస్సులు మంజూరైనట్లు తెలిపారు. దీంతో విద్యుత్ మొబిలిటీ రంగంలో దేశంలో ముందంజలో నిలిచే రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ కూడా అగ్రగామిగా అవతరిస్తోందన్నారు.



పిఎం ఇ బస్ సేవా పథకం కింద గ్రీన్ మొబిలిటీ వేగవంతం అంశంపై జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్

మంజూరైన 750 బస్సుల్లో 621 బస్సులు 12 మీటర్ల విభాగానికి, 129 బస్సులు 9 మీటర్ల విభాగానికి చెందినవని తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, గుం టూరు, నెల్లూరు, కర్నూ లు, కాకినాడ, రాజమ హేంద్రవరం, కడప, అమరావతి, తిరుపతి, అనంతపురం వంటి ప్రధాన పట్టణాల్లో ఈ బస్సులను ప్రవేశపెట్ట నున్నట్లు తెలిపారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణహిత, ఆధునిక ప్రజా రవాణా సేవలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. విద్యుత్ బస్సుల నిరంతరాయ కార్యకలాపాలకు అవసరమైన బిహైండ్‌దిమీటర్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను అన్ని డిపోల్లో సమాంతరంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ పనులకు కేంద్ర సాంక్షనింగ్ అండ్ స్టీరింగ్ కమిటీ గణనీయమైన ఆర్థిక సహాయాన్ని ఆమోదించిందన్నారు. మొత్తం రూ.89.99 కోట్ల అంచనాకు గాను రూ.79.98 కోట్లను సి ఎస్ ఎస్ సి మంజూరు చేసిందని తెలిపారు. ఈ పనుల్లో హైటెన్షన్ విద్యుత్ కనెక్టివిటీ వ్యవస్థలు, చార్జింగ్ స్టేషన్లు, విద్యుత్ నెట్వర్క్‌లు, డిపో స్థాయి పవర్ మేనేజ్‌మెంట్ సదుపాయాల అభివృద్ధి వంటి కీలక అంశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏపీ ట్రాన్స్‌కో, డిస్కంలతో సమన్వయం ద్వారా హైటెన్షన్ విద్యుత్ కనెక్టివిటీ పనుల్లో గణనీయమైన పురోగతి సాధించామని కె. విజయానంద్ తెలిపారు.

సింహపురి, గాజువాక, కాకినాడ, కర్నూలు, అనంతపురం ప్రాంతాల్లో బీటీఎం మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.17.86 కోట్లను విడుదల చేసిందన్నారు. ఈ నిధులను 2026 మార్చి 16న ఏపీ ట్రాన్స్‌కోతో పాటు ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ వంటి సంబంధిత డిస్కంలకు బదిలీ చేశామని తెలిపారు. ఈ ప్రాంతాల్లో బీటీఎం పనుల అమలుకు లెటర్స్ ఆఫ్ అక్సెప్టెన్స్ కూడా జారీ చేయడం జరిగిందన్నారు.

విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టే షెడ్యూల్‌కు అనుగుణంగా చార్జింగ్ స్టేషన్లు సిద్ధంగా ఉండేలా 12 డిపోలలో ఎల్‌టీ వైపు మౌలిక సదుపాయాల పనులను కూడా సమాంతరంగా చేపట్టినట్లు తెలిపారు.

# సత్యవరంలో ఈదురు గాలుల భీభత్సం

## కొబ్బరి చెట్టు కూలి ఇద్దరు కూలీలు దుర్మరణం

**పాయకరావుపేట రూరల్, మే 23, ప్రభాతవార్త** మండలంలోని సత్యవరంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులు భీభత్సం సృష్టించాయి. పెద్ద ఎత్తున వీచిన ఈ పెనుగాలులకు సత్యవరంలోని తమలపాకులు తోటలో కూలీ పనులు చేస్తోన్న అరట్లకోట గ్రామానికి చెందిన ఇద్దరు నిరుపేద కూలీలు దుర్మరణం చెందారు. దీంతో అరట్లకోట గ్రామంలో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి. ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని అరట్లకోట గ్రామానికి చెందిన గర్లంక ఎరకయ్య అలియాస్ ఓం శాంతి దొరబాబు (41), గెడ్డమూరి శంకర్ (55) లు శనివారం ఉదయం తమ తోటి కూలీలైన గెడ్డమూరి సన్యాసిరావు, వేముల రాంబాబు, చిట్టిపళ్ల రమణలతో కలసి తమ ప్రక్క గ్రామమైన సత్యవరంలోని సఖిలేటి కృష్ణ అనే రైతుకు చెందిన తమలపాకు తోటలో కూలి పని చేయడానికి వెళ్లారు. వీరు తమలపాకు తోటలో పని చేస్తూ ఉండగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో సత్యవరం గ్రామంలో పెద్ద ఎత్తున వీచిన ఈదురు గాలులు భీబత్సం సృష్టించాయి. బలంగా వీచిన పెను గాలులకు కొబ్బరి చెట్టు కూలి వీరిపై పడటంతో అరట్లకోట గ్రామానికి చెందిన నిరుపేద కూలీలు గర్లంక ఎరకయ్య అలియాస్ ఓం శాంతి దొరబాబు, గెడ్డమూరి శంకర్ సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే సిఐ సాకేటి శంకరరావు, ఎస్ఐ మహమ్మద్ అలీ తమ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామని ఏఎస్ఐ జెర్రిపోతుల గోవిందరావు తెలిపారు.బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన జనసేన నాయకులు గెడ్డం బుజ్జి : పెను గాలులు భీభత్సానికి కొబ్బరి చెట్టు కూలి మృతి చెందిన గర్లంక ఎరకయ్య (ఓం శాంతి దొరబాబు), గెడ్డమూరి శంకర్ కుటుంబ సభ్యులను జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి ఓదార్చారు. ప్రమాదం జరిగిన సంగతి తెలుసుకున్న గెడ్డం బుజ్జి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పోలీసులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మృతుల కుటుంబాలకు అండగా నిలిచి అన్నివిధాలా ఆదుకుంటామని బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు. ప్రమాదం జరిగిన సంగతి తెలిసిన వెంటనే తెలుగుదేశం పార్టీ అరట్లకోట గ్రామ శాఖ అధ్యక్షులు కట్టా శ్రీను, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మల గణేష్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# విత్తనాల బంతులతో సామాజిక వనాలు

**గుంటూరు, మే 23 ప్రభాత వార్త ప్రతినిధి :** విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంచుదామని తిరుపతి సర్కిల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. గుంటూరు అటవీశాఖ కార్యాలయంలో తిరుపతి, గుంటూరు సర్కిల్స్ పరిధిలోని బాపట్ల, ప్రకాశం, గుంటూరు, రాయచోటి, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల డిఎఫ్ఒలు, సోషల్ ఫారెస్ట్రీ అధికారులతో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నంతో విత్తనాల బంతులు తయారు చేయడంపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రభుత్వం 2.5 కోట్ల విత్తనాల బంతులు తయారు చేయడం జరుగుతుందని వివరించారు. దేశీయ అడవి విత్తనాలు సేకరించుదామని పిలుపునిచ్చారు. ఇందుకుగాను గ్రీన్ క్లైమేట్ టీం సూచించిన అన్ని ప్రాంతాలలోనూ సోమవారం ఉదయం నుంచి విత్తనాలు సేకరించడం అవసరమని గమనించాలని అన్నారు. ఔషధ గుణాలు కలిగిన విత్తనాలు సేకరించడం అవసరమని, అలాగే పక్షులు గూళ్ళు పెట్టే చెట్ల విత్తనాలు సేకరించుదామని అన్నారు. ఈ సమావేశంలో బాపట్ల డిఎఫ్ఒ రవిశంకర్, ప్రకాశం జిల్లా డిఎఫ్ఒ వినోద్ కుమార్, గుంటూరు జిల్లా డిఎఫ్ఒ హిమ శైలజ పాల్గొన్నారు.

# ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండ

## - సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన కోవూరు ఎమ్మెల్యే




**కోవూరు (నెల్లూరు), మే 23, ప్రభాతవార్త :** రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కాకుండా మానవతా దృక్పథంతో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు నెల్లూరు నగరంలోని విపిఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి కోవూ రు నియోజకవర్గంలో 24 విడతలుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశామ న్నారు..అనారోగ్య కారణాలతో బాధపడి ఆర్థిక ఇబ్బందులు కలిగిన వారికి మానవతా దృక్పథం తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటి పెద్దలాగా ఆత్మ బంధువు లాగా ముఖ్యమంత్రి సహాయనిధితో సపోర్ట్ చేయడం అభినందనీయమన్నారు..కోవూరు నియోజకవర్గంలో దాదాపు 900 మందికి దాదాపు రూ. 9 కోట్ల మేర సీఎం సహాయనిది అందజేశామన్నారు.నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారి ద్వారా 130 మందికి రూ.1.7 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అత్యవసర సహాయం అందిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు నిరు పేదలకు ఆపన్నహస్తం అందజేస్తున్నారని అన్నారు.అనారోగ్యాల బారిన పడి ఆర్థికంగా ఇబ్బందుల పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందన్నారు.పేదల పట్ల సిఎం చంద్రబాబు చేస్తున్న సహాయానికి కోవూరు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. తమకు కష్టకాలంలో ప్రభుత్వం నుండి ఈ సహాయం అందేలా కృషి చేసినందుకు వేమిరెడ్డి దంపతులకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 25న తాలీం-ఎ-హునూర్ ఫలితాలు

**విజయవాడ, మే 23, ప్రభాతవార్త :**ముస్లిం విద్యార్ధులకు కార్పోరేట్ కళాశాలల్లో వసతితో పాటు, ఇంటర్ మీడియట్ విద్యను ఉచితంగా అందించేందుకు ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తాలీం-ఎ-హునూర్ టాలెంట్ టెస్ట్ ఫలితాలను ఈనెల 25వతేదీ రాష్ట్రమైనార్టీశాఖా మంత్రి ఎన్.యం.డి.ఫరూఖ్ చేతులమీదుగా విడుదల చేయనున్నట్లు వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. టాలెంట్ టెస్ట్ ప్రాథమికి కీని ఇప్పటికే సంబందిత వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు చెప్పారు. పరీక్షను అత్యంత పారదర్శకత, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య రాష్ట్రవ్యాప్తంగా 27కేంద్రాల్లో నిర్వహించామని వివరించారు. విద్యార్ధుల ఎంపిక పూర్తిగా మెరిట్ ఆధారంగానే జరుగు తుందని, ఫలితాలు విడుదలయిన అనంతరం తదుపరి ప్రక్రియకు సంబందించిన పూర్తి వివరాలను తెలియచేస్తామని అజీజ్ చెప్పారు.



రీసర్వేను పరిశీలిస్తున్న కూర్మనాధ్

# రీసర్వేతో భూముల సమస్యలకు పరిష్కారం :

### ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాధ్

**హనుమాన్‌జంక్షన్(కృష్ణా), మే 23, ప్రభాతవార్త :** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వే కార్యక్రమం సక్రమంగా అమలు చేస్తే భూముల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్రసర్వే సెటిల్ మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాధ్ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వేలేరు, మల్లవల్లి, వీరవల్లి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి క్షేత్రస్థాయిలో రీసర్వే పనులను పరిశీలించారు. ఈసందర్భంగా గ్రౌండు ట్రూతింగ్, సర్వేయర్ లాగిన్‌లో జరుగుతున్న డేటా ఎం ట్రీలను డైరెక్టర్ పరిశీలించారు. మల్లవల్లి గ్రామంలో రైతుల సమక్షంలో సర్వే సిబ్బంది భూకమతాలను సర్వేచేసి డేటాను సేకరించారు. ఈసందర్భంగా సర్వేసిబ్బందితోనూ, రైతులతోనూ ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూరికార్డుల ప్రక్షాళన, రైతులకు ఖచ్చితమైన భూహక్కులు కల్పించటమే లక్ష్యంగా రాత్రింబవళ్ళు శ్రమిస్తున్న సర్వేసిబ్బందిని అభినందించారు. రీసర్వేలో రైతుల సందేహాలను అక్కడికక్కడే నివృత్తిచేయాలని కూర్మనాధ్ ఆదేశించారు. ఈకార్యక్రమంలో మల్టీజోన్-1 ఆర్జేడి కుమార్, ఏడి లక్ష్మణరావు, తాహసీల్దార్ బి.మురళీకృష్ణ, తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

# అబద్ధం.. అరాచకం.. జగన్ సిద్ధాంతం

### రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**గాజువాక,మే 23,ప్రభాతవార్త** అబద్ధాలే ఆయుధంగా, అరాచకాలే రాజకీయంగా జగన్ మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిపై ప్రజల్లో వస్తున్న సానుకూల స్పందనను మళ్లించేందుకే జగన్ మూడు నెలలకోసారి ప్రెస్‌మీట్లు పెడుతున్నారని మండిపడ్డారు. గడిచిన మూడు నెలల్లోనే రాష్ట్రానికి క్యారియర్, రాయల్ ఎన్‌ఫీల్డ్, ఎ ఎం సి ఎ వంటి ప్రతిష్ఠాత్మక పెట్టుబడులు వచ్చాయని, జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని గుర్తుచేశారు. రాయలసీమకు రూ. లక్ష కోట్లతో ఉద్యానవన హబ్ ప్రకటించామన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో దూసుకుపోతుంటే ఓర్వలేక జగన్ అసత్య ప్రచారాలు చేసి బెంగళూరుకు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల ఫ్యాక్షన్, శవ రాజకీయాలకు ప్రజలు ఇచ్చిన తీర్పే 11 సీట్లని పల్లా పేర్కొన్నారు.బాబాయి వివేకా హత్య కేసుపై జగన్ వైఖరిలో తడబాటు స్పష్టంగా కనిపిస్తోందని,

నిజం బయట పడుతుందనే భయమే దీనికి కారణమని విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తోంది రాజారెడ్డి రాజ్యాంగం కాదని, అంబేడ్కర్ రాజ్యాంగమని స్పష్టం చేశారు.

24-5Pg7exHMNWJQE 11_24-5Pg7exHMNWJQE.qxd 23/May/26 11:39 PM Page 1



# 27 కాదు,, 28న బక్రీద్
## తెలుగు రాష్ట్రాల్లో మారిన పండుగ తేదీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే23:** తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్(ఈద్ అల్‌అధా) పండుగ తేదీ మారింది. దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఆలస్యం కావడంతో మే 28న బక్రీద్ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయి. దీంతో ఆ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సహా విద్యాసంస్థలు, బ్యాంకులకు సెలవు ఉండనుంది. అయితే.. చంద్రుని దర్శనం ఆధారంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో మాత్రం ఈ నెల 27న(బుధవారం) ఈ పండుగను జరుపుకోనున్నారు. తొలుత ప్రకటించిన దాని ప్రకారం.. మే 27న ఉండగా, దానిని మే 28(గురువారం) నాటికి మారుస్తూ ఇరు తెలుగు రాష్ట్రాలు అధికారిక ఉత్తర్వులు జారీచేశాయి. వాస్తవానికి ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పండుగ బక్రీద్.. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన దుల్‌హిజ్జా 10వ రోజు వస్తుంది. ఆ ప్రకారం ముస్లిం పండుగలు చంద్రదర్శనంపై ఆధారపడి ఉంటాయి. అయితే.. ఈసారి దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఒకరోజు ఆలస్యం కావడంతో పండుగ తేదీ మారినట్టు మతపెద్దలు ప్రకటించారు. మైనారిటీ సంక్షేమ శాఖల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సిఫార్సులను పరిశీలించిన ప్రభుత్వం పండుగ సెలవును 28కి మార్చింది. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ 1881 ప్రకారం మే 28న సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. మరోవైపు.. మే 28న సెలవు ఉంటుందని ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు ప్రభుత్వం రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీచేసింది.

## డల్లాస్ టెక్నాలజీ సెంటర్‌కు అదనపు స్థలం కేటాయింపు

**విజయవాడ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖపట్నం జిల్లా మధురవాడ హిల్ నం-2 లోని నాన్ ఐటీ సెజ్ పరిధిలో డల్లాస్ టెక్నాలజీ సెంటర్‌కు అదనంగా కేటాయించిన 227088 చదరపు మీటర్ల స్థలాన్ని స్వాధీనం చేయడానికి ఏపీఐఐసీకి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ వీసీఎండీ, విశాఖజిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా విశాఖపట్నం ఐటీ హిల్ నం-2 లో నిర్మించిన సుమారు 2.15 లక్షల చదరపు అడుగుల ఐటీ స్పేస్ వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలో రూ.74.79 కోట్ల పెట్టుబడితో రోజుకు 60000 లీటర్ల సామర్థ్యం గల ఐస్ క్రీమ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు హంగ్యో ఐస్‌క్రీమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎర్లీబర్డ్ నిబంధన కింద ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా యడ్లపాడు మండలంలో రూ.51.65 కోట్లతో ఐటీసీ లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్న స్పైసెస్ ప్రాసెసింగ్ ప్లాంటుకు ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించింది. కాకినాడలో రూ.171.52 కోట్లతో ఏఏకే సౌత్ ఈస్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తోన్న ఎడిబుల్ ఆయిల్స్, ఫ్యాట్స్ తయారీ యూనిట్‌కు ప్రోత్సహాకాలు చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ఎర్లీబర్డ్ స్కీం కింద స్థాపనకు అనుమతి పొందే కాలపరిమితిని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 ను ప్రభుత్వం సవరించింది.



# టిటిడికి రూ.30 లక్షలు విరాళం

**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు శనివారం 30 లక్షలు విరాళంగా అందింది. తిరుపతికి చెందిన కోరా సౌమ్య 10,00,116, బిరుదాల సతీష్ కుమార్ రెడ్డి 10,00,116, పూరాబ్ సాయి 10 లక్షలు రూపాయలు ట్రస్టుకు అందజేశారు. దాతలు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరికి విరాళం డీడీ, చెక్కులను అందజేశారు.

## కోర్టుల్లో ఎలక్ట్రానిక్ ప్రాసెస్ వినియోగానికి నిబంధనలు ఖరారు

**విజయవాడ మే 23 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో 2024 జులైలో అమల్లోకి వచ్చిన మూడు నూతన చట్టాలకు అనుగుణంగా న్యాయస్థానాల విచారణ ప్రక్రియలో సాంకేతికతను వినియోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఎలక్ట్రానిక్ ప్రాసెస్సెస్ రూల్స్-2025ని నోటిఫై చేసింది . హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం దీనిపై జీవో జారీచేశారు.తద్వారా సమన్లు, వారంట్లు, వాటి అమలుకు సాంకేతికతను వినియోగించి ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఆదేశాలు జారీచేయొచ్చు. కోర్టు ద్వారా సమన్లు అందజేయడం సాధ్యంకాని పక్షంలో పోలీసులు సిబ్బందితో సదరు వ్యక్తి అధికారిక మెయిల్‌కు, ఇతర విధానాల ద్వారా డిజిటల్ సమన్లు పంపొచ్చు.

# విజయవాడలో 25న ఎంఎస్‌ఎంఇ గ్రోత్ సమ్మిట్ - 2026
### - రాష్ట్రంలో 38 ఎంఎస్‌ఎంఇ పార్కులకు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో ఈ నెల 25 తేదీనఎంఎస్‌ఎంఈ గ్రోత్ సమిట్ 2026 నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదస్సుకు హాజరై రాష్ట్రంలో 38 ఎంఎస్‌ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేయనున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంఎస్‌ఎంఈల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ సహా పలువురు మంత్రులు పారిశ్రామిక వేత్తలు సదస్సు లో పాల్గొననున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,500 మందికి పైగా ఎంఎస్‌ఎంఈ రంగానికి చెందిన పారిశ్రామికవేత్తలు, పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు, విధానకర్తలు, ఆర్థిక సంస్థలు సాంకేతిక నిపుణులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ నియోజక వర్గంలో 175 ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటు చేసే లక్ష్యం లో భాగంగా మూడో విడతలో ఈ 38 ఎంఎస్‌ఎంఈ పార్కులకు వర్చువల్ గా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే మొదటి రెండు దశల్లో 100 పారిశ్రామిక పార్కులకు శంకు స్థాపన తో పాటు కొన్ని ప్రారంభం అయ్యాయి. వీటిలో 761 యూనిట్లకు కేటాయింపులు జరిగాయి. ఈ పారిశ్రామిక యూనిట్ల ద్వారా రూ.1479 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. దాదాపు 24 వేల మంది కి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో కుప్పం, మంగళగిరి, పిఠాపురంలో గ్రామీణ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్ ఎక్స్‌టెన్షన్ కేంద్రాలను సీఎం ప్రారంభించనున్నారు. రూ.200 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 45 పారిశ్రామిక క్లస్టర్లలో ఉమ్మడి సౌకర్యాల కేంద్రాల ఏర్పాటుకు నిధులను కూడా ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ సమ్మిట్ లో యువతకు, మహిళలకు అవగాహన కల్పించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చేలా, అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ప్రణాళిక చేసిన ఈ ఎంఎస్‌ఎంఈ గ్రోత్ సమిట్ 2026ఖి రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ఒక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో కుప్పం, మంగళగిరి, పిఠాపురంలో గ్రామీణ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్ ఎక్స్‌టెన్షన్ కేంద్రాలను సీఎం ప్రారంభించనున్నారు. రూ.200 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 45 పారిశ్రామిక క్లస్టర్లలో ఉమ్మడి సౌకర్యాల కేంద్రాల ఏర్పాటుకు నిధులను కూడా ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ సమ్మిట్ లో యువతకు, మహిళలకు అవగాహన కల్పించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చేలా, అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ప్రణాళిక చేసిన ఈ ఎంఎస్‌ఎంఈ గ్రోత్ సమిట్ 2026ఖి రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ఒక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది.ప్రతి ఇంటికి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి లక్ష్యం మేరకు ఎంఎస్‌ఎంఈ పని చేస్తుందని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన విజయవాడ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కళావేదికల ఓజరిగే ఎంఎస్‌ఎంఈ గ్రోత్ సమ్మిట్ కార్యక్రమ ఏర్పాట్లను శనివారం మంత్రి పలు శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఎంఎస్‌ఎంఈ ద్వారా ఎన్నో వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ క్రమంలోనే సోమవారం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రోత్ సమ్మిట్‌ను అన్ని శాఖల అధికారులు విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. ఎంఎస్‌ఎంఈ ఔత్సాహికులకు ఈ కార్యక్రమంలో ఎలా సమీకృతం చేస్తూ ముందుకు తీసుకువెళ్లాలనే అంశంపై మంత్రి చర్చించారు. గ్రోత్ సమ్మిట్ విషయంలో తీసుకోవాల్సి పలు జాగ్రత్తలను మంత్రి అధికారులకు సూచించారు. ట్రాఫిక్, పార్కింగ్, సీఎం షెడ్యూల్ గురించి సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ పరిశ్రమల శాఖ సెక్రటరీ డాక్టర్ యువరాజ్, వీసీ ఎండీ ఏపీఐఐసీ దినేష్‌కుమార్, ఏపీఎంఎస్‌ఎంఈ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ, విజయవాడ ఆర్డీవో, ఐ పీఆర్ శాఖ, పోలీస్ శాఖ నుంచి ఏడీసీపీ మురళీకృష్ణ , డీఎస్పీ మానస, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న రాజకీయ కక్షలు

**సూర్యాపేట మండలం యర్కారంలో బిఆర్‌ఎస్ నేత మధు దారుణ హత్య**

**గోనెసంచిలో కట్టి కల్వర్టు వద్ద పడేసిన మృతదేహం**

**ఓ హత్య కేసులో కీలక సాక్షిగా మధు**


చింతలపాటి మధు (ఫైల్)

**సూర్యాపేట బ్యూరో, ప్రభాతవార్త :** సూర్యాపేట మండలం యర్కారంలో మరోసారి రాజకీయ కక్షలు భగ్గుమన్నాయి. బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, యర్కారం మాజీ సర్పంచ్ మోనిక భర్త చింతలపాటి మధు (42) దారుణ హత్యకు గురికావడం జిల్లాలో సంచలనంగా మారింది. పాత ఫ్యాక్షన్ విభేదాలు, రాజకీయ కక్షలే ఈ హత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో మధు సూర్యాపేటలోని తన నివాసం నుంచి పని నిమిత్తం బయటకు వెళ్లాడు. అనంతరం అతను ఫోన్ ఎత్తకపోవడంతో భార్య మోనిక పలుమార్లు సంప్రదించే ప్రయత్నం చేసింది. ఫోన్ అందుబాటులో లేకపోవడంతో ఆమె రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించగా, ఘటన పట్టణ పరిధికి సంబంధించినదిగా భావించిన పోలీసులు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.మోనిక టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో వారు వెంటనే రంగంలోకి దిగి ఫోన్ సిగ్నల్ ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు.

ఇదిలా ఉండగా మధు శుక్రవారం సాయంత్రం వరకు పార్టీ కార్యాలయం వద్ద ఉన్నట్లు సమాచారం. అనంతరం సాయంత్రం 6:00 గంటల సమయంలో అతని స్నేహితుడు చింతా సైదులు ఫోన్‌చేసి తాళ్లగడ్డలో తాటిపాముల జానయ్య ఇంటికి రావాలని, కలిసి మద్యం సేవిద్దామని పిలిచినట్లు తెలిసింది. దీంతో మధు అక్కడికి వెళ్లగా, ఇద్దరూ కలిసి మద్యం సేవించినట్లు సమాచారం. కొద్దిసేపటి తర్వాత అక్కడికి చేరుకున్న ప్రత్యర్థులు పదునైన ఆయుధాలతో మధుపై కిరాతకంగా దాడిచేసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో కట్టి సూర్యాపేట-జనగాం రోడ్డులో యర్కారం గ్రామ శివారులోని కల్వర్ట్ వద్ద పడేసినట్లు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి తర్వాత పోలీసులు గాలింపు చర్యల్లో భాగంగా కల్వర్ట్ సమీపంలో గోనె సంచిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. శనివారం రాత్రి రెండు గంటల సమయంలో పోలీసులు మధు భార్య మోనికకు సమాచారం అందించి సంఘటనా స్థలానికి తీసుకెళ్లారు. అక్కడ మృతదేహాన్ని చూసిన మోనిక అది తన భర్త మధుదేనని గుర్తించింది. అనంతరం పోలీసులు మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు. మార్చురీలో ఉన్న మధు మృతదేహాన్ని జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ, మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకల్ల జగదీశ్ రెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున సందర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. మృతుడు మధు గతంలో చనిపోయిన ఒంటెద్దు వెంకన్న హత్య కేసులో ప్రధాన సాక్షిగా ఉన్నాడు.

### మధు హత్య కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం
### మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

చింతలపాటి మధు హత్య ఘటనపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మధు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లా డారు. మధు హత్య పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని, ఈ ఘటనలో పోలీసుల పాత్రపై కూడా అనుమానాలు ఉన్నాయని ఆరో పించారు.

### మధు హత్య కేసును సీరియస్‌గా తీసుకున్నాం : జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామానికి చెందిన చింతలపాటి మధు మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో జిల్లా ఎస్పీ కె. నరసింహ సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, మధు కనిపించడం లేదని ఆయన భార్య మోనిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వెంటనే కేసు నమోదు చేసి డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టామని తెలిపారు.యల్కారం స్టేజి సమీపంలోని కల్వర్టు కింద గోనెసంచిలో మృతదేహాన్ని గుర్తించి, కుటుంబ సభ్యులతో ధృవీకరించిన అనంతరం హత్య కేసుగా నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కేసును అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఇప్పటికే ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు కొనసాగిస్తున్నామని వెల్లడించారు.

# తెలంగాణ యాదగిరిగుట్ట అభివృద్ధికి రూ. 100 కోట్లు

### వేద పాఠశాల, దీక్షాపాల మండపం నిర్మాణాలకు శ్రీకారం
### కంచి కామకోటి పీఠాధిపతి సమక్షంలో వైభవంగా పూజలు
### హైఅలర్ట్, భారీ పోలీస్ బందోబస్తు

**యాదాద్రి భువనగిరి బ్యూరో, యాదగిరిగుట్ట, మే 23 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో అట్టహాసంగా నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వేద పాఠశాల, దీక్షాపాల మండపం, వాయువ్య దిశలో షెడ్లు, మెట్ల మార్గం పైకప్పు నిర్మాణం తదితర పనులకు సంబంధించి జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వైభవం, అధికారిక హంగులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సిఎం రాక నేపథ్యంలో యాదగిరిగుట్ట మొత్తం ఉదయం నుంచే పోలీస్ ఆధీనంలోకి వెళ్లింది. ఉదయం 6.30 గంటల నుంచే భారీ సంఖ్యలో భద్రతా సిబ్బంది వైకుంఠద్వారం, పాత బస్టాండ్, తులసి కాటేజీ, కొండపైన టెంపుల్‌సిటీ, కొత్త బస్టాండ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాలను తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే యాదగిరి గుట్టలో హైఅలర్ట్ ప్రకటించి ప్రతి వాహనం, ప్రతివ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఎం హెలి కాప్టర్ కొండపై హెలిప్యాడ్ వద్ద దిగుతారని భావించిన అధికారులు, భద్రతా సిబ్బంది ముందస్తు ఏర్పాట్లు చేశారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి నేరుగా టెంపుల్‌సిటీకి చేరుకోవడంతో అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. కొండపై ఉన్న అధికారులు హుటాహుటిన టెంపుల్ సిటీకి చేరుకుని సిఎంకు ఘనస్వాగతం పలికారు. కొద్దిసేపు హెలిపాడ్ వద్దనే నిరీక్షించిన సిఎం అనంతరం భూమిపూజ జరిగే ప్రాంతానికి చేరుకున్నారు. భూమిపూజ కార్యక్రమం కోసం దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. 200 మంది కూర్చునేలా భారీ షెడ్డును నిర్మించి, వీఐపీలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయ కులు, భక్తులు, సామాన్య ప్రజల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు.

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, కూర్చునే సదుపాయాలు, వైద్యసహాయం తదితర ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే వేదపండితులు చతుర్వేద పారాయణాలతో ఆధ్యాత్మిక వాతా వరణాన్ని సృష్టించారు. వేదఘోషల మధ్య సిఎం రేవంత్‌రెడ్డి కార్య క్రమ ప్రాంగణానికి చేరుకోగా భక్తులు, ప్రజాప్రతినిధులు హర్షధ్వా నాలతో స్వాగతం పలికారు. ఉదయం 9 గంటల 37 నిమిషాలకు కర్కాటక లగ్న పుష్కరాంశ సుముహూర్తంలో భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, డిప్యూటీ ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపిలు వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిఎంఒ కార్యదర్శి శ్రీనివాసరాజు, దేవదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ కమిషనర్ ఎం.హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంశ్‌యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఉన్నతాధి కారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. భూమిపూజ కార్యక్రమానికి విజయేంద్ర సరస్వతి స్వామీజీ ప్రత్యేకంగా హాజరై వేదమంత్రో చ్చారణల నడుమ పూజలు నిర్వహించారు. కంచి కామకోటి పీఠానికి చెందిన 200 మంది విద్యార్థులు వేదపారా యణాలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను తీసుకు వచ్చారు. గణపతి పూజ, కలశ స్థాపన, శంకుస్థాపన, నవగ్రహ పూజలు మంగళవాయిద్యాల నడుమ గంటన్నరపాటు వైభవం గా సాగాయి. సిఎం రాకకు ముందుగానే భూమిపూజ జరిగే ప్రాంతంలో రెండు అడుగుల లోతువరకు తవ్వకాలు పూర్తిచేసి పూజాకార్యక్రమాలకు సిద్ధం చేశారు. అనంతరం చేపట్టనున్న నాలుగు ప్రధాన నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేక శిలాఫలకాలను ఏర్పాటుచేశారు.

వాటికి విజయేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా తిలకందిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. యాదగిరిగుట్టను దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు పేర్కొన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలుచేయడంతో కొంతసేపు భక్తులకు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, పోలీస్ శాఖ సమన్వయంతో పరిస్థితిని అదుపులో ఉంచింది.

మొత్తం కార్యక్రమం ఆధ్యాత్మిక, రాజకీయ, అధికారిక హంగులతో ఘనంగా ముగిసింది.


శనివారం యాదగిరిగుట్టలో వేదపాఠశాలకు శంకుస్థాపన దృశ్యం, చిత్రంలో కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీస్వామి, తెలంగాణ సిఎం రేవంత్, మంత్రులు కోమటిరెడ్డి, కొండా సురేఖ

## యాదాద్రిలో హెలిపాడ్ గందరగోళంతో
# అధికార యంత్రాంగం పరుగులు

### కొండ కింద వేచిచూసిన అధికారులు
### గుట్టపై దిగిన సిఎం హెలికాప్టర్

**యాదాద్రి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న సమన్వయలోపం జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి పర్యటన కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినప్పటికీ, హెలిపాడ్ విషయంలో స్పష్టమైన సమాచారం అధికారులకు అందకపోవడంతో యాదాద్రిలో కొంతసేపు హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ఎక్కడ దిగుతుందనే విషయంలో చివరి నిమిషంలో ఏర్పడిన గందరగోళం అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిం చింది. ముందస్తు ఏర్పాట్లు భారీగా.. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం రెండు రోజుల ముందుగానే విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. కొండ కింద ఉన్న హెలిపాడ్ వద్ద భద్రతా తనిఖీలు నిర్వహించి, సీఎం కాన్వాయ్ కోసం ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో వందలాది మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థానం అధికారులు, రెవెన్యూ, పోలీసు, ఆర్టీసీ, విద్యుత్, వైద్య శాఖల అధికారులు అప్రమత్తంగా విధుల్లో నిమగ్నమయ్యారు. సీఎం రాక సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికార పార్టీ నాయకులు కూడా కొండ కింద హెలిపాడ్ వద్దకు చేరుకుని స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. ప్రోటోకాల్ ప్రకారం సీఎం హెలికాప్టర్ అక్కడ దిగుతుందని అందరికీ సమాచారం అందడంతో అన్ని ఏర్పాట్లు అదే కేంద్రంగా జరిగాయి.

### ఒక్కసారిగా మారిన పరిస్థితి..

అయితే నిర్ణీత సమయానికి యాదాద్రికి చేరుకున్న సీఎం హెలికాప్టర్ కొండ కింద కాకుండా టెంపుల్ సిటీపై ఉన్న హెలిపాడ్ వైపు మళ్లింది. కొద్ది సేపటికే అక్కడ ల్యాండ్ కావడంతో అధికారులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. సీఎం హెలికాప్టర్ దిశ మారిందనే సమాచారం మొదట భద్రతా సిబ్బందికి కూడా స్పష్టంగా అందలేదని తెలిసింది. హెలికాప్టర్ పైభాగంలో దిగిందన్న విషయం తెలిసిన వెంటనే కొండ కింద ఉన్న అధికారులు పరస్పరం ఫోన్లు చేసుకుంటూ అసలు పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. కొంతసేపు సీఎం ఎక్కడ దిగారు..? అన్న సందిగ్ధ పరిస్థితి నెలకొంది. కొందరు అధికారులు హెలికాప్టర్ తిరిగి కిందకు వస్తుందని భావించగా, మరికొందరు పైభాగానికి వెళ్లేందుకు హుటాహుటిన ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

### హెలికాప్టర్‌లోనే సిఎం వేచి..

టెంపుల్ సిటీ హెలిపాడ్ వద్ద సీఎంకు స్వాగతం పలికేందుకు ఎవరూ సిద్ధంగా లేకపోవడం పరిస్థితిని మరింత ఇబ్బందికరంగా మార్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన వెంట వచ్చిన మంత్రులు, ఉన్నతాధికారులు దాదాపు పది నిమిషాలకు పైగా హెలికాప్టర్‌లోనే వేచి ఉండాల్సి వచ్చినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న వెంటనే అధికారులు టెంపుల్ సిటీ వైపు పరుగులు తీశారు. కొండ కింద ఉన్న కాన్వాయ్ వాహనాలు, భద్రతా బలగాలు వేగంగా పైభాగానికి చేరుకున్నాయి. తర్వాత సీఎంకు అధికారిక స్వాగతం పలికి ఆలయ కార్యక్రమాలను ప్రారంభించారు.

# ఓటర్లను అక్రమంగా తొలగిస్తే అడ్డుకొంటాం

### కేబినెట్ విస్తరణలో నా జోక్యం ఉండదు
### సిఎంతో నేను కలిసి పనిచేయడం కొందరికి ఇష్టం లేదు
### మీడియాతో 'ఇష్టాగోష్టి'లో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో ఓటర్లను అక్రమంగా తొల గించడానికి ఏదైనా కుట్రలు చేస్తే అడ్డు కొంటామని ప్రతి వయోజనుడికి ఓటు హక్కును కలిగి ఉండేలా చూసేందుకు కాంగ్రెస్ కార్యకర్తను క్షేత్రస్థాయిలో అప్రమత్తతో ఉంటారని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ అన్నారు.

గాంధీభవన్‌లో శని వారం విలేఖరులతో ఇష్టాగోష్టిగా ఆయన మాట్లా డుతూ పశ్చిమ బెంగాల్‌లో 31లక్షల ఓట్లు చేర్చి 93 లక్షల ఓట్లు తొలగించారనీ ఇటీవల ఆ రాష్ట్రంలో 30లక్షల ఓట్ల తేడాతో మమతబెనర్జీ పార్టీ ఓడిందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ దేశానికే దిక్సూచిగా మారుతుందనీ బిఆర్‌ఎస్‌కు దూరదృష్టి లేదనీ ఆరోపించారు.

హైదరాబాద్ పరిధిని పెంచ లేదు సీటీ విస్తరిస్తే అభివృద్ధి జరుగుతుందనీ అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి అవసరం లేదని హరీశ్‌రావు అంటున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణపై కేంద్రం సవితితల్లి ప్రేమ చూపి స్తోందనీ స్టాలిన్ లాగే మేము గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ల పేర్లను ఎఐసిసికి పంపించాం త్వరలోనే వర్కింగ్ ప్రెసిడెంట్లను ప్రకటిస్తామని తెలిపారు. కేబినెట్ విస్తరణ సీఎం చూసుకుం టారని విస్తరణలో నా జోక్యం ఏముండదనీ తెలిపారు. పిసిసి అధ్యక్షుడి మార్పు విషయంలో అధిష్ఠానానిదే తుది నిర్ణయం నేను సరైన వ్యక్తిని అనే నాకు పదవి ఇచ్చారనీ తెలి పారు. ఎఐసిసి దృష్టిలో నేను బెస్ట్, కెసి వేణుగోపాల్ నన్ను అనేకసార్లు అభినందిం చారని గుర్తించారు. నేను, సిఎం కలిసి పనిచేయడం కొందరికి మింగు డుపడడం లేదనీ ఆయన ఆవేదన చెందారు. నా పనితీరుని బేరీజు వేయాల్సింది మా ముఖ్య మంత్రి, నా కార్యకర్తలు అని అన్నారు.

## 28 నుండి చర్లపల్లి-తిరుపతి మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు
### రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన దక్షిణ మధ్యరైల్వే

**హైదరాబాద్ మే 23, ప్రభాతవార్త :** హైదరాబాద్ నుంచి తిరుమల శ్రీవెంకటేశ్వ రస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. చర్లపల్లి-తిరుపతి మధ్య రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కొత్తగా ప్రారంభిస్తున్నట్లు దక్షి ణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ కొత్త రైలు నల్గొండ-కడప మార్గంలో ప్రయాణిస్తుందని తెలిపింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారికి తిరుపతి చేరుకోవడం సులభమ వుతుంది. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి తిరుపతికి పద్మావతి ఎక్స్‌ప్రెస్ వరంగల్-విజయవాడ మార్గంలో, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మహబూబ్‌నగర్-గుత్తి మార్గంలో, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, వందే భారత్ రైళ్లు నల్గొండ-గుంటూరు మార్గంలో నడుస్తున్నాయి. ఇప్పుడు ప్రవేశపెట్టిన కొత్తరైలు ప్రత్యామ్నాయ మార్గంలో అందుబాటులోకి రానుండటం గమనార్హం. ఈ సర్వీస్ ఈ నెల 28న ప్రారంభం కా నుంది. ఇప్పటివరకు చర్లపల్లి-తిరుపతి మార్గంలో ప్రత్యేక రైలుగా నడిచిన సర్వీసును ఇకనుంచి రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా కొన సాగిస్తారు. తిరుపతి నుంచి గురువారం సాయంత్రం నాలుగున్నర గంటలకు బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, నంద్యాల, గిద్ద లూరు, మార్కాపురం రోడ్, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా మరుసటిరోజు ఉదయం 8.25 గంటలకు చర్లపల్లికి చేరుకుం టుంది.

## చంచల్‌గూడ జైలుకు డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఎసిబికి పట్టుబడ్డ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (అర్బన్ లాండ్ సీలింగ్) మర్రి వంశీమోహన్‌ను శనివారం ఉదయం రిమాండుకు తరలించారు. శుక్రవారం నాడు వంశీమోహన్ ను అక్రమాస్తుల కేసులో ఎసిబి అరెస్టు చేయడం తెలిసిందే. రాత్రి బాగా పొద్దుపోయే వరకు కొనసాగిన సోదాల్లో ఆరు కోట్ల 22 లక్షల రూపా యలకు పైగా ఆస్తులు వెలుగు చూడడం విదితమే. బహిరంగ మార్కెట్లో దీని విలువ 200 కోట్ల రూపాయల వరకు వుంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో శనివారం ఉదయం వంశీమోహన్‌ను ఎసిబి అధికారులు నాంపల్లి ఎసిబి కోర్టుల న్యాయమూర్తి ఇంట్లో హాజరు పర చగా నిందితుడికి రెండు వారాల రిమాండు విధించారు.

24-05pg 12 VJA_24-05pg10.qxd 23/May/26 11:56 PM Page 1



# వినేశ్ కుస్తీకి గ్రీన్ సిగ్నల్

## ఢిల్లీ హైకోర్టులో ఊరట




**న్యూఢిల్లీ:** భారత రెజ్లింగ్ సమాఖ్యతో కుస్తీపట్లలో వినేశ్ ఫోగట్ విజయం సాధించింది. ఢిల్లీ హైకోర్టులో ఆమెకు ఊరట లభించింది. ఆసియా క్రీడల సెలెక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు న్యాయస్థానం రూట్ క్లియర్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాలతో కూడిన ద్విసభ్య బెంచ్.. వినేశ్‌ను ఆసియా క్రీడల ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతించింది. కుస్తీ గోదాలోకి తిరిగి రీఎంట్రీ ఇవ్వాలనుకున్న వినేశ్ ఫోగట్... యూపీలోని గోండాలో జరిగిన జాతీయ ఓపెన్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు రెడీ అయింది. పోటీల కోసం యూపీకి సైతం వెళ్లింది. అయితే రెజ్లింగ్ సమాఖ్య వినేష్‌ను అడ్డుకుంది. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో డిస్క్వాలిఫై అయిన వినేష్... రెజ్లింగ్ సమాఖ్య విధివిధానాలను పాటించలేదని నేపాన్ని నెగ్గి ఆమెపై వేటు వేసింది. దీని వెనక రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ ఉన్నాడని ఆరోపించిన వినేశ్‌కు మద్దతుగా పలువురు మాజీ రెజ్లర్లు నిలిచారు.

**రెజ్లింగ్ సమాఖ్యకు చెంపదెబ్బ**

రెజ్లింగ్ సమాఖ్య తీరుపై ఢిల్లీ హైకోర్టును వినేశ్ ఫోగట్ ఆశ్రయించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాలతో కూడిన ద్విసభ్య బెంచ్ ముందు వాదనలు జరిగాయి. తల్లైన రెజ్లర్ల విషయంలో డబ్ల్యూఎఫ్ఐ నిబంధనలు అనుచితంగా ఉన్నాయని పేర్కొన్న ధర్మాసనం వినేశ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ తీర్పునిచ్చింది. ఎంపిక ప్రక్రియను వీడియో రికార్డు చేయాలని రెజ్లింగ్ సమాఖ్యను కోర్టు ఆదేశించింది. భారత స్పోర్ట్స్ అథారిటీ, భారత ఒలంపిక్ సంఘానికి చెందిన స్వతంత్ర ప్రతినిధులు ట్రయల్స్‌ను పర్యవేక్షి ంచాలని పేర్కొంది. మే 30, 31 తేదీల్లో ఆసియా క్రీడల సెలెక్షన్ ట్రయల్స్ జరుగనున్నాయి. ఆసియా క్రీడలతో పునరాగమనం చేయాలనుకున్న వినేశ్ ఫోగాట్ కల నిజమవ్వనుంది.

**ఫోగట్ కుస్తీమే సవాల్**

మహిళా రెజ్లింగ్‌కు పేరు తెచ్చిన వినేశ్ ఫోగట్...రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ మెడలిస్ట్. ఆసియా క్రీడల్లో స్వర్ణం, సిల్వర్ మెడల్స్.. కామన్‌వెల్త్ క్రీడల్లో మూడు స్వర్ణాలు, ఏషియన్ ఛాంపియన్ షిప్‌లో మెడల్స్‌తో మెరిశారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఏకంగా ఫైనల్ చేరింది. అయితే ఫైనల్‌కు ముందు నిర్వహించిన వెయిట్‌లో వంద గ్రాములు ఎక్కువగా ఉందని వినేశ్ ఫోగట్‌పై అనర్హత వేటు పడింది. దీన్ని ఛాలెంజ్ చేసిన ఫోగట్... అదే ఏడాది అగస్టులో రెజ్లింగ్‌కు గుడ్‌బై చెప్పింది. రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి 2024లో హర్యానాలోని జులానా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో డబ్ల్యుఎఫ్ఐ అప్పటి అధ్యక్షుడు భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలపై మహిళారెజర్లకు మద్దతుగా ఫోగట్ నిలిచింది.

# వైభవ్‌పైనే ఫోకస్

## నాలుగో బెర్త్ కోసం ముంబైతో రాజస్థాన్ కీలక పోరు



*ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నేడు రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. వాంఖడే స్టేడియం వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ తలపడనుండగా.. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగే రెండో మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడతాయి. ప్లే ఆఫ్‌లోని నాలుగో బెర్త్ ఎవరిదిన్నది ఈ మ్యాచ్‌లు తేల్చనున్నాయి. రాజస్థాన్, ముంబై మ్యాచ్‌తో ఇది తేలనుంది. దీంతో ఈ మ్యాచ్ తీవ్ర ఆసక్తి రేపుతున్నా... అందరి చూపు 15 ఏళ్ల కుర్రాడి పైనే.*

**ముంబై:** రాజస్థాన్ రాయల్స్ నాలుగో బెర్త్ అందుకుంటుందా? లేదా? అన్నది ముంబై ఇండియన్స్ తేల్చనుంది. ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన ముంబై... సొంతగడ్డపై రాజస్థాన్‌రాయల్స్‌తో తలపడనుంది. ఈమ్యాచ్ గెలుపు ఓటములు ముంబైకు నామమాత్రమే. అదే రాజస్థాన్‌కు వస్తే ఈ మ్యాచ్‌లో గెలిస్తే 16 పాయింట్లతో నాలుగో జట్టుగా ముందంజ వేస్తుంది. లేదంటే కోల్‌కతా నైట్‌రైడర్స్-ఢిల్లీ మ్యాచ్ డిసైడ్ చేస్తుంది.

ఐపీఎల్ మొదటి దశ లీగ్ స్టేజ్‌లో చక్కని విజయాలు అందుకున్న రాజస్థాన్ రాయల్స్ వరుసగా హ్యాట్రిక్ ఓటములతో ప్లే ఆఫ్ అవకాశాలను క్లిష్టం చేసుకుంది. తప్పక గెలవాల్సిన లక్నోను ఓడించి రేసులో నిలిచింది. లక్నో ఉంచిన 220 పరుగుల భారీ లక్ష్యాన్ని కూడా రాజస్థాన్ అలవోకగా చేధించింది. ఈ క్రెడిట్ వైభవ్ సూర్యవంశీకే దక్కుతుంది. దీంతో మరోసారి వైభవ్ గెలిపిస్తాడన్న ధీమా రాజస్థాన్ ఫ్యాన్స్‌లో ఉంది.

రాజస్థాన్ బ్యాటింగ్‌కు ప్రధాన బలం ఓపెనర్లు యశస్వీ జైస్వాల్, వైభవ్ సూర్యవంశీలే. వీరు క్రీజ్‌లో ఓ పది ఓవర్లు ఉన్నా రాయల్స్‌కు తిరుగుండదు. గత మ్యాచ్‌లో స్వభావానికి భిన్నంగా వైభవ్ క్రీజ్‌లో నిలిచేందుకు ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ ఆలోచన దొరణే బిగ్ ఇన్నింగ్స్ ఆడేందుకు ఉపయోగపడింది. ముంబైపై మ్యాచ్‌లోనూ వైభవ్ క్రీజ్‌లో నిలబడితే ముంబై బౌలర్లకు చక్కలే. ఇక యశస్వీ జైస్వాల్, ధృవ్ జురెల్ మరోసారి బ్యాటింగ్‌లో మెరవాల్సి ఉంటుంది. రియాన్ పరాగ్ చక్కని ఫామ్‌లో ఉండడం, సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అనుభవం ప్లస్ కానుంది. ఇక అర్చర్ రూపంలో ఆరంభంలోనే వికెట్లు తీయగల బౌలర్ ఉన్నాడు. అతనికి తోడు పెరీరా, సందీప్, యష్ రాజ్...ప్రత్యర్థి జట్టును కట్టడిచేయాల్సి ఉంటుంది. గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 27 పరుగుల తేడాతో నెగ్గిన రాజస్థాన్ రాయల్స్.. దాన్ని రిపీట్ చేసి ప్లే ఆఫ్‌లో ప్రవేశించడంపై ఫోకస్ పెట్టింది.

**హెడ్ టు హెడ్**

ఇరు జట్లలో ముంబై ఇండియన్స్‌దే కాస్తంత పైచేయి. 32 మ్యాచ్‌ల్లో తలపడగా ముంబై 16 మ్యాచ్‌ల్లో, రాజస్థాన్ 15 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. అయితే వాంఖడేలో తలపడ్డ గత 9 మ్యాచ్‌ల్లో అయిదింటిలో రాజస్థాన్ రాయల్స్ విజయం సాధించింది.

**రాజస్థాన్ రాయల్స్:** యశస్వీ జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, ధృవ్ జురెల్, రియాగ్ పరాగ్(కెప్టెన్), ఫెరీరా, రవీంద్ర జడేజా, రవి సింగ్, జోఫ్రా అర్చర్, యష్ రాజ్, మఫాకా, సందీప్ శర్మ, నండ్రే బర్గర్

**ముంబై ఇండియన్స్:** ర్యాన్ రికల్టన్, రోహిత్ శర్మ, నమన్ ధీర్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, విల్ జాక్స్, కార్బిన్ బాష్, దీపక్ చాహర్, జస్‌ప్రీత్ బుమ్రా, ఘజన్‌ఫర్, శార్దుల్ ఠాకూర్

# పంజాబ్ నెగ్గింది.. రాయల్స్ ఓడితేనే ఛాన్స్?

లక్నో: తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జోరు చూపింది. లక్నో సూపర్ జెయింట్స్‌ను దాని సొంతగడ్డపై ఏడు వికెట్ల తేడాతో ఓడించింది. ఈ విజయంతో పంజాబ్ పాయింట్ల సంఖ్య 15కు చేరింది. అయినా ప్లే ఆఫ్ బెర్త్ కోసం రాజస్థాన్-ముంబై మ్యాచ్ ఫలితం కోసం వెయిట్ చేయాల్సిన పరిస్థితి. రాజస్థాన్ రాయల్స్ గెలిస్తే మాత్రం పంజాబ్ ప్లే ఆఫ్‌కు ముందే నిష్క్రమిస్తుంది.

197 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌ను ఆరంభంలోనే షమీ బెంబేలెత్తించాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే ప్రియాన్ష్ ఆర్యను డకౌట్‌గా, రెండో ఓవర్లో కూపర్ కొన్నోలీ(18)ని క్లీన బౌల్డ్‌గా అవుట్‌చేశాడు. 22 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన పంజాబ్‌ను మరో ఓపెనర్ ప్రభ్ సిమ్రాన్ సింగ్(39 బంతుల్లో 69; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(51 బంతుల్లో 101 నాటౌట్; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) గెలుపు దిశగా నడిపించాడు. ఇద్దరూ లక్నో బౌలర్లపై విరుచుకు పడుతూ మూడో వికెట్‌కు 140 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించారు. ప్రభు సిమ్రాన్‌ను అర్జున్ అవుట్ చేయగా, శ్రేయాస్ చివరి వరకు క్రీజ్ లో నిలిచాడు. దీంతో పంజాబ్ 18 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి గెలుపందుకుంది.



అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన లక్నోకు పవర్‌ప్లేలోనే పంజాబ్ బౌలర్లు గట్టి షాక్ ఇచ్చారు. తొలి మ్యాచ్ ఆడుతున్న అర్షిన్ కులకర్ణి డకౌట్ కాగా, నికోలస్ పూరన్(2) మరోసారి నిరాశపరిచాడు. దీంతో 20 రన్స్‌కే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కష్టాల్లో ఉన్న జట్టును ఆయుష్ బదోనీ తన మెరుపు బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. ముఖ్యంగా మార్కో జాన్సెన్ వేసిన పవర్‌ప్లే ఆఖరి ఓవర్లో 4, 6, 6, 2, 4 లతో ఏకంగా 24 పరుగులు సాధించాడు. కేవలం 18 బంతుల్లోనే 43 రన్స్ చేసిన బదోనీని చాహల్ కంగుతినిపించాడు. మరో ఎండ్‌లో ఓపెనర్ జోస్ ఇంగ్లిస్ పంజాబ్ బౌలర్లను వణికించాడు. నలుమూలలా షాట్లు ఆడుతూ కేవలం 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. మొత్తంగా 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సులతో 72 పరుగులు చేశాడు. చివర్లో వచ్చిన ఇంపాక్ట్ ప్లేయర్ అబ్దుల్ సమద్ బౌండరీలతో విరుచుకుపడటంతో లక్నో 20 ఓవర్లలో 196 రన్స్ చేసింది.



# ఎట్టకేలకు అర్జున్ తెండూల్కర్ షో

**లక్నో:** క్రికెట్ దిగ్గజం సచిన్ తెండ్కూలర్ తనయుడు అర్జున్ తెండూల్కర్‌కు ఎట్టకేలకు ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆడడమే కాక అదరగొట్టాడు. లెఫ్టార్మ్ పేసర్ అయిన అర్జున్ పూర్తి కోటా 4 ఓవర్లు వేశాడు. 9 ఎకానమీతో 36 పరుగులిచ్చి ఓ వికెట్ పడగొట్టాడు. చివరి మ్యాచ్‌లో లక్నో తుది జట్టులోకి వచ్చిన అర్జున్ బ్యాటింగ్ లో 5 బంతులు ఎదుర్కొని 5 పరుగులు చేశాడు. ఆతర్వాత బౌలింగ్‌లో సత్తా చాటాడు. తొలి ఓవర్ మొదటి రెండు బంతులను డాట్స్ చేసిన అర్జున్... ఆ ఓవర్లో నాలుగు సింగిల్స్ మాత్రమే ఇచ్చి ఆకట్టుకున్నాడు. రెండో ఓవర్‌లో లయ తప్పి మాత్రం 15 పరుగులిచ్చినా.. మూడో ఓవర్లో జోరు మీదున్న ప్రభుసిమ్రాన్‌ను అద్భుత బంతితో ఎల్బీగా అవుట్ చేశాడు.

అర్జున్ తెండూల్కర్‌కు ఈ సీజన్‌లో ఇదే తొలి మ్యాచ్. కాగా ఇప్పటివరకు 6 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. మొత్తంగా 4 వికెట్లు తీశాడు. 2021 ఐపీఎల్ వేలంలో అర్జున్‌ను ముంబై ఇండియన్స్ 20 లక్షల బేస్ ధరకు దక్కించుకుంది. 2022లో 30 లక్షలకు ముంబై రిటేన్ చేసుకుంది. 2023 సీజన్‌లో కోల్‌కతాపై తొలి మ్యాచ్ ఆడే అవకాశం దక్కింది. సన్‌రైజర్స్‌పై తొలివికెట్ సాధించి జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. 2024 సీజన్‌లో ఒకే ఒక మ్యాచ్ ఆడాడు. 2025లో లక్నో సూపర్ జెయింట్స్‌కు మారినా ఈ సీజన్‌లో కానీ అర్జున్‌కు ఆడే అవకాశం రాలేదు.

# 75వేల మద్దతు స్థాయిని బ్రేక్ చేసిన బిట్‌కాయిన్

**న్యూఢిల్లీ, మే 23:** క్రిప్టోకరెన్సీ మార్కెట్‌లో బిట్‌కాయిన్ అత్యంత కీలకమైన 75వేల మద్దతు స్థాయిని శనివారం బ్రేక్ చేసింది. అంతర్జాతీయ క్రిప్టో మార్కెట్ మానిటరింగ్ సంస్థ ట్రేడింగ్ వ్యూ లైవ్ చార్ట్ ఆధారాల ప్రకారం బిట్‌కాయిన్ ప్రస్తుతం 74,678 వద్ద ట్రేడవుతోంది. ఇటీవలి కాలంలో సాధించిన గరిష్ఠ స్థాయిల నుంచి ఇది ఒక గమనించదగ్గ పతనంగా అంచనావేస్తున్నారు. గడచిన రోజులుగా బిట్‌కాయిన్ 77,000 నుంచి 78,000 రేంజ్‌లో గట్టి పట్టు సాధించడానికి ప్రయత్నించింది. మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు గట్టిగానే కనిపించింది. శనివారం మాత్రం భారీ పతనం చవిచూసింది. ఈ మధ్యాహ్నం తర్వాత మార్కెట్ సెంటిమెంట్ ఒక్కసారిగా మారిపోయింది. 76,500 స్థాయిల వద్ద ఉన్న సపోర్ట్‌ను బ్రేక్ చేస్తూ ధర నేరుగా 74,250 వరకు పడిపోయింది. ప్రస్తుతం అక్కడ నుంచి స్వల్పంగా కోలుకుని 74,678 వద్ద కొనసాగుతోంది. గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి మధ్య బిట్‌కాయిన్ ఒడుదొడుకులను ఎదుర్కొంటోంది. ఈ తాజా పతనానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి.



అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిణామాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు. పెద్ద పెద్ద సంస్థలు, ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల వ్యూహాలను మార్చుకోవడం. ఇటీవలి కాలంలో బిట్‌కాయిన్ దిగువ స్థాయిల నుంచి భారీగా పుంజుకోవడంతో, ట్రేడర్లు ఈ స్థాయిలో లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వంటి కారణాలను చెప్పుకొంటున్నారు. సాధారణంగా బిట్‌కాయిన్ పతనమైతే దాని ప్రభావం మొత్తం క్రిప్టో మార్కెట్‌పై పడుతుంది. లైవ్ వాచ్‌లిస్ట్ డేటా ప్రకారం బిట్‌కాయిన్ పతనం కారణంగా ఇథీరియం మైనస్ రేంజ్‌లోకి వెళ్లగా, మిగిలిన ప్రధాన ఆల్ట్‌కాయిన్స్ కూడా తీవ్ర విక్రయాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల గ్లోబల్ క్రిప్టో మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా కొంత మేర కుంచించుకుపోయింది.

ప్రస్తుత మార్కెట్ సెంటిమెంట్ కాస్త ప్రతికూలంగా ఉన్నప్పటికీ, సుదీర్ఘ కాలంలో డిజిటల్ అసెట్ గా బిట్‌కాయిన్‌కు ఉన్న క్రేజ్ కొనసాగుతుందని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. స్వల్పకాలిక ట్రేడర్లు మార్కెట్ స్థిరీకరణ కోసం వేచి చూడాలని, ఇటువంటి సమయంలో ఎలాంటి భావోద్వేగ లేదా తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, రిస్క్ మేనేజ్‌మెంట్‌ను కఠినంగా పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# మైక్రోసాఫ్ట్‌ను వీడుతున్న మెహదీ



**శాన్‌ఫ్రాన్సిస్కో, మే 23:** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో 35 ఏళ్లుగా పనిచేస్తున్న కీలక నిపుణుడు, కన్స్యూమర్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ యూసఫ్ మెహదీ తన పదవి నుంచి వైదొలుగుతున్నారు. ఉద్యోగులకు పంపిన ఒక అంతర్గత మెమోలో ఆయన తన నిర్ణయం వెల్లడించారు. మైక్రోసాఫ్ట్ చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం పని చేసిన వారిలో మెహదీ ఒకరు. వచ్చే ఏడాది జూన్ వరకు, మైక్రోసాఫ్ట్ తదుపరి ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు ఆయన కంపెనీలో కొనసాగుతారు. ఈ సమయంలో ఏఐ ఆధారిత ఏజెంట్ల కోసం విండోస్‌ను పునర్ నిర్వచించడం, మైక్రోసాఫ్ట్ 365 వృద్ధి, వన్ కోపైలట్ విజన్‌ను ముందుకు తీసుకెళ్లడంపై దృష్టి సారిస్తానని తెలిపారు. సున్నితమైన మార్పు ప్రక్రియ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంటర్న్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన మెహదీ మైక్రోసాఫ్ట్ చరిత్రలో అనేక కీలక భాగమయ్యారు. విండోస్ 95, సెర్చ్ ఇంజిన్ బింగ్, ఎక్స్‌బాక్స్ వన్, విండోస్ 10, ఇటీవలి కోపైలట్ ప్లస్ పీసీల ఆవిష్కరణలలో ఆయన కీలకపాత్ర పోషించారు. మైక్రోసాఫ్ట్‌లో 35 ఏళ్ల అసాధరణ ప్రయాణం తర్వాత నా తదుపరి సాహసయాత్రను ప్రారంభించడానికి ఇదే సరైన సమయమని నిర్ణయించుకున్నట్లు మెహదీ తన మెమోలో పేర్కొన్నారు. సీఈఓ సత్య నాదెళ్ల నేతృత్వంలో మైక్రోసాఫ్ట్ ఏఐపై భారీగా దృష్టి సారిస్తున్న తరుణంలో జరుగుతున్న నాయకత్వ మార్పులలో భాగంగానే యూసఫ్ మెహదీ నిష్క్రమణను విశ్లేషకులు చూస్తున్నారు.




## సెంట్రల్ బ్యాంకులో ఆఫర్ ఫర్ సేల్

# 8శాతం వాటా విక్రయం

**న్యూఢిల్లీ, మే 23:** లాభదాయకతలేని ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల్లో వాటాలను తగ్గించుకునేప్రక్రియను కేంద్రం వేగవంతంచేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కూడా ఆఫర్ ఫర్‌సేల్ పద్ధతిలో వాటాల్ని అమ్మేస్తుంది. శుక్రవారం రోజే నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ఇక్కడ ఇన్వెస్టర్ల నుంచి ఊహించని స్థాయిలో అదిరిపోయే రెస్పాన్స్ వస్తుండటంతో అదనంగా వాటా విక్రయించేందుకు సిద్ధమైంది. ముందుగా 4శాతం వాటానే విక్రయించాలని నిర్ణయించి మరో 4శాతం గ్రీన్ షూ ఆప్షన్ లేదా ఓవర్ సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ కింద ఉంచింది. ఇప్పుడు మంచిరెస్పాన్స్ లభించగా మిగతా 4శాతం వాటాను కూడా ఓఎఫ్ఎస్ కింద అంటే మొత్తం 8శాతం వాటాలను ఆఫర్‌ఫర్‌సేల్‌కింద విక్రయిస్తోంది. నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు షేర్లను విక్రయించేందుకు ఓఎఫ్ఎస్ ప్రక్రియ చేపట్టింది. ఇక్కడ మొత్తంగా 32.58 కోట్ల షేర్లను రిజర్వ్ చేయగా ఇలా అందుబాటులో ఉన్న షేర్లు 2 రెట్లకు మించి రెస్పాన్స్ వచ్చింది. మొత్తం 76.86 కోట్ల షేర్లకు బిడ్స్ దాఖలయ్యాయి. ముందురోజు క్లోజింగ్ ధర రూ. 33.92 తో చూస్తే చాలా తక్కువ ధరకే రూ. 31 నే ఫ్లోర్ ధరగా నిర్ణయించింది. మార్కెట్లో ఉన్న ధర కంటే కాస్త తక్కువకే షేర్లను కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. వారాంతంలో మాత్రం షేరు ధర దాదాపు 8 శాతం తగ్గి రూ. 31.22 వద్ద స్థిరపడింది. ఈనెల 25 రెగ్యులర్ ఇన్వెస్టర్లు లేదా రిటైల్ ఇన్వెస్టర్లకు ఓఎఫ్ఎస్ అందుబాటులో ఉంటుంది. సోమవారం రోజు షేర్లకు బిడ్స్ దాఖలు చేసేందుకు వీలుంటుంది. ముందుగా 4 శాతం వాటా 36.20 కోట్ల షేర్లు అందుబాటులో ఉంచగా, ఇప్పుడు మరో 4శాతం అంటే మొత్తంగా 72.41కోట్ల షేర్లను అందుబాటులోకి తెచ్చింది.

# పెట్టుబడులకు లాంగ్‌టర్మ్ ఫండ్స్ మేలు

**ముంబయి, మే 23:** పెట్టుబడులకోసం స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రియల్ ఎస్టేట్, గోల్డ్, ఆర్బీఐ సేవింగ్స్ బాండ్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉంటాయి. బ్యాంక్ ఎఫ్‌డీలు, పోస్టాఫీస్ పథకాలు వంటివి రిస్క్ లేకుండానే మంచి రిటర్న్లు ఇస్తాయి. గోల్డ్, రియల్ ఎస్టేట్ వంటివి అనిశ్చితిలో ఉంటాయి. రిటర్న్లు నిలకడగా ఉండవు. వీటికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్లు ఉన్నాయి. ఇక్కడ పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. రిస్క్ ఫ్యాక్టర్ ఎక్కువగానే ఉంటుంది. దానికి తగ్గట్లుగానే రాబడి కూడా ఆకర్షణీయంగా ఉంటుంది. ఇక్కడ చాలా వరకు లాంగ్ రన్ పెట్టుబడుల కోసమైతేనే ఇన్వెస్ట్ చేయడం మంచిది. స్వల్ప కాలంలో రిస్క్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఇప్పుడు మే నెలలో పెట్టుబడులు పెట్టేందుకు టాప్ మ్యూచువల్ ఫండ్స్ కొన్ని మార్కెట్‌కు వచ్చాయి. వీటి పెర్ఫామెన్స్ తెలుసుకునేందుకు ఇన్వెస్టర్లు మూడేళ్ల రాబడుల్ని ప్రాతిపదికగా తీసుకుంటారు.

యాక్సిస్ స్మాల్ క్యాప్ ఫండ్ 2013 నవంబరులో లాంచ్ అయింది. గత మూడేళ్ల వ్యవధిలో ఇక్కడ సగటున వార్షిక ప్రాతిపదికన 24.5 శాతం రిటర్న్లు అందించింది. 2009 డిసెంబరులో లాంఛ్ అయిన ఎస్బీఐ స్మాల్ క్యాప్ ఫండ్ సగటున వార్షిక ప్రాతిపదికన 23.4 శాతం రాబడి అందించింది. కోటక్ స్మాల్ క్యాప్ ఫండ్ చూస్తే సగటున గత మూడేళ్లలో వార్షికంగా 25.1 శాతం రాబడి ఇచ్చింది. నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ వార్షిక ప్రాతిపదికన సగటున 31.6 శాతం రాబడి అందించింది.







# టిసిఎస్ కొత్త విధానంపై ఉద్యోగుల్లో ఆందోళన

**ముంబయి, మే 23:** వరస లేఆఫ్స్‌తో టెక్ రంగంలో తీవ్రస్థాయి అనిశ్చితి నెలకొంది. ప్రస్తుతం దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీల్లో ఒకటైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నిర్ణయం ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతోంది. వేరియబెల్ పే విధానాన్ని మార్చి, ఆఫీస్ హాజరుతో లింక్ చేయడంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 6లక్షల మంది ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటి వరకు వేరియబుల్ పే రూపంలో నెలవారీగా లేదా క్వార్టర్లీ వారీగా అందుతున్న మొత్తాన్ని ఇప్పటి నుంచి మంత్లీ పర్ఫామెన్స్ పేగా మార్చారు. దీంతో ఉద్యోగులు ఆఫీస్ హాజరు, ప్రాజెక్ట్ డిప్లాయ్‌మెంట్ ఆధారంగా నిర్ణయించనున్నారు. దీని కారణంగా ఆఫీస్ తక్కువగా వచ్చే ఉద్యోగులకు టేక్‌హోమ్ సాలరీ తగ్గే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు, ఈ ఏడాది టీసీఎస్ సాధారణంగా 5 శాతం నుంచి 8 శాతం వరకు జీతాలను పెంచినట్లు సమాచారం. మంచి పనితీరు కనబరిచిన ఉద్యోగులకు ఎప్లస్ కేటగిరీలో చేర్చి, 10 శాతం నుంచి 13 శాతం వరకు పెంచినట్లు తెలుస్తోంది. తక్కువ రేటింగ్ పొందిన వారికి కేవలం 2 శాతం నుంచి 3 శాతం వరకు మాత్రమే పెరిగినట్లు తెలుస్తోంది.




## రూ.2 వాటా రూ.250కి కొనుగోలు

# విప్రో బైబాక్ తేదీ ఖరారు

**బెంగళూరు, మే 23:** దేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థ విప్రో ఇటీవల ఏప్రిల్‌లో 2025-26 ఆర్థిక సంవత్సరం క్యూ4 ఫలితాల్ని ప్రకటన సందర్భంలోనే షేర్ హోల్డర్లకు ఒక బంపర్ ఆఫర్ ప్రకటించింది. రూ.15 వేల కోట్ల విలువైన షేర్ బైబ్యాక్ ఆఫర్ చేయగా ఇప్పుడు దీనికి రికార్డ్ డేట్ ప్రకటించింది. 2026, జూన్ 5 ను రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది. ఆతేదీ లోపు విప్రో షేర్లను కలిగి ఉంటే షేర్ బైబ్యాక్‌కు అర్హత సాధిస్తారు. విప్రో షేర్లను ఆ తేదీ లోపు కొనుగోలు చేసి డీమ్యాట్ ఖాతాలో ఉంచుకుంటే బైబ్యాక్‌కు అర్హత సాధిస్తారు. అర్హులైన షేర్ హోల్డర్లు ఇందులో టెండర్ ఆఫర్ ద్వారా పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఈ మేరకు రికార్డు తేదీ గురించి స్టాక్ ఎక్స్ఛేంజీలకు విప్రో సమాచారం అందించింది. రూ. 2 ఫేస్ వాల్యూ (ముఖ విలువ) కలిగిన ఒక్కో షేరును రూ. 250 చొప్పున తిరిగి కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. మొత్తం 60 కోట్ల షేర్లను టెండర్ ఆఫర్ ప్రాసెస్ ద్వారా విప్రోనే తిరిగి షేర్ హోల్డర్ల దగ్గరి నుంచి కొనుగోలు చేస్తుంది.

విప్రో షేరు ధర వారాంతపు సెషన్‌లో రూ. 203 వద్ద ముగియగా.. దాని కంటే సుమారు 25 శాతం వరకు అధిక ధర చెల్లించి తిరిగి షేర్లను కొనుగోలు చేస్తుండటం విశేషం. ఈ లెక్కన షేర్ హోల్డర్లకు స్వల్ప కాలంలో మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. జనవరి మార్చి త్రైమాసికంలో విప్రో లాభం కూడా 2 శాతం తగ్గింది. మరోవైపు ఐటీ స్టాక్స్‌లో ఒకవైపు తీవ్ర అమ్మకాల ఒత్తిడి పెరిగిన సమయంలో విప్రో ఇలా బైబ్యాక్ ప్రకటించడం గొప్ప విషయంగా మార్కెట్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కంపెనీ తన సొంత వాటాలను బహిరంగ మార్కెట్ నుంచి లేదా ప్రస్తుత వాటాదారుల నుంచి నేరుగా తిరిగి కొనుగోలు చేసే ప్రక్రియనే షేర్ బైబ్యాక్ అంటారు. షేర్ బైబ్యాక్ ద్వారా కంపెనీ తన వద్ద ఉన్న మొత్తం షేర్ల సంఖ్యను తగ్గిస్తుందని చెప్పొచ్చు. ఇలా మార్కెట్లో షేర్ల సంఖ్య తగ్గడం వల్ల ఒక్కో షేరుపై వచ్చే ఆదాయం పెరుగుతుంది. ఇంకా కంపెనీనే అధిక ధర చెల్లించి తిరిగి కొనుగోలు చేయడం వల్ల వాటికి డిమాండ్ పెరిగి.. షేరు ధర మళ్లీ పెరిగే అవకాశం ఉంటుంది. డివిడెండ్ ద్వారా కంపెనీ తన లాభాల్ని షేర్ హోల్డర్లతో పంచుకునేందుకు ప్రత్యామ్నాయంగా షేర్ బైబ్యాక్ ఆప్షన్ ఎంచుకుంటుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14